- యూపీలో బీజేపీ ఎంపీపై భార్య పోటీ
- త్వరలో వాట్సాప్‌లో సుప్రీంకోర్టు సేవలు
- ఐఐటీయన్లకు ప్లేస్‌మెంట్స్‌లో నో జాబ్స్
- హార్లిక్స్ హెల్త్ డ్రింక్ కాదు న్యూట్రిషనల్ డ్రింక్
- ప్రైవేటు ఆస్తిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' లో..

శుక్రవారం FRIDAY 26.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+10+4 Pages: 10+10+4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 322 ‖ వెల (Price) రూ.6.50 | విదియ

శుక్రవారం, సూర్యోదయం: 5-53, సూర్యాస్తమయం: 6-35, శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: విదియ ఉదయం 7-46 వరకు, తదుపరి తదియ. నక్షత్రం: అనురాధ తెల్లవారుజామున 3-41 వరకు. వర్జ్యం: ఉదయం 6-37 నుంచి ఉదయం 8-18 వరకు. రాహుకాలం: ఉదయం 10-39 నుంచి పగలు 12-13 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-26 నుంచి ఉదయం 9-17 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-39 నుంచి పగలు 1-29 వరకు. అమృతకాలం: సాయంత్రం 4-44 నుంచి సాయంత్రం 6-25 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రైతుబంధు ఉంటదో.. ఊడుతదో!



'మీ వడ్లకు 500 బోనస్ అందిందా?' కేసీఆర్ ప్రశ్న
'లేదు.. లేదు.. లేదు' ఎలుగెత్తి నినదించిన ప్రజలు.

'మీకు 15 వేల రైతు భరోసా అందిందా?' కేసీఆర్ ప్రశ్న.
'లేదు.. లేదు.. లేదు' చేతులెత్తి జవాబిచ్చిన జనం.

'నేనిచ్చిన 10 వేల రైతుబంధు అయినా ఈ సారి మీకు పడిందా?' కేసీఆర్ ప్రశ్న.
'పడలేదు.. పడలేదు..' ఉద్రేకంతో దద్దరిల్లేలా అరిచిన ప్రజలు.

'మరి ఈ రైతుబంధు ఉంటదో.. ఊడుతదో? మీ కోసం.. ఎవరు కొట్లాడాలె?' కేసీఆర్ ప్రశ్న.
'కేసీఆర్.. కేసీఆర్.. కేసీఆర్..' దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వని.

ప్రజల తరఫున కొట్లాడే పంజు ఎవరు?.. కేసీఆర్ ప్రశ్న
'కేసీఆర్.. కేసీఆర్..' జనం ఉత్సాహం

'అందరం కలిసి యుద్ధం చేద్దాం కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాలె.' కేసీఆర్ ఉద్బోధ.

ఐదు ఎకరాలకే ఇస్తమంటే.. ఆరేడు ఎకరాలున్నోడు ఎటు పోవాలె? మీ అబ్బ జాగీరు పోతున్నదా?. మీ ముల్లె ఏమన్న పోతున్నదా? రైతులకు బెంజ్ కార్లు ఉన్నయా? కోట్ల ఆస్తులు ఉన్నయా?

- పంటల బోనస్ బోగస్.. తులం బంగారం తుస్సు
- పొలాలకు కరెంటు కట్.. ధాన్యం కొనుగోల్‌మాల్
- మన బిడ్డలకు స్కూటీలు రాలె.. లూటీలు వచ్చినయ్
- గురుకులాల్లో పిల్లలకు విషాహారం పెడుతున్నరు
- అడ్డగోలుగా విద్యుత్తు బిల్లులు.. ప్రజలు గొల్లుగొల్లు
- కండ్ల ముందు తెలంగాణ ఎండుతుంటే ఊరుకోవాల్నా?
- తెలంగాణ కష్టపడ్డదే కాంగ్రెస్‌తో.. నష్టపడ్డదే బీజేపీతో
- మళ్లా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నరు?
- దేవుడి పేరుతో బీజేపీ ఓట్లు దండుకుంటున్నది
- దేవుడి మీద ఒట్లతో కాంగ్రెస్ కాలం గడుపుతున్నది
- భువనగిరి రోడ్ షోలో దునుమాడిన కేసీఆర్
- సూర్యాపేట నుంచి భువనగిరి దాకా బస్సుయాత్ర

దేవుడు నన్ను తెలంగాణ కోసమే పుట్టించిండు. ఇయ్యాల రైతుల గుండెల్లో, తెలంగాణ ప్రజల హృదయాల్లో కనిపించేది కేసీఆర్. కేసీఆర్ గుండె చీల్చితే కనిపించేది తెలంగాణ. నా ప్రాణం ఉన్నంత వరకు, భగవంతుడు నాకు శక్తి ఇచ్చినంతవరకు తెలంగాణలో ఎవ రికి అన్యాయం జరిగినా నిద్రపోను. భూమి, ఆకాశం ఒక్కటి చేసి, పిడుగులు పడ్డంత పోరాటం చేస్తా

మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నరా? కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం ఇస్తున్నరా? నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తున్నరా? జాబ్ క్యాలెండర్ ప్రక టించారా? మెగా డీఎస్సీ ప్రకటన వచ్చిందా?

మోదీ హయాంలో రూపాయి విలువ పడిపోయింది, మహిళలకు రక్షణ లేదు, దేశంలో పేదరికం పెరిగిపోయింది, ఇలా అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పట్టించుకోకుండా అక్షింతలు కలపాలె.. తీర్థం పుచ్చుకోవాలె, పులిహోర ప్రసాదం తినాలె, ఊరేగింపులు తియ్యాలె. అక్షింతలు, పులిహోర, తీర్థాలు, కాషాయ జెండాల ఊరేగింపులు మన కడుపు నింపుతయా? మన పొలాలకు నీళ్లు తెస్తయా?

› వివరాలు లోపలి పేజీల్లో

ముగ్గురు నేతన్నల బలి

24 గంటల్లో ముగ్గురి మృతి.. సిరిసిల్లలో మరణ మృదంగం



సిరిసిల్ల పట్టణంలో ఆత్మహత్య చేసుకున్న ఆడిచర్ల సాయి కుటుంబసభ్యులను ఓదార్చుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్

ఉమ్మడి రాష్ట్రంలో ఉరిసిల్లగా మారిన సిరిసిల్లలో మళ్లీ ఆనాటి దౌర్భాగ్యస్థితి దాపురిస్తున్నది. కేసీఆర్ సర్కారు దిద్దుబాటు చర్యలతో, అండదండలతో పదేండ్లపాటు బతుకు భరోసా పొందిన నేతన్న.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ఆగమాగమైపోతున్నడు. ప్రభుత్వం నుంచి వర్క్ ఆర్డర్లు అందక, నేసిన బట్టల్ని కొనేవారులేక మీ బతుకేందని అడిగే వాడు కనిపించక రాష్ట్ర వ్యాప్తంగా నేతన్న చితికిపోతున్నడు. గత 24 గంటల్లోనే సిరిసిల్లలో ఏకంగా ముగ్గురు నేత కార్మికులు ఉరికొయ్యకు వేలాడి ప్రాణాలు తీసుకున్నారు. కాంగ్రెస్ పరిపాలన రాష్ట్రాన్ని మళ్లీ పాతరోజులకు తీసుకుపోతున్నదనే హెచ్చరికను జారీ చేశారు. › 3

కాంగ్రెస్‌లో అగ్రకుల రాజ్యం!

- 12 జనరల్ ఎంపీ సీట్లలో 9 ఓసీలకే
- రెడ్డి సామాజిక వర్గానికి 7 స్థానాలు
- మొక్కుబడిగా బీసీలకు మూడు సీట్లు
- బీఆర్‌ఎస్‌లో బీసీలకే అగ్రతాంబూలం
- 12 జనరల్ ఎంపీ స్థానాల్లో 6 బీసీలకు
- రెడ్డి సామాజిక వర్గానికి నాలుగు సీట్లు
- బీఆర్‌ఎస్‌లో సామాజిక సమన్యాయం

రాష్ట్రంలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలకుగానూ 3 ఎస్సీలకు, 2 ఎస్టీలకు రిజర్వు చేయగా, మిగతావి (12) జనరల్ స్థానాలు. అధికార కాంగ్రెస్ పార్టీ 12 జన రల్ సీట్లలో 9 స్థానాలను అగ్రకు లాలకు కట్టబెట్టింది. అందులో 7 సీట్లను ఏకంగా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించింది. › 4



భువనగిరి.. గులాబీ ఝరి | భువనగిరి వినాయక చౌరస్తాలో జరిగిన రోడ్ షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

రైతుబంధు ఉంటదో.. ఊడుతదో!

పంటల బోనస్ బోగస్.. తులం బంగారం తుస్సు • భువనగిరి రోడ్‌షోలో దునుమాడిన కేసీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. తీరా తాము ఇచ్చిన రూ.పది వేలు కూడా ఇవ్వడం లేదని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. రైతుబంధు ఉంటదో.. ఊడతదో.. అని ఆందోళన వ్యక్తంచేశారు. మిల్లర్ల కాడ కమీషన్లు తీసుకొని, ధాన్యం కొనుగోళ్లను గోల్‌మాల్ చేశారని ఫైరయ్యారు. బోనస్ ధర బోగస్‌గా మారిందని, కల్యాణలక్ష్మితోపాటు ఇస్తామన్న తులం బంగారం తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. బస్సుయాత్రలో భాగంగా కేసీఆర్ గురువారం భువనగిరిలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టి కాంగ్రెస్ ముంచితే, గత పదేండ్లలో బీజేపీ భారీగా నష్టం చేసిందని మండిపడ్డారు. పదేండ్లలో తెలంగాణకు ఏమీ ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ దొంగ హామీలు ఇచ్చి గద్దెనెక్కి, ఇప్పుడు అమలు చేయకుండా తిప్పలు పెడుతున్నదని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలూ తెలంగాణకు ద్రోహం చేశాయని, దేవుడిని అడ్డం పెట్టుకొని ఓట్ల కోసం నాటకాలు ఆడుతున్నాయని బీజేపీ, కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. తనను భగవంతుడు తెలంగాణ కోసమే పుట్టించాడని, తన ప్రాణం ఉన్నంతవరకు తెలంగాణలో ఎవరికి అన్యాయం జరిగినా కొట్లాడుతానని స్పష్టం చేశారు.

రూపాయి పతనం.. బీజేపీ పాలనా ఫలితం

బీజేపీ పదేండ్ల పాలనలో దేశంలో ఏ ఒక్క వర్గానికీ న్యాయం జరగలేదని కేసీఆర్ విమర్శించారు. మేకిన్ ఇండియా, సబ్ కా సాథ్-సబ్‌కా వికాస్ అంటూ నినాదాలు ఇచ్చారని, వాటివల్ల ఎవరికైనా, ఏమైనా లాభం జరిగిందా? అని ప్రశ్నించారు. దేశంలో 18 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, మోదీ ప్రభుత్వం వాటిని భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. 'ఇది న్యాయమా? అన్యాయమా?' అని ప్రజలను ప్రశ్నించగా.. 'అన్యాయం' అంటూ సమాధానం వచ్చింది. 'బేటీ పఢావో.. బేటీ బచావో అన్నరు. కానీ, ఏ బేటీకైనా పఢాయించిండా? ఏ బేటీనైనా బచాయించిండా? బీజేపీ రాష్ట్రాల్లో మహిళలపై దాడులు జరుగుతున్నా యి.' అని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ పాలనలో రూపాయి విలువ డాలర్‌తో పోల్చితే రూ.83కు దిగజారిందని విమర్శించారు. 'అంతర్జాతీయంగా ఇదీ భారత్ గౌరవం. బీజేపీ పరిపాలన ఫలితం' అని దుయ్యబట్టారు.

తెలంగాణ నష్టపోయిందే బీజేపీ వల్ల

తెలంగాణ భారీగా నష్టపోయిందే బీజేపీ వల్ల అని కేసీఆర్ స్పష్టంచేశారు. ఇప్పుడు బీజేపీకి ఓటేస్తే తెల్లారి నుంచే మీటర్లు పెట్టాలంటారని హెచ్చరించారు. కాబట్టి రైతులు ఆలోచించి ఓటేయాలని కోరారు. గతంలో పోరాడి ఎయిమ్స్‌ను భువనగిరి తెచ్చుకున్నామని గుర్తు చేశారు. తాను ఎన్ని లేఖలు రాసినా, ఢిల్లీకి వెళ్లి వినతి పత్రాలు ఇచ్చినా బీజేపీ హయాంలో తెలంగాణకు ఒక్క నవోదయ విద్యాసంస్థగానీ, మెడికల్ కాలేజీ గానీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు బీజేపీ నుంచి పోటీ చేస్తున్న వ్యక్తి, అప్పుడు ఎంపీగా ఉన్నాడని, ఇప్పుడు ఏం ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నాడని నిలదీశారు. గత ఎన్నికల్లో తప్పిపోయి ఓటేస్తే నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచారని, అందులో ఒకరు కేంద్ర మంత్రి అయ్యారని చెప్పారు. అయినా వాళ్లు ఒక్క రూపాయి అయినా తెచ్చారా? ఐదు రూపాయల పనైనా చేశారా? అని ప్రశ్నించారు. 'ఇప్పుడు గెలిపిస్తే ఏం చేస్తరు. పుసుపు కలుపుడు, బియ్యం కలుపుడు, అక్షింతలు కలుపుడు, ఊరూరుకు పంచుడు, పులిహోర వండుడు, పదిమందికి పెట్టుడు, ఓట్లు దొబ్బుడు' అని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో యువత ఆలోచించి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలను తల్లి కోడిలాగా కాపాడుకున్న

1956 నుంచి ఇప్పటిదాకా తెలంగాణకు శత్రువే కాంగ్రెస్ పార్టీ, 58 ఏండ్లు గోసపడ్డామని అని కేసీఆర్ పేర్కొన్నారు. 'ఈ తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లో సమైక్యవాదుల నుంచి విముక్తి కావాలె అని భగవంతుడు నన్ను తెలంగాణ కోసమే పుట్టించిండు. ఆనాడు ఎవరు లేకున్నా.. ఎవ్వరు ధైర్యం చేయకపోయినా, కచ్చితంగా ఈ తెలంగాణకు విముక్తి కావాలె, సొంత రాష్ట్రంగా ఉండాలె అని నేను ఒక్కడినే, జగదీశ్ రెడ్డి వంటి పదిమంది మిత్రులతో కలిసి, ప్రజలను నమ్ముకొని ఉద్యమం మొదలుపెట్టిన. 15 ఏండ్లు నిరాటంకంగా పోరాడితే నాడు కేంద్రం తలవంచి తెలంగాణ ఇచ్చింది' అని వివరించారు. 'నేను తెచ్చుకున్న రాష్ట్రంలో.. ఒక తల్లి కోడి తన పిల్లలను కాపాడుకున్నట్టు నా ప్రజలను.. ఈ వర్గం, ఆ వర్గం అని లేకుండా అందరినీ ఆదరించుకున్నం. అందరినీ కాపాడినం' అని వివరించారు.

రైతులు కనిపిస్తలేరా?

తెలంగాణలో 2104కు ముందు రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారని, వలసలు పోయేవారని, భగవంతుడి దయవల్ల అవన్నీ బంద్ చేశామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ మంచిగైందని సంతోషపడ్డామని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాత్రి కరంటు పెట్టబోయి చనిపోయినవాళ్లు, పొలం ఎండిపోతే గుండె ఆగిపోయినోళ్లు 225 మంది దాకా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వాళ్లను పరామర్శించి, కుటుంబాలను ఆదుకోవాలని సీఎంను కోరితే పట్టించుకోలేదని మండిపడ్డారు. గతంలో రైతుబీమా ప్రవేశపెట్టామని, రైతు మరణిస్తే రూ.5 లక్షలు వారంలోనే వాళ్ల ఇంటికి డబ్బులు వచ్చేవని చెప్పారు. కానీ ఇప్పుడు సీఎంగానీ, మంత్రులుగానీ, ఎమ్మెల్యేలు గానీ పరామర్శించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. 'రైతులంటే మీకు కనవడుతలేరా? అంత అగ్గువ అయిపోయిర్రా? అధ్వానం అయిపోయిర్రా?' అని మండిపడ్డారు. రైతుల వివరాలను 48 గంటల్లో పంపితే ఆదుకుంటా అని సీఎం చెప్తే.. తాను నాలుగు గంట్లలోనే ఫొటోలు, ఫోన్ నంబర్లతో సహా పంపానని కేసీఆర్ గుర్తు చేశారు. అయినా ఇప్పటివరకు ఎవ్వరూ పరామర్శించలేదని చెప్పారు. 'రైతులకు ఏం బాధ ఇది, నా రైతులకు ఎందుకు రావాలె, నేను మంచిగ చేసుకున్న తెలంగాణ, మంచిగ పంటలు పండిన తెలంగాణ ఎందుకు నాశనం కావాలె' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వైఎస్ హయాంలో ప్రారంభిస్తే, కాంగ్రెస్ చేసిందంటూ తాము ఆపలేదని, అందరికీ ఇచ్చామని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఒక్క ప్రైవేట్ కాలేజీకి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఐదు నెలలుగా కాలేజీల్లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఇలాగైతే పిల్లలకు చదువు ఎట్లా చెప్తారని ప్రశ్నించారు. తాము 1100 గురుకులాలు పెట్టామని, అందులో చదువుకున్న పిల్లలు కలెక్టర్లు, ఇంజినీర్లు, డాక్టర్లు అయితున్నరని చెప్పారు. గురుకులాల్లో పిల్లలకు విషాహారం పెడుతున్నరని, కల్తీ అన్నం పెడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. 135 మంది విద్యార్థులు దవాఖానల్లో పడ్డారని, నలుగురైదుగురు చనిపోయారని, భువనగిరిలోనే ఒక అమ్మాయి చనిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఇదేనా జరగాల్సిన పద్ధతి. ప్రభుత్వం ఏం చేస్తున్నది?' అని ప్రశ్నించారు. 'నా కండ్ల ముందటనే తెలంగాణ ఎండిపోతుంటే యుద్ధం చేయాల్నా? వద్దా? అందరం కలిసి చేద్దామా?' అని ప్రశ్నించగా.. 'చే ద్దాం.. చేద్దాం.. చేద్దాం' అంటూ సమాధానం వచ్చింది. తన కంఠంలో ప్రాణమున్నంతవరకు ప్రజలతోనే, ప్రజల కోసమే ఉంటానని చెప్పారు.



భువనగిరి వినాయక చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్

> ఈ తెలంగాణ మీది, భవిష్యత్తు మీది, ఈ రాష్ట్రాన్ని ముందుకు నడిపేది మీరు. ఈ ఎన్నికల్లో ఏం జరుగుతున్నది? ఎవరికి ఓటేస్తే ఈ రాష్ట్రానికి మేలు జరుగుతది? అని ఆలోచించి, బుద్ధితో ఓటేయాలి. పిచ్చిలో, ఉన్మాదంలో కాకుండా, ఆలోచనతో, ప్రజాస్వామ్య పరిణతితో ఓటేస్తే మనకు, మన రాష్ట్రానికి, ప్రజాస్వామ్యానికి మంచి జరుగుతది. -కేసీఆర్

కాంగ్రెస్ ఒట్లు నమ్మేటట్టు ఉన్నయా?

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి, ఇప్పుడు అమలు చేయకుండా మోసం చేస్తున్నదని కేసీఆర్ మండిపడ్డారు. చేనేత కార్మికులకు సగం ధరకే రసాయనాలు ఇచ్చామని, ఆర్డర్లు ఇచ్చి వాళ్ల బతుకులు కాపాడామని గుర్తు చేశారు. ఇప్పుడు అవి కూడా బంద్ పెట్టారని విమర్శించారు. తాము రెండుసార్లు రైతులకు రూ.30 వేల కోట్లు రుణమాఫీ చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 9 నాడు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, వరికి రూ.500 బోనస్ ఇస్తామన్నారని చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. పైగా ఇప్పుడు.. వచ్చేసారి ఇస్తామంటూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని మండిపడ్డారు. వాళ్ల ఒట్లు నమ్మేటట్టు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అన్న వస్త్రానికి పోతే.. ఉన్న వస్త్రం పోయిందన్నట్టుగా గృహజ్యోతి పథకం తయారైందని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. గతంలో రూ.800 కరెంటు బిల్లు వచ్చేదని, ఇప్పుడు రూ.1,500 వస్తున్నదని మొత్తుకుంటున్నారని చెప్పారు. ఆడపిల్లలకు, యువతులకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇస్తామన్నారని, 'స్కూటీలు రాలేదు కానీ.. లూటీలు మాత్రం నడుస్తున్నయి' అని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నరా? కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం ఇస్తున్నరా? నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇస్తున్నరా? జాబ్ క్యాలండర్ ప్రకటించారా? మెగా డీఎస్సీ ప్రకటన వచ్చిందా? అని ప్రజలను ప్రశ్నించగా.. 'రాలేదు..రాలేదు' అనే సమాధానం వచ్చింది. 'తులం బంగారం తుస్సుమన్నది? బోనస్ బోగస్ అయ్యింది' అని ఎద్దేవా చేశారు.



భువనగిరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి

క్యామ మల్లేశ్ ప్రజల మనిషి

భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ పట్టుదల, నిజాయితీ ఉన్న నాయకుడని కేసీఆర్ కొనియాడారు. బాగా చదువుకొన్న వ్యక్తి, 24 గంటలు ప్రజల కోసమే పని చేసే వ్యక్తి, రాజకీయంగా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి అని కేసీఆర్ పేర్కొన్నారు. మంచి ఆస్తిపరుడని, ఆయన డబ్బుల కోసం రాజకీయాల్లోకి రాలేదని వివరించారు. ఇటువంటి వ్యక్తులు గెలిస్తే ప్రజలకు తలలో నాలుకలాగా ఉంటారని, ప్రజల్లో ఒకడిగా ఉంటారని చెప్పారు. బలహీనవర్గాల అభ్యర్థైన మల్లేశ్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఇదే తరహా ఉత్సాహాన్ని ఎన్నికల వరకు కొనసాగించి కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో మల్లేశ్‌ను గెలిపించాలని ప్రజలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



జనగామ జిల్లా దేవరుప్పల వద్ద కేసీఆర్ బస్సుయాత్రలో పాల్గొన్న ఎర్రబెల్లి

కేసీఆర్ గుండె చీల్చితే కనిపించేది తెలంగాణ


భగవంతుడు తెలంగాణ కోసమే తనను పుట్టించాడని కేసీఆర్ అన్నారు. 'ఇయ్యాల రైతుల గుండెల్లో, తెలంగాణ ప్రజల హృదయాల్లో కనిపించేది కేసీఆర్. కేసీఆర్ గుండే చీల్చితే కనిపించేది తెలంగాణ. నా ప్రాణం ఉన్నంతవరకు, భగవంతుడు నాకు శక్తి ఇచ్చినంతవరకు తెలంగాణలో ఎవరికి అన్యాయం జరిగినా నిద్రపోను. భూమి, ఆకాశం ఒక్కటి చేసి, పిడుగులు పడ్డంత పోరాటం చేస్తా' అని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక దుర్మార్గమైన సుడిగాలి వచ్చి, బీఆర్ఎస్ ఓడిపోయిందని చెప్పారు. అయినా తనకు బాధ లేదని, పార్టీ అంటే ఓడినా, గెలిచినా ప్రజల్లో ఉండాలని, ప్రజల కోసం పని చేయాలని చెప్పారు. దొంగ హామీలు ఇచ్చి, ప్రజలను బురిడీ కొట్టించి, చల్లగా ముందుకు పోతున్న రాష్ట్రాన్ని ఆగం చేసిన కాంగ్రెస్ మెడలు వంచుతామని చెప్పారు. వాళ్లు ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఊర్లల్లో పంచాయితీ పడితే రెండువైపులా పంజులను పెట్టుకుంటారని పేర్కొన్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రజలకు.. వాగ్దానాలను భంగం చేసి, రైతాంగం నోట్లో మట్టికొట్టి, నిరుద్యోగ యువతను, మహిళలను మోసం చేసిన కాంగ్రెస్‌కు మధ్య పంచాయితీ పడ్డదని వివరించారు. 'ప్రజల తరఫున కొట్లాడే పంజు ఎవరు?' అని ప్రశ్నించగా.. 'కేసీఆర్.. కేసీఆర్' అని సమాధానం వచ్చింది. 'మీరు నన్ను కింద పడగొట్టినా.. కేసీఆర్ కొట్లాడాల్నా?' అని అడడగా 'కొట్లాడాలె.. కొట్లాడాలె' అంటూ భారీ ఎత్తున స్పందన కనిపించింది.

ఒకరివి ఓట్లు.. ఇంకొకరివి ఒట్లు

'ఇప్పుడు రాష్ట్రంలో ఒక పార్టీ దేవుని పేరు చెప్పి ఓట్లు అడుక్కుంటున్నది. ఇంకోపార్టీ ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుని మీద ఒట్లు వేస్తున్నది. ఒకరేమో ఓట్లు, ఇంకొకరేమో ఒట్లు' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో అద్భుతమైన యాదాద్రి దేవాలయం నిర్మించుకున్నామని గుర్తుచేశారు. 'ఎన్నడన్నా యాదాద్రి దేవాలయాన్ని, యాదగిరిగుట్టను ఓట్ల కోసం వాడుకున్నమా?' అని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలకు, బీఆర్ఎస్‌కు ఇదే తేడా అని స్పష్టంచేశారు. బీఆర్ఎస్‌ను 'బీ టీమ్' అంటూ బీజేపీ, కాంగ్రెస్ నాటకాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. 'భువనగిరిలో ఏం జరిగింది? బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయిపోయి బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌ను దింపేశారు. ఇప్పుడు కాంగ్రెసోడు చైర్మన్, బీజేపీవోడు వైస్ చైర్మన్. మరి ఎవరు ఎవరికి బీ టీం?' అని ప్రశ్నించారు.

ధాన్యం కొనుగోలు గోల్‌మాల్

బీఆర్ఎస్ హయంలో రైతులను అన్నివిధాలా ఆదుకున్నామని కేసీఆర్ చెప్పారు.. దేశంలోనే మొదటిసారిగా రైతులకు ఏటా ఎకరానికి రూ.10 వేలు ఇచ్చే రైతుబంధును ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. బ్రహ్మాండంగా సాగునీరు అందించామని చెప్పారు. భువనగిరిలో బస్వాపూర్ ప్రాజెక్టుకు పూర్తి చేశామని, నీళ్లు వస్తాయని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ రూ.10 వేలు ఇస్తే, మేము రూ.15 వేలు ఇస్తం, కేసీఆర్ రూ.లక్ష మాఫీ చేస్తే, మేము రూ.2 లక్షలు మాఫీ చేస్తమన్నారని గుర్తు చేశారు. రైతుబంధు అందరికీ వచ్చిందా? అని ప్రశ్నించగా 'పడలేదు.. పడలేదు' అని పెద్ద ఎత్తున సమాధానం వచ్చింది. మూడు ఎకరాలకు ఇస్తాం, ఐదు ఎకరాలకు ఇస్తామని కొర్రీలు పెడుతున్నారని మండిపడ్డారు. 'ఐదు ఎకరాలకే ఇస్తమంటే.. ఆరేడు ఎకరాలున్నోడు ఎటు పోవాలె. మీ అబ్బ జాగీరు పోతున్నదా? మీ ముల్లె ఏమన్న పోతున్నదా? రైతులకు బెంజ్ కార్లు ఉన్నయా? కోట్ల ఆస్తులు ఉన్నయా?' అని ధ్వజమెత్తారు. మరోవైపు, ప్రాజెక్టుల నుంచి సరిగా నీరు విడుదల చేయకుండా పంటలు ఎండబెట్టారని విమర్శించారు. వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకుపోతే కొనే దిక్కు లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర సరిగా ఇవ్వడం లేదని విమర్శించారు. 'మిల్లర్ల కాడ కమీషన్లు తీసుకొని, వీళ్లు కొనుగోలుకు ముందుకొస్తలేరు. కొనుగోలును గోల్‌మాల్ చేసినరు' అని మండిపడ్డారు.



భువనగిరి రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



నిరుద్యోగ భృతి ఇస్తామనలేదని ప్రమాణం చేస్తరా?

- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టలేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారని, అది నిజమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్ రెడ్డి సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలను మాయచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రతి మహిళకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతుభరోసా రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, యువతులకు స్కూటీలు, విద్యార్థులకు క్రెడిట్ కార్డులు ఇస్తా అని ఎందుకు ప్రమాణం చేస్తలెవ్.? అని సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి, మాట తప్పావని, హామీలను ఫలానా తేదీలోగా పూర్తిచేస్తానని ఎందుకు దేవుళ్ల మీద ఒట్టు వేస్తలెవ్.? అని ప్రశ్నించారు. ఎగ్గొట్టేవాడే ఎక్కువగా ప్రమాణాలు చేస్తడని, అట్లనే రేవంత్‌రెడ్డి కూడా కచ్చితంగా ఎగ్గొడతాడు కాబట్టే, కనిపించిన ప్రతీ దేవుడి మీద ప్రమాణం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని, రేవంత్‌రెడ్డి ముఖంలో, మాటల్లో ఫ్రస్టేషన్ కనిపిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని, ఎలాగైనా నమ్మించాలని చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తమను నమ్మడం లేదనే విషయాన్ని, తనకు తానే బయటపెట్టుకుంటున్నారన్నారు.

రెండోరోజూ అదే జోరు

కేసీఆర్ బస్సుయాత్రకు జన నీరాజనం

పల్లెపల్లెనా పూలవర్షం.. ఘన స్వాగతం • జననేత కోసం గంటల ఎదురుచూపులు

గులాబీవనమైన భువనగిరి పట్టణం • విజయవంతంగా సాగుతున్న యాత్ర



హైదరాబాద్/నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)/దేవరుప్పుల: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రలో రెండో రోజూ అదే హోరు కొనసాగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి మొదలై సూర్యాపేట వరకు సాగింది. రాత్రి అక్కడే బసచేశారు. యువత, గులాబీ శ్రేణులు పెద్దసంఖ్యలో అక్కడికి తరలిరావడంతో క్యాంప్ గులాబీతోటను తలపించింది. కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు యువత పోటీపడ్డారు. ఉదయం నుంచి భువనగిరికి బయలుదేరేంత వరకు ఫొటోలు దిగడం విశేషం. కేసీఅర్ స్థానిక నేతలు, యువతను, మహిళా నేతలను పేరుపేరునా పలకరించడంతో సంబురపడ్డారు. గురువారం సాయంత్రం సూర్యాపేట నుంచి కేసీఆర్ బస్సు యాత్ర భువనగిరికి పయనమైంది. కేసీఅర్ బయటకు వస్తుంటే పెద్ద సంఖ్యలో అప్పటికే గుమికూడిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొట్టారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సు బయటకు వస్తుంటే టాటా చెప్తూ వీడ్కోలు పలికారు. సూర్యాపేట దాటి కొద్దిదూరం రాగానే తిమ్మాపూర్ వద్ద పెద్దసంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు గుమికూడారు. కేసీఆర్‌ను చూసి చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. బస్సుపై పెద్ద ఎత్తున పూల వర్షం కురిపించారు. యువకులు పటాకులు కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అర్వపల్లిలోనూ భారీ ఎత్తున ప్రజలు బస్సుకు ఎదురేగి పార్టీ జెండాలు చేతబట్టి పూలు చల్లారు. జై కేసీఆర్... జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. తిరుమలగిరిలోనూ పార్టీ కార్యకర్తలు, మహిళలు కేసీఆర్‌ను చూసేందుకు తరలి వచ్చారు. కేసీఆర్ బస్సును చూడగానే కేరింతలు కొడుతూ చేతులెత్తి జై కొట్టారు. కేసీఆర్ అన్ని చోట్లా బస్సులో నుంచే అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ ముందుకు సాగారు.

దేవరుప్పులలో కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం

జనగామ జిల్లా దేవరుప్పుల వద్ద బస్సు యాత్రకు మాజీ మంత్రి ఎర్రబెల్లితోపాటు వందలాది నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. దూరంగా ఫుట్‌పాత్‌పై నిలబడిన మాజీ మంత్రి ఎర్రబెల్లిని గమనించిన కేసీఆర్ నవ్వుతూ బస్సెక్కాలని సైగ చేశారు. బస్సెక్కిన ఎర్రబెల్లి కేసీఆర్ పక్కన కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. గంట వ్యవధిలో ఇంత మంది రావడంపై ఎర్రబెల్లిని కేసీఆర్ అభినందించినట్టు తెలిసింది. బస్సు యాత్ర జనగామ, ఆలేరు, మీదుగా భువనగిరికి చేరుకున్నది. మార్గమధ్యంలో ప్రతి పల్లెలోనూ కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపించింది. పూలు చల్లుతూ, పటాకులు పేల్చుతూ, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నీరాజనం పలికాయి. చేతులు ఊపుతూ, బస్సు యాత్రను మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీస్తూ ప్రజలు మురిసిపోయారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి జననేత కేసీఆర్‌కు జేజేలు పలికారు. బిల్డింగులపై నుంచి బస్సుయాత్రను ఫొటోలు తీసుకున్నారు.

జనసంద్రంగా భువనగిరి

తొలిరోజు మిర్యాలగూడ, సూర్యాపేటల్లో కిక్కిరిసిన జనంతో పోటీ పడేలా భువనగిరి పట్టణం కూడా జనసంద్రంగా మారింది. కేసీఆర్ రాక కోసం మధ్యాహ్నం నుంచే పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడం కనిపించింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, బస్సులు, డీసీఎంల్లో వచ్చిన ప్రజలు సాయంత్రం 5 గంటల వరకే భువనగిరికి చేరుకున్నారు. సాయంత్రానికి ఎటు చూసినా గులాబీ దళమే కనిపించింది. భువనగిరికి నలు వైపులా నుంచి తరలి వచ్చిన జనంతో భారీ సందడి నెలకొన్నది. కేసీఆర్ భువనగిరికి చేరుకొని కొద్దిసేపు వివేరా హోటల్‌లో టీ బ్రేక్ తీసుకున్నారు. సరిగ్గా ఏడుగంటలకు అక్కడి నుంచి బయలుదేరి భువనగిరి పట్టణంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది. పట్టణ శివారు నుంచే ప్రజలు బస్సుయాత్రకు ఎదురేగి స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ మీదుగా పాత బస్టాండ్ నుంచి కేసీఆర్ రోడ్ షో మొదలైంది. డప్పుల నృత్యాలు, మహిళల బోనాలు, డోలు వాయిద్యాల నడుమ భారీ జన సందోహంతో రోడ్ షో కొనసాగింది. కిక్కిరిసిన జనాలతో అరగంటపాటు రోడ్ షోలో కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రోడ్ షోలో పెద్దఎత్తున యువత చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిలింది. వినాయక చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు.

పంచులు... నిలదీతలు...

కేసీఆర్ బస్సులో నుంచి పైకి వస్తుంటే ఈలలు, కేరింతలు, చప్పట్లతో సభా ప్రాంతం దద్దరిల్లిపోయింది. అభిమాన నేతను చూస్తూ సీఎం సీఎం అని నినదించారు. దీనితో కేసీఆర్ వాళ్లను సముదాయించాల్సి వచ్చింది. కేసీఆర్ ప్రసంగం బీజేపీపై పంచులతో మొదలైంది. పదేండ్ల బీజేపీ పాలనలో దేశానికి ఏమైనా లాభం జరిగిందా అని కేసీఆర్‌ఆర్ ప్రసంగం మొదలుపెట్టగా లేదు.. లేదు.. అంటూ ప్రజలు స్పందించారు. ఒకరేమో దేవుని పేరుతో ఓట్లు అడుగుతున్నారని.. ఇంకొకరేమో దేవుళ్లపై ఒట్లు వేస్తూ ఓట్లు అడుగుతున్నారని పంచులు విసరగా జనం చప్పట్లతో స్పందించారు. కాషాయపు ఎజెండా కడుపు నింపుతదా, పొలాలకు నీళ్లు తెస్తదా ప్రజలు ఆలోచించాలని కోరగా తేదు.. తేదు.. అని సమాధానం వచ్చింది. ఇక కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగడుతుంటే మంచి స్పందన లభించింది. రైతుబంధు అందరికీ వచ్చిందా, రుణమాఫీ చేసిండా? అంటే.. లేదు.. లేదు.. అని అరుపులు పెట్టారు. ప్రజల పక్షాన కొట్లాడే పంచు ఎవరంటే... కేసీఆర్.. కేసీఆర్ అంటూ జనం చప్పట్లతో సమ్మతి తెలిపారు. క్యామ మల్లేశ్‌ను గెలిపించి బీఆర్ఎస్‌కు బలమియ్యాలని కోరగా హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో జరిగిన రెండు రోజుల బస్సు యాత్ర బీఆర్ఎస్ శ్రేణుల్లో ఫుల్ జోష్‌ను నింపింది.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమైతాంది



కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా ఆగమైతాంది. సాగు, తాగు నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ఏ పథకం సక్కగ ఇస్తలేరు. ప్రజలంతా ఉక్కిరి బిక్కిరి అవుతున్నరు. మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలంతా కోరుకుంటున్నరు. అందుకే ఆయన బస్సు యాత్రకు ప్రజలు వేలాదిగా వస్తున్నరు. జనాలంతా ఆయనకే మద్దతు తెలుపుతున్నరు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం.

-గునగంటి సైదులుగౌడ్, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం

కేసీఆర్ సారు దేవుడసోంటోడు



కేసీఆర్ సారు దేవుడసోంటోడు. ప్రజలను సొంత బిడ్డల్లెక్క చూసుకుండు. అనేక పథకాలను ఇచ్చి మాలాంటి పేదోళ్ల గుండెల్లో నిలిచిపోయిండు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి ప్రజలు ఓటేసినందుకు గిప్పుడు బాధ పడుతున్నరు. గిప్పుడు ప్రభుత్వం నుంచి పేదలకు ఏం వస్తలేదు. నీళ్లు, కరెంటు సరిగ ఇస్తలేరు. పింఛన్లు పెంచలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే బాగుండె. మళ్లీ ఆయనే రావాలి.

-రేగు గౌరమ్మ, వీరవెల్లి, భువనగిరి మండలం



మాజీ సీఎం కేసీఆర్‌తో రైతు ధరావత్ నర్సింహ

రైతు నర్సింహకు కేసీఆర్ భరోసా

- ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ అధినేత

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 25 : కాళేశ్వరం నీళ్లు రాకపోవడంతో ఎండిన పంట చేనులో పండుకొని రోదించిన రైతు ధరావత్ నర్సింహకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధైర్యం చెప్పారు. బుధవారం రాత్రి రోడ్‌షో అనంతరం సూర్యాపేటలో బసచేసిన కేసీఆర్ సూర్యాపేట మండలం దుబ్బతండాకు చెందిన ధరావత్ నర్సింహను పిలుపించుకొని మాట్లాడారు. దగ్గరకు తీసుకొని ఓదార్చారు. ఆయనతో ఫొటో దిగి ఆత్మస్థైర్యం నింపారు. ఎన్ని ఎకరాల భూమి ఉంది? ఏం పంటలు వేశావు.. అని కేసీఆర్ అడిగారు. నర్సింహ స్పందిస్తూ.. 'సార్ నాకు అరెకరం భూమి ఉంది. మీరు సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన కాళేశ్వరం నీళ్లతో నా భూమితోపాటు ఇంకో నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పెట్టాను. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నీళ్లు ఇవ్వడం లేదు. దాంతో పొట్ట మీద ఐదెకరాల పంట ఎండిపోయింది' అని ఆవేదన వ్యక్తం చేశాడు. కేసీఆర్ స్పందిస్తూ..ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన సమస్యలని, రైతులందరి సహకారంతో సర్కారుపై పోరాటం చేద్దామని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రం సాధించిన మనకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ లెక్కనా.. రైతులందరూ ధైర్యంగా ఉండాలి. మళ్లీ మనమే వస్తాం.. కాళేశ్వరం నీళ్లు తెచ్చుకుందాం. ధైర్యం కోల్పోవద్దు' అని అభయమిచ్చారు.

తిరిగొచ్చిన మెరుపు కేసీఆర్

ప్రజల ముందుకు మునుపటి కేసీఆర్

మళ్లీ కనిపించిన ఉద్యమనాయకుడు.. కష్టాలు చెప్పకుని కన్నీరు కార్చిన రైతన్న

తమ బతుకులు మళ్లీ గాడిన పడతాయని ఆశ.. అన్నదాతలో భరోసా నింపిన బీఆర్ఎస్ అధినేత

కేసీఆర్ బస్సు యాత్ర

రెండోరోజు డైరీ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): గండాల సుడిగుండాల నుంచి తెలంగాణను అవలీలగా దాటించిన నేర్పరి.. చిక్కుముడులను తెంపిన తీర్పరి.. మాటలను దట్టించే మందుగుండు. తెలంగాణను చక్కదిద్దిన నైపుణ్యశీలి. ఆయన మరెవరో కాదు.. తెలంగాణ స్వప్నికుడు.. సాధకుడు కేసీఆర్. కాలు బయటపెట్టిన రెండు రోజులకే తెలంగాణ తిరిగి ఉద్యమ కేసీఆర్‌ను కండ్లారా చూస్తున్నది. తెగుడుతున్న నాల్కలకు ఆయన మాటలు విచ్చుకత్తులవుతున్నయ్. కేసీఆర్ మాటల తూటాలకు ప్రత్యర్థుల్లో వణుకు మొదలైతే, తెలంగాణ మళ్లీ మునుపటి కేసీఆర్‌ను దగ్గర్నుంచి చూస్తున్నది. కేసీఆర్ బస్సుయాత్ర మరో చరిత్రకు సాక్షీభూతం కానున్నది. బస్సుయాత్రతో రెండు రోజుల్లో మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరిలో ప్రసంగిన కేసీఆర్ తనలో ఉద్యమం నాటి వాడివేడి ఇంకా మిగిలే ఉందని, తాను రంగంలోకి దిగితే విరుచుకుపడుతున్న విపక్షాలు ముడుచుకోవలసిందేనని నిరూపించారు. ఉద్యమనేతగా కేసీఆర్ 2003 ఆగస్టు 25 నుంచి ఆగస్టు 30 వరకు కోదాడ నుంచి హాలియా వరకు చేపట్టిన పాదయాత్రను తాజా బస్సుయాత్ర గుర్తుకు తెచ్చింది. నాడు పిడికిలెత్తి తమ వెంట నడిచిన కేసీఆర్‌కు రైతులు జేజేలు పలుకుతున్నరు. కేసీఆర్ పాలనను గుర్తుకు తెచ్చుకుని సంబరపడుతున్నరు. పదేండ్లలో రెండేసి పంటలు ఎలా పడించుకోగలిగామో, ఇప్పుడు తొలిపంటకే ఎలాంటి కష్టాలు పడుతున్నామో గుర్తుచేసుకుని ఆవేదన చెందుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం కేసీఆర్ పాదయాత్ర చేసిన తర్వాత తమ బతుకులు బాగుపడ్డట్టుగానే.. కళతప్పిన తమ బతుకులు ఇప్పుడు మళ్లీ కేసీఆర్ బస్సు యాత్రతో గాడినపడతాయని ఆశగా ఉన్నారు.

రైతులకే ఎక్కువ సమయం

బుధవారం హైదరాబాద్ నుంచి బయల్దేరిన కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించింది మొదలు రైతులతో మాట్లాడేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అన్నేపర్తి, అర్జాలబావి, మిర్యాలగూడ, తిప్పర్తి, సూర్యాపేట, తిరుమలగిరి, అర్వపల్లి, భువనగిరి ఇలా ఎక్కడికి వెళ్లినా రైతుల ఎజెండాగానే మాట్లాడారు. రైతులను దగ్గరకు పిలిపించుకొని మాట్లాడారు. ప్రభుత్వ పనితీరు, అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలతో మాట్లాడి స్థానిక పరిస్థితులు తెలుసుకున్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట చేరుకున్న కేసీఆర్ అక్కడ మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నివాసంలో బసచేసిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిషోర్, భగత్, రవీంద్రనాయక్, నల్లమోతు భాస్కర్‌రావు తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులతో రోడ్ షో ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం సూర్యాపేట జిల్లాకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలతో ముచ్చటించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఆ తరువాత జనగామ జిల్లా మీదుగా భువనగిరికి పయనమయ్యారు. పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పులలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. కేసీఆర్‌కు అపూర్వ స్వాగత ఏర్పాట్లు చేశారు. జనగామ పొలిమేరలో కేసీఆర్‌కు స్వాగతం పలికిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనతో కలిసి బస్సుయాత్రలో పాల్గొన్నారు. హైదరాబాద్–వరంగల్ హైవేపై ఉన్న వివేరా హోటల్‌లో చాయ్ తాగారు. ఆ తర్వాత పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశం, పైలా శేఖర్‌రెడ్డితో కలిసి భువనగరి రోడ్‌షోలో పాల్గొన్నారు. తొలిరోజు కాంగ్రెస్, బీజేపీని సున్నితంగా హెచ్చరించి వదిలిపెట్టిన కేసీఆర్.. రెండోరోజు విరుచుకుపడ్డారు.



ప్రభుత్వంపై ఆక్రోశం

కేసీఆర్ బస్సుయాత్ర సందర్భంగా రోడ్లపై ఎక్కడ చూసినా రైతులే. తమ మొర ఆలకించాలంటూ కేసీఆర్‌ను కలిసి తమ కష్టాలు వెళ్లబోసుకోవడం రాష్ట్రం పరిస్థితికి అద్దం పడుతున్నది. కల్లాల వద్ద ధాన్యం కుప్పలను చూపించి కొందరు, రైతుబంధు రాలేదని మరికొందరు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాల్వల్లో నీళ్లు మాయమయ్యాయని కొందరు.. కొన్న పంటకు డబ్బులు ఇవ్వడం లేదని ఇంకొందరు తమ కష్టాలను కన్నీళ్ల రూపంలో బయటపెట్టారు.

కేసీఆర్‌తో చర్చించే స్థాయా నీది?

- తెలంగాణకు నువ్వు చేసిందేమిటి?
- నీ అవగాహన, అనుభవం ఎంత?
- ఎంపీ సీట్లలో సామాజిక న్యాయం ఏదీ?
- సామాజిక న్యాయం పాటించింది బీఆర్ఎస్సే
- రేవంత్‌రెడ్డిపై పొన్నాల లక్ష్మయ్య ఫైర్



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంపై చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరే స్థాయి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఎద్దేవా చేశారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డి చేసిందేమిటి? తెలంగాణ సాధన, అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో రేవంత్‌రెడ్డి పాత్ర, అనుభవం, అవగాహన ఎంత? అని ప్రశ్నించారు. తెలంగాణ సాధన, అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర ఏనాడూ మరువలేనిదని స్పష్టంచేశారు. తాము కూడా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గేను చర్చకు రావాలని సవాల్ విసరగలుగుతామని పేర్కొన్నారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న భాషపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 120 రోజుల పరిపాలనపై, హామీల అమలుపై ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు. చర్చలనేవి వాస్తవాలు తెలుసుకోవడానికి, సమస్యల పరిష్కారానికి అనువుగా ఉండాలని, రాజకీయ ఆధిపత్యం, ఓట్ల కోసం ఉండొద్దని హితవు చెప్పారు. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రంలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక రాయితీలు ఇచ్చిందని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో చెప్తున్న లెక్కలన్నీ తప్పు అని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో ఇంకా వరి కోతలు ప్రారంభంకాలేదంటూ ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తుంటే, అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు ఉత్తమ్ చెప్పుకోవడం విడ్డూరమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ధాన్యం లెక్కలు ఎందుకు లేవని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ నుంచి ఏపీ నీళ్లు తీసుకొనిపోతుంటే నోరుమెదపని అసమర్థ మంత్రి ఉత్తమ్ అని మండిపడ్డారు.

సామాజిక న్యాయం ఏదీ?

కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ల కేటాయింపులో సామాజికవర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని, బీసీలకు మూడు మాత్రమే ఇచ్చారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మాత్రం బీసీలకు ఆరు సీట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. 2014, 2018, 2023, 2024 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన సీట్లలో సామాజిక న్యాయం, కాంగ్రెస్ ఇచ్చిన సీట్లతో సామాజిక న్యాయాన్ని పరిశీలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలోనూ కాంగ్రెస్ వెనకబడిన వర్గాలకు అన్యాయం చేసిందని మండిపడ్డారు.

మైనార్టీల హామీల అమలుపై తేదీలను ప్రకటిస్తావా?

- రేవంత్‌కు బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలుపై తేదీని ప్రకటించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు మైనార్టీ డిక్లరేషన్ పేరుతో 13 హామీలను ఇచ్చారని, వాటిలో ఒక్క దాన్నీ ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కొండంత.. అమలు గోరంత అని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మండిపడ్డారు. రేవంత్ మంత్రివర్గంలో మైనార్టీ వర్గానికి చెందినవ్యక్తి ఒక్కరూ లేరని తెలిపారు. జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇంతవరకు వాటి ఊసే ఎత్తలేదని విమర్శించారు. మైనార్టీల బడ్జెట్‌ను రూ.4వేల కోట్లకు పెంచుతామని, చెప్పి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప, ఏనాడూ ముస్లింలపై చిత్తశుద్ధి చూపలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ముస్లిం కుటుంబమైనా బాగుపడిందా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని మైనార్టీలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని విన్నవించారు.


అంకారపు మల్లేశం (ఫైల్)


అడిశర్ల సాయి (ఫైల్)


ఇంటి ముందు రోదిస్తున్న సాయి తల్లిదండ్రులు కైలాసం, పద్మ, అన్న మహేందర్


రాజు భార్య రేఖ, కొడుకు దేవీప్రసాద్ (ఇన్‌సెట్‌లో) రాజు(ఫైల్)

ముగ్గురు నేతన్నలు బలి

- 24 గంటల్లో ఉరికొయ్యకు వేలాడిన కార్మికులు
- సిరిసిల్లలో మరణమృదంగం
- ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం
- కార్ఖానా సమీపంలోనే చెట్టుకు ఉరేసుకుని ఒకరు..
- ఇంట్లోనే ఉరేసుకుని మరొకరు..
- ఆకలి చావుతో ఇంకొకరు..
- బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శ


సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని ఇందిరానగర్‌లో నేతకార్మికుడు అంకారపు మల్లేశం కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25 (నమస్తేతెలంగాణ) / సిరిసిల్ల రూరల్ : కార్మిక క్షేత్రం సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల పరంపర మళ్లీ మొదలైంది. 24 గంటల్లోనే ముగ్గురు నేత కార్మికులు ప్రాణాలు వదిలారు. ఇందులో ఇద్దరు ఉరివేసుకొని బలవన్మరణం చెందగా.. మరొకరు ఉపాధి దొరక్క.. ఆకలితో అలమటించి ఊపిరి విడిచారు. కేసీఆర్ పాలనలో చేతినిండా పనితో ధీమాగా బతికిన కార్మిక లోకం, కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ఉపాధి లేక ఆగమవుతున్నది. వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో కార్ఖానాలు మూతపడి పనులు లేక, ఆర్థిక ఇబ్బందులతో నేతకార్మికులు ఆత్మహత్యల బాటపడుతున్నారు. సిరిసిల్ల పర్యటనలోనే ఉన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన అంకారపు మల్లేశం(55)కు భార్య భారతి, కొడుకు మహేందర్, కూతురు మనీషా ఉన్నారు. భార్య బీడీలు చుడుతుండగా, ఆయన మరమగ్గాలు నడుపుతుంటారు. రెండేండ్ల క్రితం కూతురి పెండ్లి చేశాడు. నాలుగు నెలల క్రితం భార్యకు కాలు విరగడంతో చికిత్స కోసం ఖర్చు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు మొదలయ్యాయి. కాంగ్రెస్ సర్కార్ వస్త్ర పరిశ్రమకు బకాయిలు చెల్లించక పోవడంతో పాటు కొత్త ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మరమగ్గాలు మూతపడ్డాయి. దీంతో నేత కార్మికులకు నాలుగు నెలలుగా పనిలేకుండా పోయింది. కుటుంబాలను పోషించుకోలేక, అప్పులు కట్టలేక మనోవేదనకు గురైన మల్లేశం గురువారం ఉదయం కార్ఖానా సమీపంలోనే చింత చెట్టుకు నైలాన్ తాడుతో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. ఆయన భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి లేక ప్రాణం తీసుకున్న కార్మికుడు

సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన అడిశర్ల కైలాసంకు భార్య పద్మ, ఇద్దరు కొడుకులు మహేందర్, సాయి, కూతురు మౌనిక ఉన్నారు. కూతురి పెండ్లి చేశారు. కైలాసంకు పదేండ్ల క్రితమే పక్షవాతం వచ్చి కాలు చెయ్యి పడిపోయింది. వైద్యఖర్చుల కోసం రూ.పది లక్షలు అప్పు అయ్యింది. చిన్నపాటి పెంకుటిల్లు కూలిపోవడంతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. పెద్దకొడుకు మహేందర్ మెడికల్ ఏజెన్సీలో గుమస్తాగా పనిచేస్తున్నారు. చిన్న కొడుకు అడిశర్ల సాయి (26) సిరిసిల్ల పట్టణంలోని ఓ వస్త్ర యజమాని వద్ద మరమగ్గాలకు బీములు పోసే (వార్పిన్) పనిచేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత వస్త్రపరిశ్రమలో సంక్షోభంలో పడింది. వార్పిన్లు కూడా బంద్‌కావడంతో సాయి ఉపాధి కోల్పోయారు. ఇంటి వద్దే ఉండి తండ్రిని చూసుకుంటున్నారు. నాలుగు నెలలుగా పనిలేకపోవడంతో మానసికంగా కుంగిపోయారు. ఇంటి అద్దె చెల్లించలేక, కుటుంబాన్ని పోషించలేక మనస్తాపం చెందారు. గురువారం సాయంత్రం సాయి ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరిసిల్ల నేతన్న ఆకలి చావు

సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన ఈగ రాజు(50) ఆకలితో అలమటించి ప్రాణాలు కోల్పోయారు. ఈయనకు భార్య రేఖ, కొడుకు దేవీప్రసాద్, కూతురు లక్ష్మీప్రసన్న ఉన్నారు. రాజు తన ఇంట్లో మూడు జోడీల సాంచాలు పెట్టుకున్నారు. ఆర్థిక స్థోమత లేక వాటిని నడిపించలేక సాంచాలను ఏడాది కింద అమ్ముకున్నారు. అక్కడ ఇక్కడా సాంచాలు నడుపుకొంటూ కుటుంబాన్ని పోషిస్తూనే కూతురు, కుమారుడిని చదివిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల నేత కార్మికులకు చేతినిండా పనికల్పించడంతో నెలకు రూ.15 వేల వరకు వేతనం తెచ్చేవాడని అతని భార్య రేఖ తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆర్డర్లు లేక సాంచాలు బంద్ కావడంతో నాలుగు నెలలుగా ఖాళీగానే ఉంటున్నారు. ఏదోఒక పనిచేస్తానంటూ 15 రోజుల క్రితం చెప్పకుండానే ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వెళ్లిన రాజు ఫోన్ చేయకపోవడంతో ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు రామడుగు మండలం వెదిర గ్రామ సమీపంలో బుధవారం శవమై దొరికాడు.మృతదేహం అప్పటికే బక్కచిక్కి, రంగుమారిపోయింది. ఉపాధివేటలో తిరిగి ఆకలితో అలమటించి చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యాపిల్లలపై ఒట్టేస్తవా?

- రేవంత్‌రెడ్డీ.. అంత దమ్ముందా?
- రుణమాఫీపై దేవుళ్లపై ఒట్టేసుడు కాదు
- మీ పాలనలో ఉరితాళ్లకు నేతన్నలు
- మాపై కోపంతో నేతన్నలపై కక్ష
- 24 గంటల్లో ప్రభుత్వం స్పందించాలె
- లేదంటే నేతన్నల కోసం రోడ్డెక్కుతాం
- మోదీ 2 కోట్ల ఉద్యోగాలు ఎమాయె?
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నేత కార్మికుల కుటుంబాలకు తక్షణ సహాయంగా 50 వేలు


రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్/రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'ఆగస్టు 15న రుణ మాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు పెట్టడం కాదు.రేవంత్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే భార్యాపిల్లలపై ఒట్టు వేసి చెప్పాలి' అని సీఎంకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అధికారంలోకి రావాలన్న ఆశతో కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించిందని,మహిళలకు రూ.2,500,కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేల పెన్షన్ వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 150 రోజులు అవుతున్నా అంతా సున్నా అని ధ్వజమెత్తారు. గురువారం సిరిసిల్ల తెలంగాణభవన్‌లో ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సాయంత్రం 7 గంటలకు కోనరావుపేటలో బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికులు అడిశర్ల సాయి, అంకారపు మల్లేశం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకొని తక్షణ సాయంగా రూ.50 వేల చొప్పున అందజేశారు. రెండు రోజుల్లో మళ్లీ వస్తానని, నేతన్నలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'పాలిచ్చే బర్రెను అమ్ముకుని దున్నపోతును కొనుక్కున్నట్టు ఇప్పుడు తెలంగాణ ప్రజల పరిస్థితి ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ పునరావృతమయ్యాయి. రైతుబంధు ఇప్పటికీ పడలేదు. జనవరి ఆసరా పింఛన్లు ఎగ్గొట్టిండు. రాబోయే రోజుల్లో రైతుబంధు ఎగ్గొట్టడని గ్యారెంటీ ఏంటి? కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదు' అని తెలిపారు.

నేతన్నల బతుకులు తలకిందులు

'సిరిసిల్లలో 2009లో శాసనసభ్యుడిగా ఎన్నికైన సందర్భంలో బాధాకరమైన పరిస్థితులు ఉండేవి. 2007లో కూడా వారంలో 8, 9 మంది నేతకార్మికులు వరుసగా ఆత్మహత్యలు చేసుకున్నరు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారుతున్నదని చెప్పినా, కార్మికులు ఆర్తనాదాలు చేసినా అప్పటి కాంగ్రెస్ సర్కారు పట్టనట్టు వ్యవహరించింది.ఆనాడు కేసీఆరే పార్టీ నుంచి రూ.50లక్షలు పద్మశాలీలకు అందించి, సూక్ష్మరుణాలతో ఆదుకున్నారు' అని కేటీఆర్ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నేతన్న చనిపోకుండా, వారికి ధైర్యాన్ని ఇచ్చి, బ్రహ్మాండమైన పాలసీలు చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, బతుకమ్మ చీరల ఆర్డర్లు, చేనేత బంధు, చేనేత బీమా పథకాలను తీసుకొచ్చి ఉపాధి కల్పించామని చెప్పారు. 'ఇప్పుడు చాలా దురదృష్టం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగునెలల్లో ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నరు. ఇవాళ ఒకే రోజు సిరిసిల్లలో యువ నేతకార్మికుడు అడిచర్ల సాయి, తంగళ్లపల్లిలో నేతకార్మికుడు అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే' అని మండిపడ్డారు. బాగా నడుస్తున్న పరిశ్రమను కేవలం కేసీఆర్, కేటీఆర్ నియోజకవర్గం అన్న కోపంతో రేవంత్‌రెడ్డి వేధించటం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొనాలని, పెండింగ్ బకాయిలు 24 గంటల్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నేతన్నల కోసం తాము రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయాలు

ప్రజలు మళ్లీ దొంగల మాటలు నమ్మి మోసపోవద్దని కేటీఆర్ సూచించారు. ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన మోదీ మాయలో పడొద్దని అన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఎటుపోయాయని బీజేపీని ప్రశ్నించారు. పదేండ్లలో మోదీ సర్కారు దేశ ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకే దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. చేసిన అభివృద్ధి చెప్పమంటే జైశ్రీరాం అంటారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు అమిత్‌షా చెప్పులు మోసేవాడు కాదు.. కరీంనగర్ ప్రజలకు అభివృద్ధి చేసే నాయకుడు కావాలని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 12 ఎంపీ సీట్లు అప్పజెప్పితే ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారు వస్తుందని అన్నారు. సిరిసిల్లలో నేతకార్మికుల వరుసగా ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం సీఎం రేవంత్‌రెడ్డే అని వినోద్‌కుమార్ ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ఒక్క ఆత్మహత్య జరగలేదని, ఇప్పుడు ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నేత గూడూరి ప్రవీణ్, రాఘవరెడ్డి, గజభీంకార్ రాజన్న, పడిగెల రాజు, బొల్లి రామ్మోహన్, అంకారపు రవీందర్, బండి జగన్, అంకారపు అనిత, అబ్బాడి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఐఎఫ్‌ఆర్‌లో ఉన్నత విద్యావకాశాలు

- కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ) : టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ హైదరాబాద్‌లో కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీకి నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్సీ చదివిన వారు సింథటిక్ కెమిస్ట్రీ, కెమికల్ బయాలజీ, బయోఫిజికల్ కెమిస్ట్రీ, సర్ఫేస్ అండ్ ఇంటర్‌ఫేషియల్ కెమిస్ట్రీ, థియరిటికల్ అండ్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీతోపాటు, బయోఫిజిక్స్, లేజర్ ఫిజిక్స్, ఫొటోనిక్స్, సాఫ్ట్ అండ్ యాక్టివ్ మ్యాటర్, మెటీరియల్ ఫిజిక్స్ వంటి అంశాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 30 కాగా, మే 10 లోపు కెమిస్ట్రీలో దరఖాస్తు చేసుకునే వీలుంది.

30న జహీరాబాద్‌లో మోదీ రోడ్‌షో

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ ఈనెల 30న సాయంత్రం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, తెలంగాణలో ప్రధాని పర్యటించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. తిరిగి మే 2,3 తేదీల్లో ఏపీ పర్యటనకు వస్తారని, ఈ సందర్భంగా మరోసారి తెలంగాణలో పర్యటించే అవకాశం ఉన్నదని వెల్లడించాయి.

కాంగ్రెస్‌లో అగ్రకుల రాజ్యం!

- 12 జనరల్ ఎంపీ సీట్లలో 9 ఓసీలకే
- రెడ్డి సామాజిక వర్గానికి 7 స్థానాలు
- మొక్కుబడిగా బీసీలకు మూడు సీట్లు
- బీఆర్‌ఎస్‌లో బీసీలకే అగ్రతాంబూలం
- 12 జనరల్ స్థానాల్లో 6 బీసీలకు
- రెడ్డి సామాజిక వర్గానికి 4 సీట్లు
- బీఆర్‌ఎస్‌లో సామాజిక న్యాయం



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు గురువారంతో గడువు ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన సామాజిక సమీకరణలపై స్పష్టత వచ్చింది. రాష్ట్రంలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలకుగాను 3 ఎస్సీలకు, 2 ఎస్టీలకు రిజర్వు చేయగా, మిగతావి (12) జనరల్ స్థానాలు.అధికార కాంగ్రెస్ పార్టీ 12 జనరల్ సీట్లలో 9 స్థానాలను అగ్రకులాలకు కట్టబెట్టింది. అందులో 7 సీట్లను ఏకంగా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించింది. రాష్ట్ర జనాభాలో సగాని కంటే ఎక్కువగా దాదాపు 55 నుంచి 60 శాతం బీసీ జనాభా ఉండగా, ఈ వర్గాలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించింది. మొక్కుబడిగా 3 సీట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది. బీసీ జనాభాలో అత్యధికంగా ఉన్న యాదవ, గౌడ సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించింది. ఎస్సీలలో అత్యధికంగా 70 లక్షల మంది మాదిగల జనాభా ఉండగా, ఎస్సీలకు రిజర్వు చేసిన 3 సీట్లలో మాదిగలకు ఒకే ఒక సీటు (కడియం కావ్య-వరంగల్) కేటాయించి, తక్కువ జనాభా కలిగిన మాల సామాజిక వర్గానికి మాత్రం 2 సీట్లు (మల్లు రవి-నాగర్‌కర్నూల్), (వంశీకృష్ణ-పెద్దపల్లి) కేటాయించింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో కమ్మ సామాజిక వర్గం గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నప్పటికీ వారికి ఒక్క సీటు కూడా కేటాయించలేదు. ఇది ఆ సామాజికవర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

బీఆర్‌ఎస్‌లో బీసీలకు పెద్ద పీట

ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో అణగారిన వర్గాలకు అగ్రతాంబూలం ఇచ్చింది. 12 జనరల్ స్థానాల్లో ఆరింటిని బీసీలకు కేటాయించింది. బీసీలలోనూ కులాల వారీగా సమతూకం పాటించింది. కాంగ్రెస్ యాదవ, గౌడ సామాజిక వర్గాలను విస్మరించింది. బీఆర్‌ఎస్ మాత్రం గౌడ సామాజికవర్గం నుంచి తీగుళ్ల పద్మారావు (సికింద్రాబాద్), యాదవ సామాజికవర్గం నుంచి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (హైదరాబాద్), క్యామ మల్లేశ్ (భువనగిరి)కు టికెట్లు కేటాయించింది. మాదిగల జనాభా ఎక్కువగా ఉండడంతో 3 రిజర్వుడు స్థానాల్లో రెండు సీట్లను సుధీర్‌కుమార్ (వరంగల్), ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (నాగర్‌కర్నూల్) కేటాయించింది. కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి కేటాయించింది. రెడ్డి సామాజికవర్గానికి కాంగ్రెస్ ఏడు సీట్లు కేటాయించగా, బీఆర్‌ఎస్ మాత్రం నాలుగు సీట్లు మాత్రమే కేటాయించింది. కమ్మ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇస్తూ ఖమ్మం స్థానాన్ని నామా నాగేశ్వరరావుకు ఇచ్చింది.

కాంగ్రెస్‌లో సీట్ల కేటాయింపు

రెడ్డి సామాజికవర్గం
- నిజామాబాద్-టీ జీవన్‌రెడ్డి
- మల్కాజిగిరి-సునీతామహేందర్‌రెడ్డి
- చేవేళ్ల-గడ్డం రంజిత్‌రెడ్డి
- మహబూబ్‌నగర్-చల్లా వంశీచంద్‌రెడ్డి
- నల్లగొండ-కే రఘువీర్‌రెడ్డి
- భువనగిరి-చామల కిరణ్‌కుమార్‌రెడ్డి
- ఖమ్మం-రామసహాయం రఘురాంరెడ్డి

బీసీలు
- సికింద్రాబాద్-దానం నాగేందర్ (మున్నూరు కాపు)
- మెదక్-నీలం మధు (ముదిరాజ్),
- జహీరాబాద్-సురేశ్ షెట్కార్ (లింగాయత్)

ఎస్సీ
- పెద్దపల్లి-వంశీకృష్ణ (మాల)
- నాగర్‌కర్నూల్-మల్లురవి(మాల)
- వరంగల్-కడియం కావ్య (మాదిగ)

ఎస్టీ
- మహబూబాబాద్-బల్‌రామ్ నాయక్(లంబాడీ)
- ఆదిలాబాద్-ఆత్రం సుగుణ (ఆదివాసీ)

మైనార్టీ
- హైదరాబాద్-సమీర్ వలీ ఉల్లా (మైనార్టీ)

వెలమ
- కరీంనగర్-వెలిచాల రాజేందర్‌రావు (వెలమ)

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు పెద్దపీట

బీసీలు
- నిజామాబాద్-బాజిరెడ్డి గోవర్ధన్ (బీసీ-మున్నూరు కాపు)
- జహీరాబాద్-గాలి అనిల్‌కుమార్ (బీసీ-మున్నూరు కాపు)
- చేవేళ్ల-కాసాని జ్ఞానేశ్వర్ (బీసీ-ముదిరాజ్)
- సికింద్రాబాద్-టీ పద్మారావు (బీసీ-గౌడ్)
- హైదరాబాద్-గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (బీసీ-యాదవ)
- భువనగిరి-క్యామ మల్లేశ్ (బీసీ-యాదవ)

రెడ్డి
- మెదక్- పీవెంకట్రామిరెడ్డి
- మల్కాజిగిరి-రాగిడి లక్ష్మారెడ్డి
- మహబూబ్‌నగర్-మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- నల్లగొండ-కంచర్ల కృష్ణారెడ్డి

ఎస్సీ
- పెద్దపల్లి-కొప్పుల ఈశ్వర్ (ఎస్సీ మాల)
- వరంగల్-ఎం సుధీర్‌కుమార్ (ఎస్సీ-మాదిగ)
- నాగర్‌కర్నూలు-ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఎస్సీ-మాదిగ)

ఎస్టీలు
- ఆదిలాబాద్-ఆత్రం సక్కు (ఆదివాసీ)
- మహబూబాబాద్-మాలోతు కవిత (ఎస్టీ-లంబాడీ)

ఇతరులు
- కరీంనగర్-బీ వినోద్‌కుమార్ (వెలమ)
- ఖమ్మం-నామా నాగేశ్వర్‌రావు (కమ్మ)


దిలావర్‌పూర్‌లో ప్రొఫెసర్ కోదండరాంను నిలదీస్తున్న మహిళా రైతులు

కోదండరాంపై అన్నదాతల ఆగ్రహం

- మాపై కేసులున్నప్పుడేమయ్యారు
- ఇప్పుడెందుకొచ్చారంటూ నిలదీత

నిర్మల్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు నిరసన సెగ తగిలింది. మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ పనులను కొనసాగించకుండా చర్యలు తీసుకుంటామంటూ గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతలోనే పలువురు ముందుకు వచ్చి తాము ఇప్పుడు గుర్తుకు వచ్చామా? అంటూ నిలదీశారు. అక్రమ కేసులు నమోదు చేసినప్పుడు తమకు ఎవరూ అండగా నిలువలేదని, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని తమ వద్దకు మళ్లీ వచ్చారా? అంటూ ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆయన తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, కేవలం ఇథనాల్ పరిశ్రమను అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటంలో సంఘీభావం తెలిపేందుకే వచ్చానని చెప్పుకొచ్చారు. ఇక్కడి రైతులపై పెట్టిన కేసులను ఎత్తేసే వరకు టీజేఏసీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

'మంత్రి సీతక్కను బర్తరఫ్ చేయాలి'

- మావోయిస్టులకు మద్దతిచ్చేలా ఆమె కార్యకలాపాలు
- గవర్నర్, రాష్ట్రపతికి లేఖ రాసిన యాంటి టెర్రరిజం ఫోరం

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : మవోయిస్టులకు మద్దతునిచ్చేలా కార్యకలాపాలు సాగిస్తున్న మంత్రి సీతక్కను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు యాంటి టెర్రరిజం ఫోరం చైర్మన్ డాక్టర్ రావినూతల శశిధర్ గురువారం తెలిపారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు నాయకుడు సుధాకర్ అలియాస్ శంకరన్న గ్రామానికి మంత్రి వెళ్లి మావోయిస్టులకు నివాళులర్పించారని ఆరోపించారు. మాజీ నక్సలైట్ , పోలీసులకు లొంగిపోయి ఎమ్మెల్యేగా ఎన్నికైన సీతక్క ప్రస్తుతం మంత్రి పదవిలో ఉండి ప్రభుత్వ రహస్యాలు మావోయిస్టులకు చేర్చే అవకాశం ఉందన్నారు. కేంద్ర హోంశాఖ, రాష్ట్రపతికి కూడా మంత్రి సీతక్క వ్యవహారశైలిపై లేఖలు రాసినట్టు వివరించారు.

బిల్లుల కోసం పడిగాపులు

- సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు
- నెలాఖరు కావడంతో పెరుగుతున్న అర్జీలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ శాఖ అధికారుల చుట్టూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా నెలాఖరు కావడంతో ఆర్థిక శాఖ అధికారులకు బిల్లుకు సంబంధించిన టోకెన్ నంబర్లు సహా అర్జీలు దాఖలు చేస్తున్నారు. మూడు నెలల నుంచి తిరుగుతున్నా చిన్న చిన్న మెడికల్ బిల్లులు కూడా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ నంబర్లతో దరఖాస్తులు చేసుకుంటున్న వారిలో ఎవరికి క్లియర్ అవుతున్నాయో కూడా అర్థం కావడంలేదంటున్నారు. బాధితుల్లో ఎక్కువగా ఉపాధ్యాయులే. ఓ వైపు ఎండలు.. మరో వైపు ఎన్నికల కోడ్.. అయినా బిల్లుల కోసం బాధిత వర్గాలు నిత్యం వందల సంఖ్యలో సచివాలయానికి వస్తున్నారు. ఆర్థిక శాఖ వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు ఇప్పటికే ట్రెజరీలతో పాటు ఆయా డిపార్టుమెంట్ల నుంచి కూడా క్లియర్ చేయడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, ఇతర శాఖ మంత్రులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే యశస్వినికి నిరసన సెగ

- కష్టపడ్డా గుర్తింపు ఇస్తలేరు
- కొత్తగా వారిని పిలుస్తున్నరు
- రాయపర్తిలో కార్యకర్త ఫైర్



రాయపర్తి, ఏప్రిల్ 25: కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి కాకుండా, కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలానికి చెందిన పార్టీ కార్యకర్త షాజహాన్ స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డిని నిలదీశారు. మోసం చేస్తున్న వారిని పక్కన పెట్టుకుంటున్నారని, మొదటి నుంచి ఉన్న వారిని దూరం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ కుటుంబానికి చెందిన రూ.1.20 కోట్ల భూమి పోయిందని, అయినా పార్టీని పట్టుకుని ఉంటున్నామని, అయినా గుర్తింపు ఇవ్వడం లేదని షాజహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మోసం చేసి భూమి కొన్న వ్యక్తికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి వచ్చిన తమ భూమిని మోసం చేసిన వారిని దూరం పెట్టాలని వేడుకొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వనజారాణికి ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రశ్నించారు. మొదటి నుంచి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి చెప్పిన మాటలకు ఇప్పుడు జరుగుతున్న వాటికి పొంతన లేదని షాజహాన్ ఎమ్మెల్యేపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యకర్త నిలదీయడంతో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి తెల్లమొహం వేశారు.

దేవరకద్రలో కాంగ్రెస్ ప్రచారం బంద్

- పార్టీ ఆఫీసుపై దాడి చేసిన వ్యక్తిని చేర్చుకుంటారా?
- చిచ్చు రేపుతున్న ప్రదీప్‌గౌడ్ చేరిక
- ఎమ్మెల్యే ప్రోద్బలంతో సోషల్ మీడియాలో హల్‌చల్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో గ్రూపు తగాదాలు బయటపడుతున్నాయి. సాక్షాత్తు ఎమ్మెల్యేలు తమ ఆధిపత్యం కోసం నాయకులు, కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూడా. అసెంబ్లీ ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆ పార్టీలో ఉన్న బీసీ నాయకుడు ప్రదీప్‌గౌడ్ ఏకంగా పార్టీ కార్యాలయంపై దాడి చేసి ఫ్లెక్సీలను చింపి కుర్చీలను విరగ్గొట్టారు. మధుసూదన్‌రెడ్డికి వ్యతిరేకంగా వేరే పార్టీలో చేరి ఓడగొట్టేందుకు ప్రయత్నించారు. కాగా గురువారం ప్రదీప్‌గౌడ్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. దీంతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అనుచరులు ప్రదీప్‌గౌడ్ రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ఆయన వస్తే పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేస్తామని హెచ్చరించడంతో పార్టీలోని విభేదాలు బయటపడ్డాయి. ఇదంతా ఎమ్మెల్యేనే దగ్గరుండి చేయిస్తున్నాడని ప్రదీప్‌గౌడ్ అనుచరులు ఆరోపిస్తున్నారు.



పెరగనున్న ఆడీ కార్ల ధరలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ.. అన్ని రకాల మాడళ్ల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు జూన్ నుంచి అమలులోకి రానున్నాయి. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు రవాణా కోసం అధికంగా నిధులు వెచ్చించాల్సి వస్తున్నదని, దీంతో వాహన ధరలు పెంచకతప్పడం లేదని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 7 వేల యూనిట్ల వాహనాలను విక్రయించింది.

యాక్సెస్ మెడిటెక్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్, ఏప్రిల్ 25: బీమా టెక్ రంగంలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన యాక్సెస్ మెడిటెక్ భారీగా ఉద్యోగులను తీసుకోనున్నట్లు ప్రకటించింది. సంస్థ 17వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో కంపెనీ సీఈవో సయ్యద్ ఐజాజుద్దీన్ మాట్లాడుతూ..ఈ ఏడాది చివరిలోగా 30 శాతం నుంచి 40 శాతం వరకు ఉద్యోగులను పెంచుకోనున్నట్లు ప్రకటించారు. కొత్త మార్కెట్లు, కొత్త ఆవిష్కరణలే ఏజెండాగా పనిచేస్తున్న సంస్థ.. ఇందుకోసం నూతన టెక్నాలజీ నిపుణులను రిక్రూట్ చేసుకోనున్నట్లు తెలిపారు.

ఒలెక్ట్రా రికార్డు లాభం

హైదరాబాద్, ఏప్రిల్ 25: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.76.83 కోట్ల రికార్డు నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది నమోదైన లాభం కంటే 17.1 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 5.8 శాతం ఎగబాకి రూ.1,154.14 కోట్లకు చేరుకున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 8,232 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ లభించినట్లు, దీంతో ఇప్పటి వరకు 10 వేలకు పైగా ఆర్డర్లు లభించినట్లు అయింది.

కళ తప్పిన పారిశ్రామికం

వరుస ఎన్నికలతో కొత్త పెట్టుబడులకు బ్రేక్

పరిశ్రమ వర్గాల విశ్వాసం చూరగొనడంలో ప్రభుత్వ వైఫల్యం



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పారిశ్రామిక రంగంలో నిస్తేజం ఆవరించింది. కేసీఆర్ హయాంలో పెట్టుబడులతో కళకళలాడిన రాష్ట్రం ప్రస్తుతం పూర్తిగా అచేతనావస్థకు చేరుకున్నది. కొత్త పారిశ్రామిక విధానం తెస్తామని, ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు జంకుతున్నారు. ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడులను ఆకట్టుకోవడానికి కీలక నిర్ణయాలు తీసుకుంటుంటే.. అధికారంలోకి వచ్చి 4 నెలలైనా పారిశ్రామిక రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానంపట్ల స్పష్టత కొరవడింది. దీంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రతరమైంది. ఇక వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎలక్షన్లు జరగనుండటంతో మరికొంత కాలం పారిశ్రామిక రంగం పుంజుకునే అవకాశాలు లేవన్న అభిప్రాయాలున్నాయి. మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలో పలు పెట్టుబడులపై అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. దీనికితోడు నూతన ఎంఎస్‌ఎంఈ విధానాన్ని ప్రవేశపెడుతామని, చిన్నతరహా సంస్థలను ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు పలు రాయితీలనూ ఇస్తామని సీఎం ప్రకటించినా ఫలితం శూన్యం. ఫార్మాసిటీ అనుమతుల కోసం కేసీఆర్ సర్కార్ కేంద్రానికిచ్చిన ప్రతిపాదననూ నిలిపేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరడం బెడిసికొట్టింది. నల్గొండ, వికారాబాద్, మెదక్‌లలో ఈ-ఫార్మా విలేజ్‌లను తెస్తామని స్వయంగా సీఎం ప్రకటించినప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. దీంతో ఫార్మా రంగంలో నిస్తేజం ఆవరించింది.

గందరగోళంలో పారిశ్రామికవేత్తలు

కొత్త ప్రభుత్వంపై పారిశ్రామిక వర్గాల్లో విశ్వాసం కుదరడంలేదనే వాదన బలంగా వినిపిస్తున్నది. అధికార పార్టీ నేతల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలే దీనికి కారణమని, ప్రభుత్వ మనుగడ ఎలా ఉంటుందనేది పార్లమెంటు ఎన్నికలయ్యాకే తెలుస్తుందని పలువురు చెప్తున్నారు. కాంగ్రెస్ గెలిచే స్థానాలే కీలకమంటున్నారు. హామీల అమలులో విఫలం కావడంతో ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైంది. నిజానికి రాష్ట్ర విభజన తర్వాత చాలామంది పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వెళ్లి భూములు కొన్నా.. తెలంగాణలో కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న విధానాలు, నిరంతర విద్యుత్తు సరఫరాకు ఆకర్షితులై రాష్ట్రానికి తరలివచ్చారు.

పారిశ్రామికంపై దృష్టి సారించని సర్కార్..

అధికారంలోకి వచ్చి 4 నెలలైనా ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. సీఎం, పరిశ్రమల శాఖ మంత్రి విడివిడిగా పారిశ్రామికవేత్తలతో సమావేశమైనా ఫలితం లేకపోయింది. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్తు, పారిశ్రామిక అనుకూల విధానాలను ప్రవేశపెట్టారు. దీంతో పదేండ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు, దాదాపు 20 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయి. మొత్తమ్మీద రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు పారిశ్రామికరంగానికి ఓ కుదుపుగా చెప్పడంలో సందేహంలేదని పరిశ్రమవర్గాలు భావిస్తున్నాయి.

దివీస్ ల్యాబ్ 700 కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబ్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి రూ.700 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నది. కస్టమర్ల అవసరాల మేరకు మరో ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌కు సమీపంలోని ప్లాంట్‌తోపాటు వైజాగ్‌లో ఉత్పత్తి కేంద్రాలు ఉండగా..వీటితోపాటు కాకినాడ వద్ద యూనిట్‌ను నెలకొల్పడానికి ఇప్పటికే భూమిని కొనుగోలు చేసింది. దీర్ఘకాలికంగా కస్టమర్లతో పలు ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థ..అందుకు తగ్గట్టుగానే ప్రణాళికలను వేగవంతం చేసింది. దీంట్లో భాగంగా కొత్తగా రూ.650 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయబోతున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ నిధులను అంతర్గత వనరుల ద్వారా సేకరించనున్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. కాకినాడ ప్లాంట్ జనవరి 2027 నాటికి అందుబాటులోకి రావచ్చునని వెల్లడించింది.

సైయెంట్ లాభం 189 కోట్లు



హైదరాబాద్, ఏప్రిల్ 25: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.1,861 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.189 కోట్ల నికర లాభాన్ని గడించింది ప్రముఖ టెక్నాలజీ సంస్థ సైయెంట్. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయంతో పోలిస్తే 6.3 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, నికర లాభంలో 16 శాతం పెరుగుదల కనిపించింది. మొత్తం ఆదాయంలో డిజిటల్, ఇంజినీరింగ్, టెక్నాలజీ రంగాల నుంచి 80 శాతం సమకూరాయి. ప్రస్తుతం 902 మిలియన్ డాలర్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని, ఇంజినీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి పెట్టుబడులు పెట్టబోతున్నట్లు కంపెనీ ఎండీ కృష్ణ బొడనపు తెలిపారు. గతేడాదికిగాను రూ.30 డివిడెండ్‌ను ప్రకటించింది.

అడ్రస్ మారిన 17వేల క్రెడిట్ కార్డులు

ప్రకటించిన ఐసీఐసీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఇటీవల జారీ చేసిన దాదాపు 17,000 కొత్త క్రెడిట్ కార్డులు వివిధ డిజిటల్ పద్ధతుల్లో పొరపాటున ఒకరికి బదులు మరొకరి చేతికి వెళ్లాయని ఐసీఐసీఐ బ్యాంక్ గురువారం ప్రకటించింది. అయినప్పటికీ ఈ తప్పు వల్ల ఎటువంటి దుర్వినియోగం జరుగలేదన్న బ్యాంక్.. ఒకవేళ ఏదైనా ఆర్థిక నష్టం జరిగితే బాధిత కస్టమర్లకు దాన్ని పరిహారంగా చెల్లిస్తామని హామీ ఇచ్చింది. కాగా, కొత్త క్రెడిట్ కార్డులను వాడాలంటే కస్టమర్ల మొబైల్స్‌కు వచ్చే వన్-టైమ్ పాస్‌వర్డ్‌లు కీలకమని, కావున కార్డుల దుర్వినియోగం జరగడానికి చాలాచాలా తక్కువ వీలుందని నిపుణులు చెప్తున్నారు. మరోవైపు ఈ కార్డులన్నింటినీ ఇప్పటికే బ్లాక్ చేశామంటున్న ఐసీఐసీఐ బ్యాంక్.. తప్పుగా పంపిణీ అయిన కార్డులను తిరిగి వెనక్కి తీసుకోవడం వీలు కానందున, అసలు కస్టమర్లకు త్వరలోనే కొత్త కార్డులు వస్తాయన్నది. అయితే బుధవారం సాయంత్రం నుంచే ఈ వ్యవహారం.. పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండగా, దాన్నిప్పుడు బ్యాంక్ ధ్రువీకరించడం గమనార్హం. మరోవైపు ఈ తరహా నిర్లక్ష్యం మూలంగానే కొటక్ బ్యాంక్‌పై ఆర్బీఐ కొరడా ఝుళిపించిన నేపథ్యంలో ఇప్పుడు ఐసీఐసీఐ హాట్ టాపిక్కైంది.

404 లక్షల కోట్లకు బీఎస్ఈ మార్కెట్ క్యాప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో నమోదైన సంస్థల మార్కెట్ విలువ మునుపెన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో రూ.404.18 లక్షల కోట్లకు చేరింది. వరుస లాభాల నడుమ గడిచిన 5 రోజుల్లో మదుపరుల సంపద రూ.11.29 లక్షల కోట్లు ఎగిసింది. గురువారం 486.50 పాయింట్లు పుంజుకొని బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 74,339.44 వద్ద స్థిరపడింది. ఐదు రోజుల్లో సూచీ 1,850.45 పాయింట్లు లేదా 2.55 శాతం ఎగబాకడం విశేషం. ఈ క్రమంలోనే మార్కెట్ క్యాప్ రూ.11,29,363.01 కోట్లు అందుకుని రూ.4,04,18,411.32 కోట్లకు వెళ్లింది. ఇదిలావుంటే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 167.95 పాయింట్లు పెరిగి 22,570.35 వద్ద నిలిచింది.

క్రెడిట్ కార్డుల హవా

లావాదేవీల్లో నయా రికార్డు • మార్చిలో రూ.1.65 లక్షల కోట్లు


ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ కనిపిస్తున్న జోరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: క్రెడిట్ కార్డు ఆధారిత లావాదేవీలు రికార్డు స్థాయికి చేరాయి. గత నెలలో నిరుడుతో పోల్చితే 20 శాతం పుంజుకున్నాయి. అంతకుముందు నెల ఫిబ్రవరితో చూస్తే 10 శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే ఆన్‌లైన్‌లో నెలవారీ క్రెడిట్ కార్డుల వినియోగం తొలిసారి లక్ష కోట్ల రూపాయల మార్కును దాటింది. ఈ ఏడాది మార్చిలో రూ.1,04,081 కోట్లుగా ఉన్నది మరి. ఫిబ్రవరిలో ఇది రూ.94,774 కోట్లుగా ఉంటే, గత ఏడాది మార్చిలో రూ.86,390 కోట్లుగానే ఉన్నది. ఇక ఆఫ్‌లైన్‌లోనూ క్రెడిట్ కార్డు లావాదేవీలు (పాయింట్ ఆఫ్ సేల్-పీవోఎస్) 20 శాతం ఎగిశాయి. గత నెల రూ.60,505 కోట్లుగా ఉన్నాయి. క్రిందటి ఏడాది మార్చిలో ఇవి రూ.50,920 కోట్లు. ఈ ఫిబ్రవరిలో రూ.54,431.48 కోట్లుగా ఉన్నాయి. దీంతో అటు ఆన్‌లైన్, ఇటు ఆఫ్‌లైన్‌లలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీల విలువ ఈ మార్చిలో ఏకంగా రూ.1,64,586 కోట్లుగా నమోదైంది. ఏడాది క్రిందట ఇదే నెలలో రూ.1,37,310 కోట్లే. ఈ ఫిబ్రవరిలో మాత్రం రూ.1,49,205 కోట్లుగా ఉన్నది.

హెచ్‌డీఎఫ్‌సీ టాప్

క్రెడిట్ కార్డ్ మార్కెట్‌లో దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్‌లో ఉన్నది. ఈ మార్చి ఆఖరు నాటికి 20.2 శాతం వాటా దీనిదే. ఆ తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ 18.6 శాతంతో రెండో స్థానంలో ఉన్నది. మూడో స్థానంలో ఐసీఐసీఐ బ్యాంక్ కొనసాగుతున్నది. ఇక నిరుడు మార్చితో పోల్చితే ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ కార్డు వినియోగదారులూ పెరిగారు. దేశంలో క్రెడిట్ కార్డుల సంఖ్య 20 శాతం ఎగబాకి 10.1 కోట్లకు చేరింది. ఫిబ్రవరిలో మొదటిసారి 10 కోట్ల మార్కును దాటింది. నిరుడు మార్చిలో 8.5 కోట్ల క్రెడిట్ కార్డులే ఉండగా, ఏడాది కాలంలో దాదాపు 1.5 కోట్లకుపైగా పెరుగడం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్ మార్కెట్‌లో 90 శాతం వాటా.. వాటిని పెద్ద ఎత్తున జారీ చేస్తున్న టాప్-10 బ్యాంకులదే.

క్రెడిట్ కార్డుల మార్కెట్‌లో బ్యాంకుల వాటా



• ఈ-కామర్స్‌కు క్రమేణా పెరుగుతున్న చెల్లింపులు

- ***ఈ ఏడాది మార్చిలో క్రెడిట్ కార్డు ద్వారా జరిగిన లావాదేవీల్లో ఆఫ్‌లైన్ 18 కోట్లు, ఆన్‌లైన్ 16.4 కోట్లు. నిరుడుతో పోల్చితే 28 శాతం, 33 శాతం చొప్పున పెరిగాయి. చిన్నచిన్న లావాదేవీలకూ క్రెడిట్ కార్డులను వాడుతున్నవారు పెరగడమే ఇందుకు కారణం.***
- ***గత నెల స్టోర్ల (ఆఫ్‌లైన్)లో 30 శాతం పడిపోయిన డెబిట్ కార్డు ఆధారిత లావాదేవీలు. 11.6 కోట్లకు పరిమితం. ఆన్‌లైన్‌లోనూ 41 శాతం దిగి 4.3 కోట్లకు తగ్గుదల. విలువ ప్రకారం చూస్తే వరుసగా రూ.29,309 కోట్లు, రూ.15,213 కోట్లుగా ఉన్నాయి. 17 శాతం మేర క్షీణించాయి.***
- ***ఆర్బీఐ వివరాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా దేశంలో జరిగిన లావాదేవీల విలువ రూ.18.3 లక్షల కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) దాదాపు రూ.14 లక్షల కోట్లే.***

యానిమేషన్‌లో కల్కి ప్రపంచం



'దర్శకుడు నాగ్‌అశ్విన్ ప్రేక్షకులకు కొత్త ప్రపంచం చూపించబోతున్నాడు. కొత్త పాత్రలను పరిచయం చేయబోతున్నాడు. 'కల్కి 2898' ఇండియన్ స్క్రీన్‌పై ముందెన్నడూ చూడని అద్భుతం'. అని ఆ సినిమాకు పనిచేసిన వాళ్లు చెబుతున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా రూపొందుతోన్న ఈ చిత్రంలో దీపిక పదుకొణే కథానాయిక. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దుల్కర్ సల్మాన్‌లతోపాటు మరికొందరు స్టార్లు కూడా ఈ సినిమాలో భాగమైన విషయం తెలిసిందే. 'కల్కి 2898' ప్రభాస్ కెరీర్‌లోనే హైబడ్జెట్ సినిమా. శ్రీమద్భాగవతంలో ప్రస్తావించిన ఓ అంశం ఆధారంగా పురాణపాత్రల నేపథ్యంలో జరిగే ఫాంటసీ, సైంటిఫిక్ థ్రిల్లర్ ఇది. రీసెంట్‌గా ద్రోణసుతుడైన అశ్వద్ధామగా అమితాబ్‌ను మేకర్స్ పరిచయం చేశారు. వందేళ్ల తర్వాతి ప్రపంచరూపం, పరిణామాలూ, పోకడలూ ఇందులో కొత్తగా అనిపిస్తాయని తెలుస్తున్నది. ఈ సినిమా విడుదల తేదీపై ప్రేక్షకుల్లో సందిగ్ధత నెలకొని ఉన్న విషయం తెలిసిందే. మే 9న విడుదల చేయనున్నట్టు వైజయంతీ మూవీస్ సంస్థ కొన్ని నెలల క్రితం ప్రకటించింది. అయితే.. ఆ సమయంలో తెలుగు రాష్ర్టాల్లో ఎన్నికల వేడి తారాస్థాయిలో ఉంటుంది. అందుకే.. సినిమా విడుదలపై నిర్మాతలు పునరాలోచనలో పడ్డట్టు సమాచారం. త్వరలోనే కొత్త డేట్‌ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. కాగా, విడుదలకు ముందే, ఈ సినిమాపై ఓ యానిమేషన్ వీడియోను వైజయంతీ మూవీస్ సంస్థ సిద్ధం చేస్తున్నదట. ఆ వీడియో ద్వారా 'కల్కి 2898' ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వినికిడి. ఇది ఏ తరహా సినిమానో ఆ వీడియోలో చూపించి, ప్రేక్షకులకు ప్రిపేర్ చేయడమే ఈ వీడియో ముఖ్యోద్దేశమట. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు ఆకాశంలో ఉన్నాయి. ఈ వీడియోతో అవి మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

చిత్రం



ఆ సీన్ ఇబ్బంది పెట్టింది


నటిగా లొకేషన్‌లో ఇబ్బందిపడ్డ సందర్భం ఏమైనా ఉందా? అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు మృణాళ్‌ఠాకూర్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చింది. మృణాల్ అభిమాన నటుడు షాహిద్ కపూర్. ఆయనతో కలిసి నటించిన 'జెర్సీ' చిత్రం నాటి ఆన్ లొకేషన్ ఎక్స్‌పీరియన్స్‌ని మీడియా ముందు నెమరువేసుకుంది మృణాళ్. 'నాకు షాహిద్ అంటే పిచ్చి. అలాంటి నాకు వరంగా వచ్చింది 'జర్సీ' ఆఫర్. సంబరపడిపోతూ సైన్ చేశాను. నాకు షాహిద్ నవ్వు అంటే చాలా ఇష్టం. లొకేషన్లో ఆయన నవ్వుతుంటే అలాగే చూస్తూవుండేదాన్ని. ఆయన నావైపు చూసి, ఏంటలా చూస్తున్నావ్? అనడిగారు. 'సినిమాల్లోనే కాదు, రియల్‌గా కూడా మీ నవ్వు చాలా బావుంది' అని చెప్పేశాను. ఆయన నవ్వుకున్నారు. షాహిద్‌తో నటించిన రోజుల్ని జీవితంలో మరిచిపోలేను. అదే లొకేషన్‌లో నేను ఇబ్బంది పడ్డ సందర్భం కూడా ఒకటుంది. కథ రీత్యా నేను షాహిద్‌ని చెంపదెబ్బ కొట్టాలి. తనేమో నా అభిమాన నటుడు. ఆయన్ని కొట్టడం అంటే అంతకంటే శిక్ష వేరొకటి ఉండదు. కానీ కథలో కీలకమైన సీన్.. తప్పదు. అందుకే.. నిదానంగా కొడతాను.. మీరు ఎడిట్ చేసుకోండి అని దర్శకుడు గౌతమ్ తిన్ననూరికి చెప్పాను. ఆయన ఒప్పులేదు. గట్టిగా కొట్టాల్సిందే అన్నారు. షాహిద్ కూడా కొట్టమని బలవంతపెట్టాడు. పైగా 'నీ ఎక్స్ బాయ్‌ఫ్రెండ్‌ను గుర్తుచేసుకో.. గట్టిగా కొట్టెయ్..' అంటూ మోటివేట్ చేశాడు. ఆ ఒక్క సీన్ చేయడానికి మూడు గంటలు పట్టింది.



'సితారే జమీన్ పర్' కోసం

స్వీయ దర్శకత్వంలో అమీర్‌ఖాన్ నటించిన 'తారే జమీన్ పర్' (2007) చిత్రం బాక్సాఫీస్ వద్ద చక్కటి విజయాన్ని సాధించడమే కాకుండా విమర్శకుల ప్రశంసలందుకొంది. ప్రత్యేకమైన మానసిక సమస్యలతో బాధపడుతున్న పిల్లల పట్ల ప్రేమపూర్వక వైఖరి అనుసరిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీయాలనే స్ఫూర్తివంతమైన కథాంశంతో అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. ఇదే తరహా ఇతివృత్తంతో అమీర్‌ఖాన్ తాజాగా 'సితారే జమీన్ పర్' చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాడు. వచ్చే నెలలో ఢిల్లీలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. అమీర్‌ఖాన్‌తో పాటు పదకొండు మంది పిల్లలు ఈ సినిమాలో నటించబోతున్నారు. 'పారా ఒలింపిక్స్ నేపథ్యంలో సాగే కథ ఇది. మానసిక, శారీరక లోపాలతో ఉన్న పిల్లలకు ఉత్తమ శిక్షణ అందించి, వారిలో ధైర్యాన్ని ప్రోది చేసే మార్గదర్శి పాత్రలో అమీర్‌ఖాన్ కనిపిస్తాడు. 'తారే జమీన్ పర్' తరహాలోనే చిన్నారుల్లో స్ఫూర్తినింపే కథాంశమిది' అని చిత్ర బృందం పేర్కొంది.

పాటల్లేకుండా సినిమా



కమర్షియల్ సినిమాల్లో పాటలు తప్పనిసరి. గతంతో పోల్చితే నేటి సినిమాల్లో పాటల సంఖ్యను తగ్గించారు. పూర్తిగా పాటలు లేకుండా సినిమాలు తీయడం చాలా అరుదు. అలాంటి అరుదైన ప్రయత్నమే చేయనున్నారు అగ్ర హీరో విజయ్ దేవరకొండ. అసలు పాటలే లేకుండా సినిమా చేయనున్నారాయన. వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో తీస్తున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండ గూఢచారి పాత్రలో కనిపించనున్నారని తెలిసింది. అయితే ఈ సినిమాలో కథానుగుణంగా పాటల అవసరం లేదట. కేవలం బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మాత్రమే ఉంటుందట. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్. ఆయన ట్యూన్స్‌కు సంగీతప్రియుల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి మ్యూజిషియన్ పాటలు లేకుండా సినిమా చేయడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. కథ తాలూకు ఎమోషన్‌ను డిస్టర్బ్ చేయకూడదనే ఉద్దేశ్యంతో పాటలు వొద్దనుకున్నారని అంటున్నారు. అక్కడక్కడా బిట్‌సాంగ్స్ వినిపిస్తాయని, ప్రత్యేకంగా పాటలు మాత్రం ఉండవని చెబుతున్నారు. శుక్రవారం నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విశాఖపట్నంలో మొదలుకానుంది.

తమన్నాపై కేసు నమోదు



అగ్ర కథానాయిక తమన్నాపై మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివాదాస్పద ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్ మహాదేవ్‌కు అనుబంధ యాప్‌గా ఉన్న ఫెయిర్ ప్లే కోసం తమన్నా ప్రచారకర్తగా పనిచేసింది. ఈ యాప్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రసారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ అధికారిక బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ జియో సినిమా సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి తమన్నాపై ఫిర్యాదు చేసింది. ఫెయిర్ ప్లే యాప్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు చూడమని తమన్నా చెప్పడం నిబంధనలకు విరుద్ధమని జియో సినిమా తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కంప్లైంట్‌ను స్వీకరించిన ముంబయి సైబర్ పోలీసులు వచ్చే వారం విచారణకు హాజరుకావాలని తమన్నాకు సమన్లు జారీ చేశారు. మహదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌పై గత కొంతకాలంగా వివాదం నడుస్తున్నది. ఈ యాప్ వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసి దర్యాప్తుని నిర్వహిస్తున్నది. ఈ యాప్ కోసం ప్రచారం నిర్వహించిన రణ్‌బీర్‌కపూర్, శ్రద్ధాకపూర్‌కు ఈడీ గతంలోనే సమన్లు జారీ చేసి విచారణ చేపట్టింది. తాజాగా తమన్నాపై కేసు నమోదు కావడం ఆసక్తికరంగా మారింది.

కడుపుబ్బా నవ్విస్తుంది

'పెళ్లి అనేది అందరూ రిలేట్ చేసుకునే అంశం. అలాగే ఈ కథలో కామెడీతోపాటు ఎమోషనల్ ఎలిమెంట్స్ కూడా చాలా ఉన్నాయి. అందుకే దీన్నే మా తొలి సినిమా కథగా ఎంపిక చేసుకున్నాం.' అని రాజీవ్ చిలక అన్నారు. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. మల్లి అంకం దర్శకుడు. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్మాత రాజీవ్ చిలక గురువారం విలేకరులతో ముచ్చటించారు. 'పెళ్లి ఆలస్యమవుతుండటంతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతుంటారు కొందరు. ఈ రోజుల్లో ఆర్థికంగా సెటిల్ అవ్వడం కంటే, పెళ్లి అవ్వడం పెద్ద టాస్క్.



ఒకప్పుడు చుట్టాలూ, పక్కాలు అందరూ కలిసి సంబంధాలు సెట్ చేసేవారు. ఇప్పుడు వేరే రాష్ట్రంలోనో వేరే దేశంలోనో ఉంటూ, పెళ్లికోసం వెబ్‌సైట్లను ఆశ్రయిస్తున్నారు. వాటిపైనే ఆధారపడిపోతున్నారు. మ్యాట్రిమొనీ సైట్స్ ద్వారా ప్రస్తుతం లక్షల పెళ్లిల్లు జరుగుతున్నాయి. అలా ఒక్కటైన జంటల్లో చాలామందికి ఒకరి గురించి ఒకరికి తెలీదు. ఈ నేపథ్యంలో హ్యూమర్, ఎమోషన్స్ నడుమ సాగే మంచి కథ ఇది' అని తెలిపారు చిలక రాజీవ్. 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్‌ని నరేశే సూచించారనీ, పెళ్లి అవ్వక బాధపడుతున్న హీరోను, పెళ్లెప్పుడని అందరూ అడుగుతుంటే.. సహజంగా పలికే డైలాగ్ 'ఆ ఒక్కటీ అడక్కు' అనీ. ఈ కథకు ఈ టైటిల్ యాప్ట్ అనీ, పైగా నరేశ్‌గారి నాన్నగారి సూపర్‌హిట్ సినిమా టైటిల్ కావడంతో ఆ సెంటిమెంట్ కూడా కలిసొచ్చిందని చిలక చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ నిపుణ Guide to Excellence
పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ'లో..

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 26.4.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 10+10+4 Pages: 10+10+4 | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 322 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline



స్త్రీ ధనంపై భర్తకు హక్కు ఉండదు

అది ఉమ్మడి ఆస్తి కాదు

దానిని వాడుకున్నా..

తిరిగి ఇవ్వాల్సిందే

సుప్రీంకోర్టు తీర్పు

› 5



మెదక్ పట్టణంలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు. (ఇన్‌సెట్‌లో) హరీశ్‌రావు

రాజీనామా లేఖతో నేనొస్తున్నా

అమరవీరుల స్తూపం వద్దకు నువ్వొస్తున్నవా లేదా?

ఇవ్వాళ పది గంటలకు కలుసుకుందాం

ఇద్దరి లేఖలను మేధావుల చేతిలో పెడదాం

హామీలు అమలుచేస్తే నా లేఖ స్పీకర్‌కు ఇస్తరు

చేయకుంటే నీ లేఖను గవర్నర్‌కు అందజేస్తరు

మెదక్ రోడ్‌షోలో రేవంత్‌కు హరీశ్ సవాల్

రాజకీయ సన్యాసంపై తోకముడిచిండని ధ్వజం

సీఎం కుర్చీ ఇజ్జత్ తీస్తున్నడని ఆగ్రహం

> నా ఎత్తు మీద ఉన్న ధ్యాస రైతుల ధాన్యం కొనుగోలు చేయడంలో చూపెట్టు. భువనగిరిలో ఎస్సీ మహిళలపై అరాచకాలు జరుగుతున్నా, 280 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోలె. అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు గాల్లో తేలుతున్నరు. ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెప్తే భూమ్మీదికి వస్తరు.
>
> *-మాజీ మంత్రి హరీశ్‌రావు*

మెదక్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'అసెంబ్లీ ముందున్న అమరవీరుల స్థూపం వద్దకు శుక్రవారం రాజీనామా పత్రంతో నేను వస్తా.. దమ్ముంటే నువ్వు వస్తావా?' అని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసేది నిజమైతే, ఆరు హామీలు అమలు చేస్తే అమరవీరుల స్తూపం వద్దకు రా.. రాజీనామా లేఖలను ఇద్దరం మేధావుల చేతిలో పెడదాం.. నువ్వు చెప్పినవి అమలు చేస్తే నా రాజీనామా లేఖను ఆ మేధావులే స్పీకర్‌కు ఇస్తరు. చేయకుంటే నీ రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇస్తరు. దానికి సిద్ధమేనా అని అడుగుతున్నా. నువ్వు మాట మీద నిలబడేవాడివి అయితే రా.. రాకుంటే తెలంగాణ ప్రజలకు అర్థమైతది. కొడంగల్‌లో రాజకీయ సన్యాసం తీసుకుంటానని తోక ముడిచినట్టే, ఇప్పుడూ అదే అవుతుంది' అని ఎద్దేవా చేశారు. గురువారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ విగ్రహం నుంచి రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాందాస్ చౌరస్తాలో హరీశ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాకు కేసీఆర్ ఏం చేశారని మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డిని మెదక్ గడ్డ మీదికి తీసుకొచ్చిన ఘనత గులాబీ జెండాకే దక్కుతుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లాగా ఏర్పడటం వల్లే నామినేషన్ కోసం రేవంత్‌రెడ్డి మెదక్‌కు వచ్చిన విషయం › 6వ పేజీలో



మహబూబాబాద్ మార్కెట్‌లో కూరగాయలు అమ్మే మహిళతో మాట్లాడుతున్న ఎంపీ కవిత

కాంగ్రెస్‌ను నమ్మి మునిగినం

మళ్లీ ఎనుకటి రోజులు వచ్చినయ్.. తండాల్లో నీళ్లు లేవ్

వరిపంట మొత్తం పోయింది.. మళ్లీ కేసీఆర్ సారే రావాలి

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత ప్రచారంలో ఓ మహిళ ఆవేదన

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి మోసపోయామని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఉదయం బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి కవిత జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మార్నింగ్ వాక్‌తోపాటు పట్టణంలోని కూరగాయాల మార్కెట్‌లో వ్యాపారులు, స్థానికులను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని రేగడి తండాకు చెందిన బానోత్ కాళీ అక్కడే ఆకు కూరలు అమ్ముతుండగా, కవిత ఆమె వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అందుకు ఆమె స్పందిస్తూ.. 'మొన్న జరిగిన ఎన్నికలల్ల కాంగ్రెస్ పార్టీ చెప్పింది నమ్మి మోస పోయినం. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు వరి పంట మొత్తం ఎండిపోయింది. రైతులు పెట్టుబడి ఎల్లక ఇబ్బందులు పడుతుండ్రు. తండావాసులు తాగడానికి నీళ్లు లేక బావుల సుట్టూ తిరుగుతున్నరు. మల్ల ఎనుకటి రోజులు అచ్చినయి. కాంగ్రెసోళ్లు రైతుబంధు ఇయ్యలె. రుణమాఫీ చేయకపాయె. పంటలకు తెచ్చిన అప్పులు పెరిగిపాయె. ఆకుకూరలు పండించడానికి నీళ్లు లేకపాయె. సీఎం రేవంత్‌రెడ్డి ఏ హామీని తీర్చకపాయె. కేసీఆర్ పాలనలో రెండు పంటలు మంచిగ పండి రైతులు ఆనందంగా ఉండె. ప్రతి కాలనీకి తాగు నీరొచ్చింది. అందరికీ లాభంగుండె. ఇప్పుడు జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలె. మళ్లా కేసీఆర్ సారే రావాలె' అంటూ తన మనసులోని మాటను వెల్లడించింది.

నాలుగో దశకు ముగిసిన నామినేషన్లు

ఉపసంహరణకు 29 చివరి తేదీ

తెలంగాణ, ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని 96 స్థానాలకు మే 13న పోలింగ్ › 5



నేడు రెండో విడత పోలింగ్

13 రాష్ట్రాల్లోని 89 స్థానాలకు ఎన్నికలు

మొత్తం 1,206 మంది అభ్యర్థులు పోటీ

రెండో విడతలో కేరళ, రాజస్థాన్, త్రిపురలో అన్ని లోక్‌సభ స్థానాలకు పోలింగ్ పూర్తి › 5

మే 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

వరంగల్-నల్లగొండ-ఖమ్మం స్థానానికి షెడ్యూల్ విడుదల › 6

మే 2 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఆది నుంచీ బీఆర్‌ఎస్‌కు కంచుకోట

టెట్‌పై ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రభావం!

మే 20 నుంచి జూన్ 3 వరకు పరీక్ష

మధ్యలో మే 27న పోలింగ్ › 6

జనంపై ధరలు 'మోది'!

బీజేపీ హయాంలో నిత్యావసరాల ధరలు పైపైకి

ఉప్పు, పప్పు నుంచి కూరగాయల వరకూ భగ్గు

పదేండ్లపాలనలో 300 శాతం వరకూ పెరుగుదల

చమురుమంట, సాగు పెట్టుబడి ఖర్చూ కారణమే

ముగ్గురికి వారం భోజనం ఖర్చు రూ. 2 వేల పైనే


ధరలకు కళ్లెం వేయడంలో మోదీ సర్కారు ఫెయిల్

సీఎస్‌డీఎస్ సర్వేలో 57% మంది అభిప్రాయం ఇదే

ఎన్నికలపై ధరల ప్రభావం ఉంటుందన్న ఓటర్లు › 5



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లపాలనలో ధరల మోతతో సామాన్యుడి బతుకు దిన దినగండం నూరేండ్ల ఆయుష్షుగా మారింది. మోదీ సర్కారు అసమర్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలతో పేద, మధ్యతరగతి వారిపై ఏదో రూపంలో నిత్యావసర వస్తువుల ధరల బండ పడుతూనే ఉన్నది. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ పెంపుతో ప్రజలు అల్లాడుతుంటే.. పెరిగిన నిత్యావసరాల ధరలు వారిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. అందుకే ఎన్నికల ఫలితాలపై ధరల ప్రభావం కచ్చితంగా ఉంటుందని నూటికి 57 శాతం మంది చెబుతున్నారు.



ఇక కేంద్రం దయ?

మేడిగడ్డ పునరుద్ధరణపై ఆసక్తిచూపని రాష్ట్ర ప్రభుత్వం

ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో లంకె.. ఎమర్జెన్సీ పనులపై కానరాని దృష్టి

బరాజ్ కుంగుబాటు తరువాత రెండు రోజుల్లోనే వచ్చిన నివేదిక

ఆ తరువాత గప్‌చుప్.. ఎన్‌డీఎస్‌ఏ తీరుపై ఇంజినీర్ల ఆగ్రహం

రేవంత్ సర్కార్ నిర్లిప్తత, రాజకీయాలపై అన్నదాతల మండిపాటు

వాతావరణ శాఖ హెచ్చరికలనూ పట్టించుకోని ప్రభుత్వం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'కాళేశ్వరం ప్రాజెక్టు వృథా. కమీషన్ల కోసమే కట్టారు. రూ.లక్ష కోట్లు వృథా. అంత ఖర్చు చేసినా ఒక్క ఎకరాకూ నీరివ్వలేదు'- ఇవీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు పదే పదే చేసిన విమర్శలు. ఒకవైపు పంటలు ఎండిపోయి, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తుంటే, ప్రాజెక్టులు అడుగంటడానికి, కాలువలు పారకపోవడానికి మేడిగడ్డ బరాజ్ పిల్లర్లు కుంగడమే కారణమని ఇప్పుడు చెప్తున్నారు. ఆ నిందను మళ్లీ కేసీఆర్‌పైనే మోపి తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారుకు అవగాహన ఉన్నదా? అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ ప్రాజెక్టు ద్వారానే › 8వ పేజీలో



'కాళేశ్వరం'పై విచారణ ప్రారంభం

కమిషన్ ఎదుట ప్రాజెక్టుపై నీటిపారుదలశాఖ ప్రజెంటేషన్

ఇరిగేషన్ సెక్రటరీ నేతృత్వంలో నోడల్ బృందం ఏర్పాటు

అవసరమైతే కేసీఆర్ వివరణ కోరుతామన్న జస్టిస్ ఘోష్

ఫిర్యాదుల స్వీకరణకు బీఆర్కేభవన్‌లో ప్రత్యేక బాక్సులు › 6

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

మలిసంజెలో ఆరోగ్య బీమా

మన దేశంలో అధికారిక జనాభా గణాంకాలు 2011 నాటివే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వాడుతున్న గణాంకాలు అంతర్జాతీయ నివేదికల ఆధారంగా వేసుకున్న సాపేక్ష అంచనాలే. వీటి ప్రకారం మన దేశ జనాభా 2023 మధ్యలోనే చైనాను మించిపోయింది. ఆ రకంగా ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ చలామణి అవుతున్నది. ఐక్యరాజ్య సమితి అంచనాల మేరకు రూపొందించిన భారత వృద్ధాప్య నివేదిక 2023 ప్రకారం 2022 నాటికే 60 ఏండ్లు పైబడిన వారు మన దేశ జనాభాలో 10 శాతం వరకు ఉన్నారు. 2050 నాటికి వీరు జనాభాలో 30 శాతం మేరకు ఉండొచ్చని అంచనా. జీవన ప్రమాణాలు పెరగడం వయో వృద్ధుల శాతం పెరగడానికి ప్రధాన కారణం. ఒక అంచనా ప్రకారం 2018 నాటికి సగటు జీవన పరిమాణం 69.1 సంవత్సరాలు. నిన్నామొన్నటి వరకు యువ జనాభా పెరిగిందని మురిసిపోయాం. ఇప్పుడు వృద్ధుల జనాభా పెరుగుతుండటం సరికొత్త సవాలును మన ముందుకు తెస్తున్నది.

వృద్ధుల జనాభా పెరుగుదలను వెంబడించి అనేక ఇతర సమస్యలు తలెత్తడం సహజం. మానసిక ఒత్తిడులు, కాలుష్యం, జీవనశైలి కారణంగా వ్యాధులు శరవేగంగా విస్తరిస్తుండటం మనం చూస్తున్నాం. శరీరం బలహీనమైపోయే మలిసెంజెలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా బాధిస్తాయి. ముఖ్యంగా మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్లు ముసలితనంలో చిక్కులను తెచ్చిపెడుతాయి. ఒక అంచనా ప్రకారం మన దేశంలోని వృద్ధుల్లో 75 శాతం మందికి ఏదో ఒక దీర్ఘకాలిక వ్యాధి ఉన్నది. సూక్ష్మ కుటుంబవ్యవస్థ విస్తరిస్తున్న కారణంగా వృద్ధులకు ఆదరణ, అండదండలు కరువవుతున్నవి. అందువల్ల ఆరోగ్య సేవలు, చౌకైన మందులు, ఇతర సౌకర్యాలు వృద్ధులకు తప్పనిసరిగా అవసరమవుతాయి. ఆ ఇతర సౌకర్యాల్లో ఆరోగ్య బీమా అనేది అత్యవసరం.

ప్రస్తుతం మన దేశంలో ఆరోగ్య బీమా పొందేందుకు అర్హమైన వయస్సు 65 కంటే తక్కువ. అంటే 65 దాటినవారు కొత్తగా ఆరోగ్య బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే కుదరదు. పెరుగుతున్న ఆరోగ్య సేవల వ్యయం దృష్ట్యా ఇది వయోవృద్ధులకు పెద్ద సమస్యగా ఉన్నది. బీమారంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ ఇటీవల ప్రవేశ వయస్సు పరిధిని పెంచాలని బీమా సంస్థలను ఆదేశించింది. మారుతున్న సామాజిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పును తీసుకువచ్చారన్నది తెలుస్తూనే ఉన్నది. ఇది ఆహ్వానించి, అభినందించాల్సిన విషయమే. కుటుంబంలో చిన్నా పెద్దా కలిపి ఫ్లోటర్ పద్ధతిలో ఉమ్మడిగా బీమా తీసుకుంటే కొంత వ్యయం కూడా కలిసివచ్చే మాట నిజమే. అయినప్పటికీ కేవలం బీమా సౌకర్యం విస్తరణ ఒక్కటే సరిపోదు. సర్కారీ వైద్య వ్యవస్థను అత్యాధునికంగా విస్తరించి అందుబాటులోకి తేవాలి. ప్రైవేటురంగంలో ఆరోగ్య వ్యయాన్ని కూడా తగ్గించి అందరికీ అగ్గవగా చికిత్సలు అందించాల్సిన అవసరం ఉన్నది. ఈ సమతూకం సాధించలేకపోతే ఆరోగ్య బీమా విస్తరణ అనేది అసంపూర్తి కార్యాచరణగా, ఆస్పత్రులు, బీమా సంస్థల దోపిడీకి ఉపకరణంగా మారిపోయే ప్రమాదం ఉంది.

వ్యవసాయమే ఓ వైకుంఠపాళి

'వ్యయము చేసి దేవుని సహాయం కోరేదే వ్యవసాయం' అని మా నాన్న చెప్పిన మాట. కానీ, రాష్ట్రంలో ప్రస్తుత వ్యవసాయాన్ని పరిశీలిస్తే వైకుంఠపాళి ఆట గుర్తుకొస్తున్నది. 130 రోజుల యాసంగి వరి పంట కాలం.. 142 రోజుల కాంగ్రెస్ పాలన.. 143 గడులున్న పరమపద సోపాన పఠము అన్నీ ఒకే లాగ కనిపిస్తున్నాయి. వైకుంఠపాళి ఆటలో 10 నిచ్చెనలు, 13 పాములుంటాయి. కేసీఆర్ పదేండ్ల పాలనలో వ్యవసాయం పండుగైంది. రైతు బంధు వంటి సంక్షేమ పథకాలతో రైతులకు అన్నీ నిచ్చెనలే వచ్చాయి. కాంగ్రెస్ పాలనలో మాత్రం అడుగుకొక పాము గండం ఎదురవుతున్నది.



మారెడ్డి సంజీవ్‌కుమార్
91827 77465



ఆరు గ్యారెంటీల్లో భాగంగా వరంగల్‌లో కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ సమక్షంలో రైతు డిక్లరేషన్ ప్రకటించారు. ఇందులో రైతులకు అరచేతిలో వైకుంఠం చూపించి హస్తం పార్టీ అధికార పీఠమెక్కింది. వైకుంఠపాళిలో ప్రతి పది గడులకు ఒక పాము ఎదురైనట్టు.. కాంగ్రెస్ పాలనలో రైతులకు ప్రతి పదిహేను రోజులకు ఒక కష్టం ఎదురైతున్నది. 'మేమొస్తే రైతుబంధు ఏడాదికి రూ.15 వేలు ఇస్తాం' అని చెప్పిన పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాసంగి పంటలు కోతలు చేస్తున్నా ఇంకా పూర్తి పెట్టుబడి సాయం ఇవ్వనే లేదు. ఇక కౌలు రైతులకు ఏడాదికి రూ.12 వేల హామీపై ఉలుకు, పలుకు లేదు. కోటి ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులు ప్రతి దశలోనూ పుట్టెడు కష్టాలు పడుతున్నారు. మొగులుకు ముఖం చూడకుండా వ్యవసాయం చేసుకుందామన్న కేసీఆర్‌ను కాదని మార్పు కోసం కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ వచ్చీ రావడంతోనే రైతులకు కరెంటు కష్టాలు మొదలయ్యాయి. 24 గంటల ఉచిత కరెంటు నుంచి అర్ధరాత్రి దొంగ కరెంటుకు పరిస్థితి మారింది. మిణుగురు పురుగులా వచ్చీపోయే కరెంటుతో మోటర్లు కాలిపోతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి ప్రణాళిక లేక పంటలకు సాగునీళ్లు కరువయ్యాయి. రైతులు పంటలను కాపాడుకోవడానికి ట్యాంకర్లను అద్దెకు తీసుకున్నారు. కిలోమీటర్ల కొద్దీ పైపులైన్లను పరుచుకున్నారు. పొట్టకొచ్చిన పంటను కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి మరీ బోర్లు వేశారు. ఒక బోరు ఫెయిలైతే.. రెండో బోరు.. అది ఫెయిలైతే.. మూడో బోరు.. ఇలా ఎకరం పొలంలోనే 11 బోర్లు వేసిన రైతులూ ఉన్నారు. బొట్టు బొట్టు ఒడిసిపట్టి పంటను కోసుకొచ్చిన రైతుకు కనీస 'మద్దతు' దక్కలేదు. పాలకులకు పార్లమెంట్ ఎన్నికల కసరత్తుపై ఉన్న ధ్యాస ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై లేకపోయింది. కోడ్ సాకుతో కాగితాలపైనే అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,104 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని చెప్తున్న పౌరసరఫరాల శాఖ, ఇప్పటివరకు 2,480 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్లు ప్రారంభించింది. ఇంకా 4,720 కేంద్రాలు అంటే దాదాపు 70 శాతానికిపైగా కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదు. మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని నమ్మి కొనుగోలు కేంద్రాలకు వడ్లను తెచ్చిన రైతులకు నిరాశే ఎదురైంది. కొనుగోలు కేంద్రాల్లోని కొర్రీలను చూసి వెర్రెక్కిపోయింది. రోజులు గడుస్తున్నా.. పడిగాపులే తప్ప కాంటా కావడం లేదు. తన వంతు కోసం చకోర పక్షిలా ఎదురుచూస్తున్నారు. పగలనకా, రాత్రనకా కొనుగోలు కేంద్రాల్లోనే వరి కుప్పలకు కాపలా ఉన్నారు. నడినెత్తిన సూర్యుడు భగ్గుమంటున్నా వడ్లను పొద్దంతా రెక్కలు ముక్కలు చేసుకొని ఎండబోశారు. ఆకలి బాధను.. కూలీల భారాన్నీ భరించారు. ఎన్నిసార్లు ఎండపోసినా ఏ గ్రేడ్‌కు మాత్రం నోచుకోలేదు. మాయిశ్చర్ ఉందని మాయమాటలు... ధాన్యంలో పొల్లు ఉందని సొల్లు కబుర్లు విన్నారు. ఇన్నిచేసినా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కాంటా కావడమే కష్టం. కాంటా అయినప్పటికీ గన్నీ సంచులు దొరకవు.

గన్నీ సంచులు దొరికినా లారీలు రావు. లారీల్లో ధాన్యం లోడ్ ఎక్కినా అవి మిల్లు వరకు చేరుతాయనేది అనుమానమే. మిల్లర్ల కొర్రీలు లేకుండా ధాన్యాన్ని దించుకునేవరకూ రైతులు బిక్కు బిక్కుమనాల్సిందే. మిల్లులో లోడ్ దిగి, బ్యాంకు ఖాతాలో డబ్బులు జమయ్యేవరకు ఎదురు చూడాల్సిందే. రైతులను ఇబ్బంది పెట్టొద్దు... వారికి అన్యాయం చేయొద్దు అని కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ చెప్పినా ధాన్యం లోడ్‌ను మిల్లర్లు తిప్పిపంపారు.

గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. కల్లాల వద్దే కాంటాలు పెడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు క్వింటాలు ధాన్యానికి రూ.200 నుంచి రూ.400 వరకు తక్కువ ధర చెల్లిస్తున్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెప్పినా మద్దతు ధరపై చేతులెత్తేశారు. ఇది చాలదన్నట్టుగా 40 కిలోల సంచికి 42 కిలోలు తూకం వేస్తున్నారు. దీనివల్ల రైతులు క్వింటాలుకు 5 కిలోల ధాన్యం దగా పడుతున్నారు. ఇవికాకుండా కూలీల ఖర్చుల కింద బస్తాకు రూ.10, అమ్ముకున్న వెంటనే డబ్బులు కావాలంటే నూటికి రూ. 2 చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోపాటు వ్యాపారుల వంచనకు గురైన రైతుపై ప్రకృతి కూడా పగబట్టింది. వడగండ్ల వానతో పొట్టకొచ్చిన పంటంతా నేలపాలైంది. అకాల వర్షాలు కొనుగోలు కేంద్రాలను ముంచెత్తాయి. వాన నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. కండ్లముందే కొట్టుకుపోతున్న ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరు కార్చారు. ధాన్యం తడవకుండా కాపాడుకోవడానికి ముప్పుతిప్పలు పడ్డారు. బస్తాలకు సరిపడా టార్పాలిన్లు లేక ఇబ్బందులు పడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే రైతుల కష్టాలకు, కన్నీళ్లకు అంతే ఉండదు. యాసంగి సాగులో రైతులకు అడుగడుగునా పాము గండాలే. కనీసం రోజుకొకరు, ఇద్దరు అన్నట్టుగా వంద రోజుల్లోనే రెండొందల మంది రైతులు బలిపీఠమెక్కారు. అన్నదాతలు ఉరికొయ్యలకు వేలాడుతున్నా.. రైతు కుటుంబాలు అరిగోస పడుతున్నా కాంగ్రెస్ పాలకులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడలేదు. ఇప్పటివరకు పంట నష్టం లెక్కలు తీయలేదు. తడిసిన ధాన్యం కొంటామని భరోసా ఇవ్వలేదు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు గానీ, రాష్ట్రంలోని రైతులను మాత్రం పరామర్శించలేదు. పైపెచ్చు భద్రాద్రి రాముడి మీద ఒట్టు.. ఏడుపాయల దుర్గమ్మ మీద ఒట్టు.. యాదగిరి నరసింహుడి మీద ఒట్టు.. బాసర అమ్మవారి మీద ఒట్టు అంటూ పంద్రాగస్టు డెడ్‌లైన్లు పెడుతున్నారు. మత గ్రంథాల కన్నా పవిత్రమైన మ్యానిఫెస్టోపైనే మాట తప్పి ఎన్ని ఒట్లు పెడితే ఏం లాభం? కన్నతల్లికి అన్నం పెట్టకుండా పినతల్లికి బంగారు గాజులు చేయిస్తా అన్నట్టు.. రైతుబంధు ఇవ్వని నేతలు రుణమాఫీ చేస్తామంటే నమ్మాలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. బోనస్‌పై బోగస్ మాటలను కట్టిపెట్టాలని మండిపడుతున్నారు. తెల్వక కయ్యల పడ్డం.. మళ్లీ మోసపోతే గోస పడుతమని తెలివి కొచ్చి మాట్లాడుతున్నరు.

వైకుంఠపాళిలో పాములను తప్పించుకొని, నిచ్చెనలను ఎక్కినవారే విజేతలు. ఆటలో గెలవాలంటే 'అష్ట' పడాల్సిందే. ఇప్పుడు రాష్ట్రంలో రైతులు కూడా పాముల నుంచి తప్పించుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం 8 సీట్లు ఇవ్వాలి. కేసీఆర్‌కు 10 సీట్లు వస్తే వైకుంఠపాళిలో 10 నిచ్చెనల్లాగే రైతులకు ఉపయోగం ఉంటుంది. గులాబీ నిచ్చెనలను తయారుచేసుకోవాల్సిన బాధ్యత కూడా రైతులదే.



బీసీలను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారు?

2023 కాంగ్రెస్ ఎన్నికల సభల్లో రాహుల్‌గాంధీ బీసీలకు స్థానిక రాజ్యాలు అప్పగిస్తామని గట్టిగా మాట్లాడారు. అదిప్పుడు చేస్తారా? అని తెలంగాణ బీసీ సమాజం ఎదురు చూస్తున్నది. రాష్ట్రాన్ని పాలిస్తున్న ఇక్కడి పెద్దలు మొత్తం బడ్జెట్‌లో బీసీలకు సగం బడ్జెట్ కేటాయించవలసి ఉన్నది. పంచాయతీరాజ్ వ్యవస్థలో 42 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే దాని ద్వారా 24 వేల మంది ఓబీసీలు కొత్త నాయకులుగా ఎదిగివస్తారని రాహుల్ గాంభీర్యంగా 2023 వరంగల్ ఎన్నికల సభలో చెప్పారు. స్థానిక సంస్థల్లో 24 వేల మంది బీసీ నాయకులు రావటం హర్షించే విషయమే, కానీ దీన్ని ఏ రకంగా చేయగలరన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

పంచాయతీరాజ్ చట్టం ఓబీసీల రిజర్వేషన్లకు సంబంధించి 1993 నుంచి తెలుగు రాష్ట్రాల్లో ఏ విధంగా అమలుచేశారో ఒక్కసారి వెనక్కు తిరిగి చూడవలసి ఉన్నది. ఎన్నికల వాగ్దానాలు చేయటం ఓబీసీల ఓట్లను కొల్లగొట్టటం రివాజుగా జరుగుతున్న చర్య. కానీ ఆచరణలో మాత్రం బీసీలు ప్రతిసారీ దగాకే గురవుతున్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శక సూత్రాలకనుగుణంగా చూస్తే రాహుల్‌గాంధీ చెప్పింది ఆచరణలో సాధ్యం కాదు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రకటించినా అందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకత్వం వల్ల అది సాధ్యం కాదని చేతులెత్తేయటం సహజంగా జరిగే చర్యే.



జూలూరు గౌరీశంకర్

బీసీలకు ఏ విధంగా చూసుకున్నా కూడా స్థానిక సంస్థల రిజర్వేషన్లలో నిరాశే మిగులుతుంది. ఈ అంశంపై కేంద్రాన్ని 77 ఏండ్లుగా ఏలుతూ వస్తున్న కాంగ్రెస్, బీజేపీలు రెండు ఓబీసీ రిజర్వేషన్ల పెంపుపై చెప్పలేని రాయలేని నిర్లక్ష్యానికి గురిచేస్తూ వస్తున్నాయి. ఓట్ల కోసం వచ్చినప్పుడు తప్ప తిరిగి బీసీల సమస్యను రాజకీయపార్టీలు పట్టించుకోవు. ఇందుకు రాష్ట్రంలోని బీసీలంతా ఒక్కతాటిపైకి వచ్చి తమ డిమాండ్లను సాధించుకోవాలి. 60 శాతం మంది బీసీల దీర్ఘకాలిక సమస్యగా ఇది బీసీలను క్షోభకు గురిచేస్తుంది. రాష్ట్రం నుంచి ముక్తకంఠంగా ఒకే స్వరంతో బీసీలు ఐక్యమత్యంతో కదిలే సమయం దగ్గరికి వచ్చింది. మనం వేసే ఈ అడుగులే పొరుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపుతాయి. ఇది ఓబీసీల జాతీయ ఉద్యమంగా మారాలి. ఇందుకు బీసీ విద్యావంతులు ఎక్కడికక్కడ ఉద్యమ గొంతుకలుగా మారాలి. బీసీ, ఎంబీసీ, ఉపకులాల సంచారజాతుల అనేకానేక సమస్యలకు తక్షణ ఉద్యమాలు రావాలి. అవే రేపటి బీసీల హక్కుల దీర్ఘకాలిక ఉద్యమంగా దేశవ్యాపిత మహోద్యమంగా మారవలసి ఉన్నది.

రాజ్యాంగంలోని 243–డీ ప్రకారం స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు జరిగింది. అదేవిధంగా మొత్తం సీట్లలో 1/3 వంతు స్త్రీలకు కేటాయింపు చేశారు. ఇక బీసీలకు సంబంధించిన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వాలకు విడిచి పెట్టారు. దీని ప్రకారం ఏ రాష్ట్రంలో కూడా బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వచ్చే అవకాశమే లేదు. ఇందుకు కారణం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 50 శాతం రిజర్వేషన్ దాటకూడదన్న నిబంధన.

పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయకుండా బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పొందలేరు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లపై నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఇప్పుడు మాత్రం తాము అధికారంలోకి వస్తే ఓబీసీ కులగణన, పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ చెప్తున్నారు. బీజేపీ పార్లమెంటు సాక్షిగానే బీసీ కుల గణన చేయబోమని చెప్పింది. ఇలాంటి సందర్భంలో బీసీలు స్థానిక రాజ్యాల్లో తమకు రావాల్సిన సమ వాటా కోసం సమరాలు చేయకతప్పదు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా బీసీలందరూ ఒక్కతాటిపైకి రావాల్సిన అత్యవసర సమయం వచ్చింది. బీసీలను ఇంకెంతకాలం మోసం చేస్తారని అన్ని రాజకీయపార్టీలను నిగ్గదీసే సమయం దగ్గర్లోనే ఉన్నది.



టంకశాల అశోక్

రేవంత్-హరీశ్ సవాళ్ల యుద్ధం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూస్తే ఆశ్చర్యం కలుగుతున్నది. సాధారణంగా ఎవరైనా ఎందుకైనా ఒకసారి అసత్యం చెప్పినప్పుడు, అది అసత్యమని నలుగురికీ తెలిసిపోతే, అంతటితో జంకు కలిగి సదరు అసత్యాన్ని తిరిగి చెప్పరు. కానీ, రేవంత్‌రెడ్డి అట్లా కాదు. తను ఒక అరుదైన వ్యక్తి. అదే అసత్యాన్ని బేఫికర్‌గా మళ్లీ మళ్లీ ఎన్ని సార్లయినా చెప్పగలరు. అది శక్తిమంతమైన నాయకత్వానికి నిదర్శనమన్నది ఆయన నమ్మకమేమో తెలియదు. కాని ప్రజలట్లా భావిస్తున్నట్టు కన్పించదు. అది తన బలహీనతగానే తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఆరు గ్యారెంటీల అమలు, 30 వేల ఉద్యోగాల భర్తీ విషయాలు. వాటితో పాటు ప్రస్తుతం సవాళ్లకు కేంద్రంగా మారిన రైతు రుణమాఫీ మరొకటి.

వందరోజుల గడువుతో ప్రజలకు బాండ్ పేపర్లపై ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో మూడింటిని అమలు చేశామని కొద్దికాలం కిందటి వరకు చెప్పిన ముఖ్యమంత్రి, ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఆ సంఖ్యను నాలుగుకు పెంచి, ఇప్పుడు అయిదంటున్నారు. ఇందులోని సత్యాసత్యాలలోకి వెళ్లే ముందు చెప్పుకోవలసిన మరొక విషయం 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నది. ఈ రెండు మాటలు కూడా నిజం కాదన్నది పరిశీలకుల లెక్కలలో ఎప్పుడో తేలింది. అదేమిటో కొద్ది సేపట్లో చూద్దాము. అదట్లుంచి గత కొద్దిరోజులుగా మరొక విషయం ముందుకొచ్చింది. అది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ప్రశ్న. కనుక మొదట అందులోకి వెళ్లాలి.

కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ అయినా చేయలేదని అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరాధారంగా ఆరోపించిన రేవంత్‌రెడ్డి, తాము గెలిచినట్టయితే డిసెంబర్ 9వ తేదీనాడే రూ.2 లక్షల రుణమాఫీ ఒకే విడతలో చేయగలమని, ఆ ఫైలుపైనే తొలి సంతకం చేయగలమని, కనుక రైతులు వెంటనే బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల కొత్త అప్పు తెచ్చుకోవాలని ప్రకటించటం తెలిసిందే. కానీ 9 గడిచిపోయి, తర్వాత 100 రోజుల గడువు, ఆ తర్వాత మరొక 20 రోజుల కాలం గడిచిపోయినా ఇదేమీ జరగకపోగా, రేవంత్‌రెడ్డి ఈ ప్రశ్నపై ఈరోజు వరకు కూడా అసలే మాట్లాడకపోవటం గమనార్హం. నిజానికి ఇవన్నీ పలు మార్లు చర్చకు వచ్చిన, పదేపదే రాసిన విషయాలే అయినందున ఇప్పుడు తిరిగిరాయటం విసుగెత్తించే విషయమే. కానీ ఈ ప్రశ్న గత రెండు రోజులుగా రేవంత్ రెడ్డి, హరీశ్‌రావుల మధ్య తీవ్రమైన సవాళ్లు, ఎదురు సవాళ్లుగా మారినందున రాయకతప్పటం లేదు. పైగా ఈ అంశం ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఎంతైనా ఉన్నది.

మొదట జరిగింది ఈ కింది విధంగా ఉన్నది. రుణమాఫీ ఏమైందని రైతులు, ప్రతిపక్షాలు, ఇతరులు ఎంత ప్రశ్నించినా ముఖ్యమంత్రి మౌనాన్నే పాటించారు. తన మంత్రులు, శాసనసభసభ్యులు మాత్రం తలొక తీరున మాట్లాడటం మొదలుపెట్టారు. మాఫీకి తేదీ ఏమీ చెప్పలేదని, 9వ తేదీ అనలేదని, వంద రోజులని కూడా అనలేదని, అసలు మాఫీ మాటే అనలేదని చిత్ర విచిత్రమైన వాదనలు సాగించారు. దీనితో రైతులలో అయోమయం తలెత్తినా ముఖ్యమంత్రి మాత్రం తన మౌనాన్ని కొనసాగించారు. కానీ ఎన్నికల నోటిఫికేషన్ రావటం, ప్రతిపక్షాల విమర్శలు పెరగటం, రైతాంగంలో ఇది విస్తృతంగా చర్చనీయాంశం కావటంతో అప్పుడిక పెదవి విప్పక తప్పలేదు. రుణమాఫీ విషయం చాలదన్నట్టు రైతుభరోసా రూ.15 వేలకు పెరగకపోవటం, కౌలు రైతులు, రైతు కూలీలకు సహాయంపై ఇచ్చిన హామీ గాని, ధాన్యానికి బోనస్ గాని అమలుకాకపోవటం రైతుల నిరసనలకు తోడయ్యాయి. ఇక నీళ్లు లేక పంటలు ఎండటం, కరెంటు కోతలు, మోటర్లు కాలటం, ధాన్యం కొనుగోలులో మోసాలు అగ్నికి ఆజ్యంలా మారాయి. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో ఇక ఒత్తిళ్లన్నీ తట్టుకోలేకపోయిన ముఖ్యమంత్రి, రుణమాఫీకి డిసెంబర్ 9 గడువునైతే ఎత్తలేదు కానీ, కొత్త గడువును ప్రకటించారు. అది ఆగస్టు 15. అప్పటికి లోక్‌సభ ఎన్నికలే గాక స్థానిక సంస్థల ఎన్నికల గండం కూడా గడిచిపోగలదన్నది ఆయన అంచనాయేమో తెలియదు.



దానినట్లుంచి రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆగస్టు 15 మాటలు ప్రతిరోజు, తాను వెళ్లిన ప్రతిచోటా, మరిచిపోకుండా అంటున్నారు. అంతేకాదు, ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్ల మీద ప్రమాణాలు కూడా చేస్తున్నారు. అట్లా ఈ నెల 20 నుంచి 24వ తేదీ మధ్య నాలుగు సభలలో ఏడుగురు దేవుళ్ల మీద ఒట్లు పూర్తయ్యాయి. అయినా రైతులు నమ్మకపోవచ్చునని అనుమానంతో కావచ్చు, 'నన్ను నమ్మండి' అనే మాటను సైతం నొక్కి మరీ చెప్తున్నారు. దీనంతటి మధ్య గమనించవలసిందేమంటే, డిసెంబర్ 9 నాడు ఎందుకు మాఫీ చేయలేదు? కనీసం తర్వాత రోజుల్లోనైనా? అనే వివరణ మాత్రం ఇవ్వటం లేదు. తన ఉద్దేశ్యంలో నిజాయితీ ఉంటే, మాఫీ చేయాలనుకున్నా ఆర్థిక పరిస్థితి సహకరించలేదని, అందుకు చింతిస్తున్నానని రైతులు పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలని, త్వరలోనే ఆ పని తప్పక చేస్తామని చెప్పవచ్చు. కానీ ఆ పనిచేయటం లేదంటే ఆయన మనసు సాఫీగా లేదన్నమాట. కేవలం ఓట్లు సంపాదించే ఉద్దేశ్యంతో డిసెంబర్ 9 గడువు సాధ్యం కాదని తెలిసి కూడా, గంభీరమైన, దృఢమైన స్వరంతో ఆ హామీని ఎలుగెత్తి ఇచ్చారన్నమాట. ఇప్పుడు రైతు వ్యతిరేకత పెరుగుతుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఆ ఉక్కిరిబిక్కిరిని హరీశ్‌రావు మరింత పెంచారు. ఈ రెండవ గడువు అయిన ఆగస్టు 15లోగా మాఫీ చేయనట్టయితే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయగలరా అని సవాలు చేశారు. ఆగస్టు 15 ఇప్పటి నుంచి ఇంకా మూడు నెలల మూడు వారాల దూరంలో ఉంది. డిసెంబర్ 9 నుంచి లెక్క వేస్తే మొత్తం ఎనిమిది నెలల ఒక వారం. పంట బోనస్ కూడా ఇదే పద్ధతిలో ఇంతేకాలం వాయిదా వేస్తున్నారు. ఇక రైతు భరోసా, కౌలు రైతు భరోసా, రైతు కూలీల సహాయం గురించి అయితే ఇప్పటివరకింకా ఉలుకు, పలుకు లేదు. వాటినట్లుంచి చూసినా, రుణమాఫీ ఆగస్టు 15 నాటికి చేసి తీరగలమని చెప్తారా? వంద రోజుల గడువు గల ఆరు గ్యారెంటీలలోని 13 హామీలను అప్పటికైనా అమలు చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయగలరా? అన్నది హరీశ్ ప్రశ్న. అందుకు జవాబుగా ముఖ్యమంత్రి, ఒకవేళ రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్‌ను రద్దు చేస్తారా? అని ఎదురు ప్రశ్నించారు. 6 గ్యారెంటీల మాట మాత్రం ఆయన ఎత్తలేదు. ఇదొక విచిత్రం. రుణమాఫీ కాంగ్రెస్ హామీ. దానిని అమలుచేయవలసిన బాధ్యత వారిది. తమ బాధ్యత ప్రకారం తమ హామీని అమలు జరిపితే ఇతరులు వారి పార్టీలను రద్దు చేసుకోవాలనటం ఒక విచిత్రమైన తర్కం. ఒకవేళ అమలు చేయకుంటే కాంగ్రెస్ పార్టీని రద్దుచేస్తారా?

ముఖ్యమంత్రి సవాలుకు హరీశ్ ప్రతి సవాలు ఇప్పటికే ముందుకొచ్చింది. ఆగస్టు 15 నాటికి రుణమాఫీతో పాటు, వందరోజుల గడువు గల ఆరు గ్యారెంటీలలోని 13 హామీలన్నింటిని అమలుపరిచే పక్షంలో తాను అసెంబ్లీకి రాజీనామా చేయటమే గాక, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా ఉప ఎన్నికలకు సైతం తిరిగి పోటీ చేయబోనని ప్రకటించారు. అమలు జరపటంలో విఫలమైతే రేవంత్‌రెడ్డి సీఎం పదవిని వదులుకోవాలన్నారు. ఇది ఏ విధంగా చూసినా సమంజసమైన ప్రతిపాదన. ప్రభుత్వానికి స్వయంగా తామే ఇచ్చిన హామీల అమలుకు 100 రోజులకు బదులు సుమారు 250 రోజుల సమయం లభిస్తుంది. అది 150 శాతం ఎక్కువ. ఇది చాలా మంచి అవకాశం గనుక ఇందుకు ముఖ్యమంత్రి నిస్సంకోచంగా అంగీకరించవచ్చు. ఆ పని చేసి అమలు కూడా చేసినట్లయితే తన ప్రతిష్ట గణనీయంగా పెరుగుతుంది. హామీలను 100 రోజులలో అమలుపరచని అప్రతిష్ట కొట్టుకుపోతుంది. తర్వాత నాలుగున్నరేండ్ల పాటు తమకు అసెంబ్లీలో హరీశ్‌రావు 'తల నొప్పి' ఉండదు. ఇందులో మరొక విచిత్రం ఏమంటే రుణమాఫీ అమలు చేస్తే హరీశ్ రాజీనామా చేయాలంటున్నారు గానీ, అమలు చేయలేకపోతే తను రాజీనామా చేస్తానని మాత్రం ప్రకటించటం లేదు.

రేవంత్‌రెడ్డి బేఫికర్ అసత్యాలకు మరొక ఉదాహరణ, తామిప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామనటం. ఇది ఎంతమాత్రం నిజం కాదని, అవన్నీ కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లేనని సాక్షాత్తూ నిరుద్యోగులే పలుమార్లు స్పష్టం చేసిన తర్వాత కూడా ఆయన ఆ ఉద్యోగాలు తమవని మళ్లీ మళ్లీ చెప్పటాన్ని చూసి ఏమనాలో తోచటం లేదు. బహుశా ఎవరికీ తోచదు. ఆరు గ్యారెంటీల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంది. ఆ గ్యారెంటీ కార్డును ప్రస్తుత వివాద సందర్భంగా పరిశీలించగా, అందులోని ఆరింటిలో ఏ అయిదింటిని అమలుపరిచామని రేవంత్‌రెడ్డి చెప్తున్నారో తెలియకుండా ఉంది.

ఆరింటిలోని 13 హామీలలో అమలుకు తెచ్చినవి ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ విలువ పెంపు అనే నాలుగు మాత్రమే. వీటిలో రెండవది, మూడవది ఆరంభించారు గాని పూర్తికాలేదు. చివరిది కేసీఆర్ అధికారంలో ఉండగానే అమలుకు వచ్చింది. ఇల్లు లేని వారికి రూ. 5 లక్షలన్నది 5వ హామీ అనుకుంటే అది ఎక్కడో నామకార్థంగా మాత్రమే మొదలైంది. అయినప్పటికీ మొత్తం అయిదు అనుకుంటే, 13 హామీలలో తక్కిన ఎనిమిదింటికి ఇంతవరకు ఆరంభమైనా జరగలేదు. అయినా రేవంత్‌రెడ్డి చతురమైన రీతిలో లెక్కలు గడుతూ, 6 గ్యారంటీలలో గల 13 ఉప హామీలలోని 5కు మాత్రం ఆరంభం చేసి, వాటిని మొత్తం 6 గ్యారెంటీలలో 5గా లెక్క చెప్తున్నారు.

ప్రజలతో ఈ చాతుర్యాలు ఒక ముఖ్యమంత్రికి తగినవేనా? ఆయన ప్రజలతో నిజాయతీగా ఉండదలిస్తే, ఆ 5 ఏమిటో, 6 గ్యారెంటీలలోని 13 హామీలేమిటో, వాటిలో దేని పరిస్థితి ఏ విధంగా ఉందో ఒక్కొక్కటిగా లెక్క చెప్పాలి. అట్లా చేయటం లేదు గనుకనే తనపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావటం అట్లుంచి, అంతకన్న ముఖ్యంగా ప్రజలకు విశ్వాసం లేకుండా పోతున్నది. ముఖ్యమంత్రి ప్రతిపక్షాలను ఇతర విమర్శకులను తోసిపుచ్చవచ్చు. కాని ప్రజలను తోసిపుచ్చలేరు గదా?

ఇప్పుడు ఆగస్టు 15 కొత్తగా గడువు మాట చూద్దాం. ముఖ్యమంత్రి అప్పటికి రుణమాఫీ చేసి తీరగలమని దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నారు. తెలంగాణలో ఈ ప్రమాణాల సంస్కృతి ఒకటి రాజకీయాల్లోకి గమ్మత్తుగా ప్రవేశించింది. దీనిని బీజేపీ, కాంగ్రెస్‌లు తమ నిజాయితీ లేనితనానికి నిదర్శనంగా తీసుకువస్తున్నాయి. అదట్లుంచి ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీకి మొత్తం రూ.39 వేల కోట్లు అవసరమన్నది ఒక అంచనా. అది చేయటం సాధ్యం కాదన్నది ఒక అభిప్రాయం. గమనించవలసింది ఒకటున్నది. వంద రోజుల గడువు గల 6 గ్యారెంటీలలోని 13 హామీలలో ఉన్న వాటి అమలుగురించి ఆయన ఇప్పటికీ ఏమనటం లేదు. వాటి మాటేమిటని ప్రజలు, ప్రతిపక్షాలు, ఇతరులు సూటిగా ప్రశ్నించినా స్పందించటం లేదు. వాటిలో మహిళలకు ప్రతి నెల రూ.2500, రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, పింఛన్లను రూ.4,000కు పెంచటం అనేవి ఉన్నాయి. ఇవిగాక నిరుద్యోగ భృతి నెలకు రూ.4,000, ఆటో కార్మికులకు రూ.12,000 చొప్పున సహాయం, ఆడపిల్లల పెళ్లికి తులం బంగారం అనేవీ ఉన్నాయి. ఇవన్నీ భారీ మొత్తంలో ఖర్చుతో కూడుకున్నవి. వీటికి కాగల ఖర్చెంతో కూడా ప్రభుత్వం వద్ద అంచనాలు ఉన్నట్టు కనిపించదు. అంచనా వేసేందుకే వారు భయపడుతున్నట్టున్నారు. ఇటువంటి స్థితిలో, ఆగస్టు 15ను గడువు రోజుగా తీసుకుంటే, రేవంత్‌రెడ్డికి, హరీశ్‌రావుకు మధ్య సవాళ్లు–ప్రతి సవాళ్లు ఏ విధంగా ముగియవచ్చునన్నది ఆసక్తికరంగా మారుతున్నది.

రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆగస్టు 15 మాటలు ప్రతిరోజు, తాను వెళ్లిన ప్రతిచోటా, మరిచిపోకుండా అంటున్నారు. అంతేకాదు, ఎక్కడికి వెళ్తే అక్కడి దేవుళ్ల మీద ప్రమాణాలు కూడా చేస్తున్నారు. అట్లా ఈ నెల 20 నుంచి 24వ తేదీ మధ్య నాలుగు సభలలో ఏడుగురు దేవుళ్ల మీద ఒట్లు పూర్తయ్యాయి. అయినా రైతులు నమ్మకపోవచ్చునని అనుమానంతో కావచ్చు, 'నన్ను నమ్మండి' అనే మాటను సైతం నొక్కి మరీ చెప్తున్నారు. దీనంతటి మధ్య గమనించవలసిందేమంటే, డిసెంబర్ 9 నాడు ఎందుకు మాఫీ చేయలేదు?

పనిచేయని కిషన్.. క్యారెక్టర్ లేని దానం

- ఎంపీ ల్యాడ్స్ నిధులూ ఖర్చు చేయని కిషన్‌రెడ్డి
- మళ్లీ గెలిచినా ఆయన ప్రజలకు చేసేందేముంది?
- అధికారం ఎక్కడ ఉంటే దానం అక్కడే ఉంటాడు
- సమస్యలపై పార్లమెంట్‌లో ప్రజా గొంతుకవుతా
- భారీ మెజార్టీతో లష్కర్‌పై గులాబీ జెండా ఎగరేస్తా
- 'నమస్తే తెలంగాణ'తో బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'పజ్జన్న అంటే అషామాషీ కాదు.. ఎల్లవేళలా ప్రజా గొంతుకై నిలబడే వ్యక్తి.. పద్మారావు కాడికి పోతే సమస్య ఎలాంటిదైనా పరిష్కారం చూపుతాడన్న నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో ఉన్నది. ఇప్పుడు ఆ నమ్మకాన్నే హైదరాబాదీ బిడ్డగా పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తా. సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పి నియోజకవర్గ, రాష్ట్ర అభివృద్ధికి నా వంతు ప్రయత్నం చేస్తా. ఎంపీ ల్యాడ్స్ నిధులూ కూడా ఖర్చు చేయని ఏకైక ఎంపీ కిషన్‌రెడ్డి. మళ్లీ గెలిచినా ఆయన ప్రజలకు చేసేందేముంటది? దానం నాగేందర్‌కు క్యారెక్టర్ లేదు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాడు. లష్కర్ ప్రజల మద్దతు నాకే ఉన్నది. భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగరేస్తా' అని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి టీ పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మంచి చెడు ఏదైనా అండగా ఉండే వ్యక్తినని చెప్పారు. ఎంపీగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేని కిషన్‌రెడ్డికి ఈ సారి ఓటమి తప్పదని అన్నారు. అలవికాని హామీలు, మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన నాలుగు నెలలకే ప్రజలకు అర్థమైందని, హస్తం అభ్యర్థులకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తోటి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఉద్యమకారులు, కార్యకర్తలు, అభిమానులు అందరి కలిసికట్టుగా ప్రజల్లోకి వెళ్తున్నామని, అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కే మరోసారి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి తన గెలుపునకు బాట అని, ఈ ఎన్నికల్లో లష్కర్‌పై గులాబీ జెండాను ఎగరవేసి పార్టీ అధినేత కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వబోతున్నట్టు పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

పద్మారావుకే ఎందుకు ఓటు వేయాలి? అంటే ఏం చెప్తారు?

నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచా అంటేనే నా నియోజకవర్గ ప్రజలు నాపై పెట్టుకున్న నమ్మకం.. నేను ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే వ్యక్తిని. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే వాడిని. నా నియోజకవర్గ ప్రజలకే కాదు.. హైదరాబాద్ ప్రజలకు పజ్జన్నగా సుపరిచితుడిని. పద్మారావు వద్దకు వెళితే సమస్య ఎలాంటిదైనా పరిష్కారం చూపుతాడన్న నమ్మకం నియోజకవర్గ ప్రజల్లో ఉన్నది. ఆ నమ్మకానే పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు అందిస్తా. ప్రజా గొంతుకై పార్లమెంట్‌లో గళం వినిపిస్తా. 14 ఏండ్లు జై తెలంగాణ అన్నోడిని.. పార్లమెంట్‌లో గొంతు ఎత్తడం పెద్ద సమస్యే కాదు.

ప్రచారం ఎలా సాగుతున్నది? ప్రజల స్పందన ఎలా ఉన్నది?

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రమే కాదు హైదరాబాద్ నగరం గణనీయమైన అభివృద్ధిని సాధించింది. అపారమైన అనుభవం, ముందుచూపు గల నేత కేసీఆర్ మార్గదర్శకంలో పురపాలకశాఖ మంత్రిగా తారక రామారావు హైదరాబాద్‌కు వన్నే తీసుకొచ్చి ప్రపంచ దేశాలు మనవైపు చూసేలా చేశారు. జోడ్డెద్దులా మాదిరిగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయి. దురదృష్టవశాత్తు అలవికాని హామీలు ఇచ్చి.. అరచేతిలో స్వర్గం చూపించినట్టు నోటికొచ్చిన హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కానీ, నాలుగు నెలల్లోనే రైతాంగం, గ్రామీణ ప్రజల్లో పొరపాటు చేశామనే భావన కనబడుతున్నది. పాదయాత్ర సమయంలో రూరల్ ఓటర్లు ఇదే రీతిలో స్పందిస్తున్నారు. పదేండ్ల అభివృద్ధి ముద్దు.. వంద రోజుల అబద్ధాలు వద్దని సబ్బండ వర్ణాల ప్రజలు అంటున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఘోర పరాభావం తప్పదు.

నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో మీరు ఏం గమనించారు?

ప్రజల శ్రేయస్సే ముఖ్యమనే ధోరణిలో పరిపాలన సాగాలి. కానీ ఈ ప్రభుత్వం ఒక్క రాజకీయ దృష్టితో కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నదే తప్ప సాగు, తాగునీటిపై ఎలాంటి ఆలోచన చేయడం లేదు. అవగాహనారాహిత్యం కొట్టొచ్చినట్టుగా కనబడుతున్నది. అనుభవం ఉన్న వారిని కలుపుకుని పోతేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయి. కానీ, ఇప్పుడున్న వారికి అనుభవం లేకనే ఈ సమస్యలు. బెంగళూరులో ప్రజలు తాగునీటికి అల్లాడిపోతున్నారు? హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి చాలా బస్తీలు, కాలనీల్లో ఉన్నది. మూడు రోజులైనా వాటర్ ట్యాంకర్ దొరకని దుస్థితి. వాటర్ ట్యాంకర్ భారం కనీసంగా ఒక్క అపార్ట్‌మెంట్‌పై నెలకు రూ.15 వేలు పడుతున్నది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం. బీఆర్‌ఎస్ పాలనలో తాగు, సాగునీటిని అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఆ దిశగా ఫలితాలు రాబట్టాం. కానీ, కాంగ్రెస్ పాలకుల తీరుతో ముమ్ముందు మరిన్నీ సమస్యలు ఎదురవుతాయి.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, మరో అవకాశం ఇవ్వాలని కిషన్‌రెడ్డి అంటున్నారు.. మీరెమంటారు?

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి అయిండు కానీ.. ఆ సంతోషాన్ని ప్రజలకు ఇవ్వలేకపోయిండు. నియోజకవర్గంలో ఏనాడూ అందుబాటులో లేడు. కేంద్రమంత్రిగా కోట్ల నిధులతో అభివృద్ధి చేసే అవకాశం ఉంటది. కానీ కిషన్‌రెడ్డి అదనపు నిధులు కాదు కదా.. కనీసం ఎంపీ ల్యాడ్స్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా దేశంలోనే ఏకైక ఎంపీగా కిషన్‌రెడ్డి నిలిచిండు. నాకు తెలిసి నియోజకవర్గంలో కిషన్‌రెడ్డి రెండే రెండు అతి గొప్ప పనులు చేసిండు. ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఒకటి, ఓ స్కూల్ వద్ద రేకుల షెడ్డులు వేసిండు. కానీ మా ప్రభుత్వంలో ఒక్క హైదరాబాద్‌లోనే 34 ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టులు చేపట్టాం. కిషన్‌రెడ్డి మాత్రం అంబర్‌పేట ఫ్లై ఓవర్ ఒక్కటి పూర్తి చేయలేక పోయిండు.

బీజేపీ సెంటిమెంట్ రాజకీయాలపై మీ అభిప్రాయం?

హిందువులు అనేది బీజేపీకి ఏదైనా ఆధార్ కార్డా? వాళ్లు జై శ్రీరామ్ అంటే.. మనం ఏమైనా జై రావణాసురా.. అంటమా? బీజేపీ కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మతాన్ని తెరమీదకు తెస్తున్నది. ఈ మతతత్వ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌కు కొమ్ముకాసి సామాన్యుడి జీవనాన్ని చిన్నాభిన్నం చేసిందని ప్రజలకు అర్థమైంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఓ మినీ ఇండియా. ఉత్తర భారతీయులతోపాటు క్రైస్తవులు, మైనార్టీలు ఇలా సబ్బండవర్ణాలతో కులాలకు, మతాలకు అతీతంగా బీఆర్‌ఎస్ పాలనలో అందరినీ కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో అమిత్‌షా, నితిన్ గడ్కరీ లాంటి అగ్రనేతలు వచ్చి ప్రచారం చేసినా ఐదింటికి ఐదు కార్పొరేషన్ స్థానాలను గెలిచాం. ఇది ఇక్కడి ప్రజలకు ఉన్న చైతన్యం. కిషన్‌రెడ్డి ఈ నియోజకవర్గంలో ఫెయిల్ అయిండు కాబట్టే మేం అత్యధిక మెజార్టీతో లష్కర్‌పై గులాబీ జెండాను ఎగరవేయబోతున్నాం.

దానం నాగేందర్ మీ పార్టీని విడిచి ప్రత్యర్థిగా బరిలోకి దిగారు? దీనిని మీరేలా చూస్తారు?

దానం నాగేందర్ క్యారెక్టర్ లేని వ్యక్తి. ఆ వ్యక్తి గురించి నాకంటే నియోజకవర్గ ప్రజలకే బాగా తెలుసు. ఇంటి నుంచే బయటకు రాలేని దుస్థితిలో ఉన్నాడు. దానం అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉంటాడు. గతంలో టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన దానం.. గతంలోనే ప్రజల చేతిలో ఓడిపోయాడు. ఇప్పుడు కూడా దానంకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నరు.



అమిత్‌షా విజయ సంకల్ప సభలో సహారా ఇండియా బాధితుల నిరసన

నేతలు ఫుల్లు.. జనం నిల్లు

- సిద్దిపేట, నిజామాబాద్‌లో బీజేపీ సభలు వెలవెల
- అమిత్‌షా మాట్లాడుతుండగా ఖాళీ కుర్చీలు దర్శనం
- షాకు 'సహారా ఇండియా' బాధితుల నుంచి నిరసన సెగ

సిద్దిపేట/వినాయక నగర్/సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 25: సిద్దిపేట, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ గురువారం నిర్వహించిన సభలు జనం లేక వెలవెలబోయాయి. వేదికలపై నేతలు ఫుల్లుగా ఉన్నా.. సభా ప్రాంగణాలు జనం లేక బోసిపోయాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సిద్దిపేట సభకు ఆలస్యంగా రావడంతో ప్రజలు సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అమిత్‌షా మధ్యాహ్నం 1:56 నిమిషాలకు సభ వేదికపై చేరుకొని ప్రసంగాన్ని ప్రారంభించి 2:05 నిమిషాలకు ముగించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సభలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రసంగించే సమయానికి జనం వెళ్లిపోయారు. ఆ సమయంలో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. ఈ సభలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. దీంతో పాటు సహారా ఇండియా బాధితుల నుంచి కూడా నిరసన సెగ తగిలింది. సహారా ఇండియాలో రాష్ట్రం నుంచి చాలా మంది పెట్టుబడులు పెట్టి నష్టపోయారు. అమిత్‌షా సభ సిద్దిపేటలో ఉందని తెలుసుకొని పెద్దపల్లి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, వరంగల్ సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి సహారా ఏజెంట్లు, ఖాతాదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సహారా ఇండియాలో పెట్టుబడులు పెట్టి నష్టపోయామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.

కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది

తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బీజేపీ మెదక్ పార్లమెంట్ విజయ సంకల్పయాత్ర సభ జరిగింది. ఈ సభలో అమిత్‌షా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ప్రజలు 12 ఎంపీ సీట్లు ఇచ్చి మోదీని ప్రధానిగా చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పారు.

రిజర్వేషన్ల రద్దే బీజేపీ ఎజెండా

- ఆర్‌ఎస్‌ఎస్ విధానమే అమలు
- పీసీసీ అధినేత, సీఎం రేవంత్ రెడ్డి
- బీజేపీపై చార్జ్‌షీట్ విడుదల



గాంధీభవన్‌లో బీజేపీపై చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆ పార్టీ విధానమని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాన్నే బీజేపీ అమలు చేస్తోందని విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం బీజేపీపై రేవంత్‌రెడ్డి ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో పదేండ్ల బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, కుట్రలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లు రద్దే బీజేపీ ఎజెండా అని, అందుకు 400 ఎంపీ సీట్లు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. 2025లోగా రిజర్వేషన్లను రద్దు చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ విధానమని ఆరోపించారు. ఎలాగైనా రిజర్వేషన్ల రద్దుకు మోదీ కుట్ర చేస్తున్నారని సీఎం ఆరోపించారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని రాహుల్ గాంధీ స్పష్టంగా ప్రకటించారని, దీనిని అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీకి వేసే ప్రతీ ఓటు రిజర్వేషన్ల రద్దుకు వేసినట్లేనని, వర్గీకరణ కోసం కొట్లాడిన వారు కూడా బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నారో తెలియడంలేదని పరోక్షంగా ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణపై ధ్వజమెత్తారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ వైపు నిలబడొద్దని, ఈ ఎన్నికలు రిజర్వేషన్లు వర్సెస్ రిజర్వేషన్లు రద్దుగా రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. రైతుల పోరాటంతో నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్న మోదీ.. పార్లమెంట్ సాక్షిగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చేనేత నుంచి కుటీర పరిశ్రమల వరకు జీఎస్టీ పేరుతో పేదల శ్రమను దోచుకుందని ధ్వజమెత్తారు. ప్రజలపై రూ.168 లక్షల కోట్ల అప్పులభారం మోపి, పదేండ్లలో రూ.113 లక్షల కోట్లు అప్పులు తెచ్చి దేశాన్ని తాకట్టు పెట్టారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ప్రభాకర్, సురేఖ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాసు మున్షీ, నాయకులు జగ్గారెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, ఎల్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



అవి ఉత్త కోతలు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	44.9°c	32.3°c
ఆదిలాబాద్	43.8°c	24.2°c
మహబూబ్‌నగర్	43.2°c	25.0°c
మెదక్	42.8°c	22.0°c
రంగారెడ్డి	42.4°c	20.6°c
ఖమ్మం	42.0°c	26.0°c
నిజామాబాద్	41.4°c	27.3°c
వరంగల్	41.0°c	27.0°c
హైదరాబాద్	41.0°c	28.6°c
కరీంనగర్	41.0°c	27.0°c

ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు ఫిర్యాదు

- ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై రాష్ట్ర హైకోర్టు ఆదేశం
- కడియం, దానం, తెల్లం ఫిరాయింపుపై పిటిషన్ విచారణ
- విచారణ ఈ నెల 29కి వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 25, (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై ఫిర్యాదును ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు పిటిషనర్ తరపు న్యాయవాదికి సూచించింది. సదరు ఫిర్యాదును అందుకున్నట్టుగా స్పీకర్ కార్యాలయం నుంచి ధ్రువీకరణ రశీదు కూడా తీసుకోవాలని తెలిపింది. బీఆర్‌ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసే అవకాశాన్ని అసెంబ్లీ కార్యదర్శి తమకు కల్పించలేదంటూ పిటిషనర్ చేసిన విజ్ఞప్తిని హైకోర్టు పరిగణనలోకి తీసుకున్నది. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని, వారిపై అనర్హత వేయాలనే ఫిర్యాదులను స్పీకర్ కార్యాలయం స్వీకరించకపోవడం వల్లే పిటిషన్ దాఖలు చేసినట్టు కుత్బుల్లాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హైకోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. స్పీకర్‌కు ఫిర్యాదు చేసేందుకు ఈ నెల 3న, 9న వెళితే అనుమతి లభించలేదని తెలిపారు. స్పీకర్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. దీంతో ఈ నెల 10న రిజిస్టర్ పోస్టు, ఇ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, దానికి ధ్రువీకరణ కూడా ఇవ్వలేదన్నారు. రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన కవర్ తిరిగి వెనక్కి వచ్చేసిందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ అనర్హత పిటిషన్లను స్వీకరించాలన్నారు. బీఆర్‌ఎస్ తరఫున గెలుపొందిన కడియం, వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరారని, కడియం కుమార్తె కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ కూడా కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుంటూ.. ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని, పిటిషన్లను ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్ కార్యాలయానికి పంపే ఏర్పాట్లు చేస్తామన్నారు. స్పందించిన హైకోర్టు.. స్పీకర్‌కు ఫిర్యాదు కాపీలు అందనప్పుడు కడియం, వెంకట్రావుపై అనర్హత వేటువేయాలని ఎలా ఉత్తర్వులు ఇవ్వగలమని పిటిషనర్‌ను ప్రశ్నించింది. పిటిషనర్ ఫిర్యాదును ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్‌కు పంపేలా ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది.

దానంపై కూడా..

ఖైరతాబాద్ నుంచి బీఆర్‌ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరి సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల చట్టానికి వ్యతిరేకమంటూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. దానం సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారని, ఆయనకు కాంగ్రెస్ బీ-ఫారం ఇచ్చిందని తెలిపారు. అఫిడవిట్‌ను కూడా ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్ కార్యాలయానికి పంపేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అందుకు న్యాయమూర్తి సమ్మతించారు. అనంతరం పిటిషనర్ల తరపు న్యాయవాది సంతోష్‌కుమార్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలన్న ఫిర్యాదు కాపీలను ప్రభుత్వ న్యాయవాది మోహనారెడ్డికి అందజేశారు. వాటిని స్పీకర్ కార్యాలయానికి పంపినట్టుగా సోమవారం తమకు తెలియజేయాలని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.

పిల్ పై విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా చేపట్టే బదిలీల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన బీ నాగధర్‌సింగ్ దాఖలు చేసిన పిల్‌ను ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్‌ఆరాదే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. ఎన్నికల సంఘం నిరుడు డిసెంబర్‌నాటి మార్గదర్శకాల ప్రకారం మూడేళ్లకు పైబడి ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలని, గత ఫిబ్రవరి నాటి సూచనల్లో ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అధికార దుర్వినియోగానికి దారితీసేలా ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది అవినాశ్‌దేశాయ్ ప్రతివాదన చేస్తూ... అక్రమ మద్యం కట్టడికి ఎక్సైజ్ అధికారులే అవసరంలేదన్నారు. హైకోర్టు తీర్పును వాయిదావేస్తున్నట్టు ప్రకటించింది.

సివిల్ సర్వెంట్లకు పవర్, దయ అవసరం : గవర్నర్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వెంట్లుకు అధికారం, ఇతరుల పట్ల దయ కలిగి ఉండాలని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్ సంస్కృతి హాల్‌లో ఇన్‌స్పైర్-2024 పేరిట కార్యక్రమం నిర్వహించారు. దీనికి గవర్నర్ హాజరై, ఇటీవల విడుదలైన 2023 సివిల్ సర్వీస్ ఎగ్జామ్ టాప్ ర్యాంకర్లతో సమావేశమయ్యారు. పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. టాపర్లతో పాటు వారి కుటుంబాలను గవర్నర్ సన్మానించారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉన్నారు.

25 వరకు 'లాసెట్' గడువు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): న్యాయవాద కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ లాసెట్, పీజీలాసెట్ దరఖాస్తుల గడువును మే 4 వరకు పొడిగించినట్టు అధికారులు తెలిపారు. ఈ గురువారం గడువు ముగియగా, మరో అవకాశం ఇస్తున్నట్టు లాసెట్ కన్వీనర్ బీ విజయలక్ష్మి తెలిపారు.

బీసీ గురుకులాల జయకేతనం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ ఫలితాల్లో బీసీ గురుకుల విద్యార్థులు జయకేతనం ఎగురవేశారు. ఫలితాల్లో కే శ్రీనివాస్ 97.51, ఈ వైష్ణవి 96.78 పర్సంటైల్ సాధించారు. మొత్తంమీద 44 మంది అబ్బాయిలు, 28 మంది అమ్మాయిలు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం విద్యార్థులను అభినందించారు.

ఏఈ జీఆర్ జాబితా విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో అసిస్టెంట్ ఇంజినీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్‌ఎల్)ను గురువారం వెల్లడించారు. ఫలితాల జాబితాను https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

మూడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మూడు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు అటానమస్ హోదా దక్కింది. న్యాక్ గుర్తింపు ఆధారంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బోధన్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఖైరతాబాద్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ కరీంనగర్‌కు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తాజాగా ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కోదాడకు కూడా అటానమస్ హోదా దక్కాల్సి ఉన్నది. చిన్న కారణం చేత ఇది నిలిచినట్టు తెలిసింది.

పైసలు పంచినా ఓట్లెందుకు పడలే?

- పెంట్లవెల్లిలోనే ఎక్కువ డబ్బులు ఖర్చు చేసిన!
- కాంగ్రెస్ నాయకులను నిలదీసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎన్నికల వేళ వైరల్‌గా మారిన మంత్రి వ్యాఖ్యలు
- ఈసీ చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో ట్రోల్స్



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందా? అనే ప్రశ్నకు ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు అవుననే బలం చేకూరుస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ ఎన్నికల వేళ సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. కొల్లాపూర్‌లోని పెంట్లవెల్లి లో ఇటీవల కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. 'రేమద్దులలో (సర్పంచులు, ఎంపీటీసీలు) అందరూ వాళ్లే.. అక్కడ 900 మెజారిటీ వచ్చింది. చిన్నంబావిలో ఎంపీపీలు, జడ్పీటీసీలు వాళ్లే.. అధికారులు వాళ్లే.. పెత్తనం కూడా వాళ్లదే. అక్కడ కూడా సుమారు 300-400 మెజారిటీ వచ్చింది. పెంట్లవెల్లిలో ఏం తక్కువ చేసినం, మరి ఎందుకు ఓట్లు రాలే' అంటూ కార్యకర్తలపై మండిపడ్డారు. మధ్యలో కార్యకర్తలు, నాయకులు కలుగజేసుకొని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తుంటే.. 'వినండి.. వినండి.. అన్ని చోట్ల కంటే ఎక్కువగా పెంట్లవెల్లిలోనే ఖర్చుపెట్టిన. ఇక్కడ పెట్టిన ఖర్చు ఎక్కడా పెట్టలేదు. ఎందుకు ఓట్లు రాలేదు?' అంటూ కార్యకర్తలను ప్రశ్నించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అడ్డగోలుగా డబ్బులు ఖర్చు పెట్టిందని ఆ మంత్రి మాటలతో స్పష్టమవుతుందని విపక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. సదరు మంత్రిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నేటిజన్లు సోషల్‌మీడియాలో ట్రోల్స్ చేస్తున్నారు.

కేసీఆర్ ప్రకటనలపై చర్చకు సిద్ధం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు రంగంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటనలపై చర్చకు సిద్ధమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. గురువారం ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దీర్ఘకాలిక అవసరాల కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేశామన్న కేసీఆర్ మాటల్లో వాస్తవంలేదని స్పష్టం చేశారు. యూనిట్‌కు రూ.3.90 పెట్టి కొన్నామని కేసీఆర్ ప్రకటించారని, కానీ యూనిట్‌కు రూ.20 చొప్పున చెల్లించి కొనుగోలు చేసిన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ఎన్టీపీసీ నుంచి యూనిట్‌కు రూ.15 చొప్పున కొనుగోలు చేస్తామంటే ఒప్పుకోలేదని కేసీఆర్ అన్నారని, కానీ ఎన్టీపీసీ రూ.5.60కే యూనిట్ చొప్పున 1600 మెగావాట్లు సరఫరా చేసిందన్నారు. 2023 డిసెంబర్ నుంచి తెలంగాణ డిస్కమ్‌లు కొనుగోలు చేసిన విద్యుత్తు ఒక్కో యూనిట్ ధర రూ.5.34 మాత్రమేనన్నారు. 2012లోనే హైదరాబాద్ పవర్ ఐలాండ్‌కు తాము రూపకల్పన చేశామని, ఆయా అంశాలపై చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులు

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు పర్యావరణ అనుమతులొచ్చేందుకు సహకరించిన వారికి మంత్రి భట్టి ధన్యవాదాలు తెలిపారు. ఎన్జీటీ సూచించిన షరతుల మేరకు అన్నింటినీ పూర్తి చేసి అనుమతులు సాధించడం గొప్పవిషయమని ఓ ప్రకటనలో ప్రశంసించారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. నెలల్లో సమీక్షించి, పనుల్లో వేగం పెంచినందునే పర్యావరణ అనుమతుల జారీ అయ్యాయని చెప్పారు.

కరెంట్ కాటుకు కౌలు రైతు బలి

పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి తెగి పడిన వైరుకు తగిలి మృతి



నర్సయ్య (ఫైల్)

జగిత్యాల రూరల్, ఏప్రిల్ 25: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా రూరల్ మండలం తిప్పన్నపేటలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తిప్పన్నపేటకు చెందిన కౌలు రైతు నలువాల నర్సయ్య (57) ఎకరన్నర భూమిని కౌలుకు తీసుకొని కొద్దిరోజులుగా సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అప్పటికే పొలం వద్ద తెగి పడి ఉన్న ఎల్‌టీ విద్యుత్తు వైరు తగలడంతో షాక్ కొట్టి మృతి చెందాడు. తమ పొలం వద్ద విద్యుత్తు వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని నర్సయ్య కొడుకు రమేశ్ ఆరోపించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నర్సయ్యకు భార్య, కొడుకు ఉన్నారు. కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. విద్యుత్తు ఏడీ జవహర్‌లాల్ నాయక్, ఏఈ సురేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా భద్రాచలంలో 44 డిగ్రీలు, ఖమ్మంలో 43.4, నల్లగొండలో 42.8, నిజామాబాద్‌లో 42.7, రామగుండంలో 42.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నిన్నమొన్నటి వరకు వర్షాలు కురిసి కాస్త చల్లబడ్డా.. ఇప్పట్లో వర్షాలు లేనట్టేనని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి ఎండలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల వరకు పెరిగే సూచన ఉన్నట్టు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వైద్య నిపుణులు సూచించారు.

రోహిణి రాకముందే రోళ్లు పగుల్తున్నయ్!

ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలకు మించి వేడిమి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయని నానుడి. ప్రస్తుత ఎండలను చూస్తే ఆ దుస్థితి ముందే వచ్చినట్టు కనిపిస్తున్నది. గత ఏడాదితో పోలిస్తే ఫిబ్రవరి నుంచే అధిక ఉష్ణోగ్రతల నమోదు మొదలైంది. మార్చిలో సాధారణం కంటే రోజువారీ ఉష్ణోగ్రతలు నాలుగైదు డిగ్రీలు ఎక్కువగానే రికార్డయ్యాయి. దేశమంతటా ఇదే పరిస్థితి నెలకొన్నది. ఈ ఏడాది మార్చి-మే నెలల మధ్య ఎండ చండప్రచండంగా ఉంటుందని ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా పనిచేసే ప్రపంచ వాతావరణ పరిశోధన సంస్థ ముందే అంచనావేసింది. ఎల్‌నినో కారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఆ సంస్థ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి పెరగడాన్ని ఎల్‌నినో అంటారు. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి 32 నుంచి 34 డిగ్రీల సెల్సియస్‌కు చేరితే ఆ పరిస్థితిని 'సూపర్ ఎల్‌నినో' అంటారు. ఉష్ణోగ్రతలకు మించి వేడి తీవ్రత ఉండటాన్ని వాతావరణ శాస్త్రవేత్తలు 'ఫీల్ లైక్ టెంపరేచర్' అంటారు. గాలిలో తేమ శాతం తగ్గడమే దీనికి కారణమని, తద్వారా ఉక్కపోత ఎక్కువ ఉంటుందని శాస్త్రవేత్తలు తెలిపారు. వడదెబ్బ మృతుల సంఖ్య ఈ సారి పెరిగే ప్రమాదం ఉన్నట్టు హెచ్చరించారు. 2024 జూన్ నాటికి ఎల్‌నినో ప్రభావం క్షీణించి, పరిస్థితి సాధారణస్థితికి వస్తుందని ప్రపంచ వాతావరణ సంస్థ తెలిపింది. మే చివరి నాటికి లానినో ఏర్పడుతుందని, ఫలితంగా వర్షాకాలంలో మునుపటి కంటే వానలు బాగా పడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు.



గాండే ఉప ఎన్నిక బరిలో హేమంత్ సొరేన్ సతీమణి కల్పన

పోటీ చేస్తున్నట్లు ప్రకటన

రాంచీ, ఏప్రిల్ 25: జార్ఖండ్‌లో జరిగే గాండే అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సతీమణి కల్పనా సొరేన్ పోటీ చేస్తారని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) గురువారం ప్రకటించింది. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానానికి మే 20న ఉప ఎన్నిక జరుగనుంది. ప్రస్తుతం గృహిణిగా ఉన్న కల్పనా ఎంటెక్, ఎంబీఏ చదువుకున్నారు. మనీలాండరింగ్ కేసులో హేమంత్ సొరేన్ అరెస్టయిన విషయం తెలిసిందే.



కేరళలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి తరలివెళ్తున్న సిబ్బంది

నేడే రెండో విడత

- 89 స్థానాలకు పోలింగ్
- పోటీలో 1,206 మంది
- బరిలో రాహుల్, కుమారస్వామి, థరూర్, రాజీవ్ చంద్రశేఖర్, హేమామాలిని, ఓం బిర్లా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల రెండో విడత పోలింగ్ శుక్రవారం జరగనుంది. 13 రాష్ర్టాల్లోని 89 లోక్‌సభ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరుగుతాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ సహా కేరళలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకు ఇదే విడతలో పోలింగ్ జరగనుంది. కర్ణాటకలోని 28 స్థానాల్లో 14 స్థానాలకు, రాజస్థాన్‌లో 8 సీట్లు, ఉత్తరప్రదేశ్‌లో 8, మధ్యప్రదేశ్‌లో 7, అస్సాంలో 5, బీహార్‌లో 5, ఛత్తీస్‌గఢ్‌లో 3, పశ్చిమ బెంగాల్‌లో 3 స్థానాలకు, మణిపూర్, త్రిపుర, జమ్ముకశ్మీర్‌లో ఒక్కొక్క స్థానానికి ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,206 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నేతలు శశి థరూర్, కేసీ వేణుగోపాల్, కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్, అరుణ్ గోవిల్(రామాయణం సీరియల్ రాముడి పాత్రధారి), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, నటి హేమమాలిని, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తదితర ప్రముఖులు ఈ విడతలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. రెండో విడత పోలింగ్‌తో కేరళ, రాజస్థాన్, త్రిపురలోని అన్ని స్థానాలకు పోలింగ్ పూర్తవుతుంది. ఇప్పటికే ఏప్రిల్ 19న జరిగిన మొదటి విడతలో తమిళనాడు, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, అండమాన్, నికోబార్ దీవులు, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, లక్షద్వీప్‌లో అన్ని స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి.

లోక్‌సభ ఎన్నికల ఖర్చు రూ. 1.35 లక్షల కోట్లు!

ప్రపంచంలోనే ఖరీదైన ఎన్నికలివి • ఎన్నికల నిపుణుడు భాస్కర్ రావు


న్యూఢిల్లీ: భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిపుణులు అంచనావేస్తున్నారు. గత రికార్డులను 2024 సార్వత్రిక ఎన్నికలు బ్రేక్ చేస్తాయని వారు చెబుతున్నారు. భారత్‌లో ఈసారి ఎన్నికల వ్యయం రూ.1.35 లక్షల కోట్లకు చేరుకుంటుందని 'సెంటర్ ఫర్ మీడియా స్టడీస్'కు నేతృత్వం వహిస్తున్న ఎన్ భాస్కర్ రావు చెబుతున్నారు. 2019 ఎన్నికల వ్యయం రూ.60 వేల కోట్లతో పోల్చితే, ప్రస్తుత ఎన్నికల వ్యయం రెట్టింపుగా ఉంటుందని చెప్పారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన అంశాలను సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే స్వచ్ఛంద సంస్థ, గత 35 ఏండ్లుగా నిశితంగా పరిశీలిస్తున్నది.

జనంపై ధరలు 'మోది'!

బీజేపీ హయాంలో నిత్యావసరాల ధరలు పైపైకి

- ఉప్పు, పప్పు నుంచి కూరగాయల వరకూ భగ్గు
- పదేండ్ల పాలనలో 300 శాతం వరకూ పెరుగుదల
- చమురుమంట, సాగు పెట్టుబడి ఖర్చూ కారణమే
- ముగ్గురికి వారం భోజనం ఖర్చు రూ.2 వేల పైనే
- ధరలకు కళ్లెం వేయడంలో మోదీ సర్కారు ఫెయిల్
- సీఎస్‌డీఎస్ సర్వేలో 57% మంది అభిప్రాయం ఇదే
- ఎన్నికలపై ధరల ప్రభావం ఉంటుందన్న ఓటర్లు





(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): బియ్యం, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, పాలు, ఆలుగడ్డ, చింతపండు ఇలా అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్రం చమురు రేట్లను పెంచితే, దాని దెబ్బ వ్యవసాయ పెట్టుబడి, రవాణా వ్యవస్థపై పడింది. తద్వారా ఆ ప్రభావంతో సరుకుల ధరలు నింగినంటాయి. మరోవైపు మోదీ ప్రభుత్వం ముందుచూపులేని విధానాలతో అంతర్జాతీయంగా రూపాయి అథఃపాతాళానికి చేరుకొన్నది. దీని ప్రభావం దిగుమతులపై పడి అంతిమంగా అది నిత్యావసరాల ధరలు ఆకాశానికి చేరేలా చేసింది. ప్రతీరోజూ కూరల్లో ఉపయోగించే అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చితో పాటు క్యాప్సికం, బీన్స్ వంటి కూరగాయలు, వంటింటి మసాలాల ధరలు అందుకోలేని విధంగా పెరిగిపోయాయి. మొత్తంగా గడిచిన ఆరేడు నెలల్లోనే వివిధ కూరగాయలు, నిత్యావసరాల ధరలు 10 నుంచి 200 శాతం వరకు పెరిగినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మంట రేపుతున్న రూపాయి పతనం

2014లో మోదీ ప్రధానిగా అధికారం చేపట్టిన నాటి నుంచి నిత్యావసరాల ధరలు సుమారు 300 శాతం పెరిగినట్టు లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా చార్జీలు 31 శాతం వరకు పెరిగినట్టు ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ, ఆ లాభాన్ని వినియోగదారుడికి అందకుండా బీజేపీ సర్కారు ఖజానాకు మళ్లించింది. గడిచిన పదేండ్ల మోదీ సర్కారు డీజిల్‌పై 343 శాతం, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ పన్నులను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) నివేదిక వెల్లడించింది. ఇదిలాఉండగా అంతర్జాతీయంగా రూపాయి చారిత్రక స్థాయికి పతనమవ్వడం పరిస్థితిని మరింతగా దిగజార్చింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటం, పెట్రోల్‌పై కేంద్రం సుంకాలను తగ్గించకపోవడంతో రానున్న రోజుల్లో నిత్యావసరాల ధరలు మరింతగా పెరిగే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎన్నికలపై తీవ్ర ప్రభావం

ధరలకు కళ్లెం వేయడంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ఫెయిల్ అయినట్టు 57 శాతం మంది అభిప్రాయపడ్డారు. ధరాఘాతాన్ని దృష్టిలో ఉంచుకొనే ఈ ఎన్నికల్లో ఓటేస్తామని 23 శాతం మంది ఓటర్లు చెప్పారు. ఈ మేరకు సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్), లోక్‌నీతి సంయుక్తంగా జరిపిన సర్వేలో తేటతెల్లమైంది. అంతర్జాతీయ పరిణామాలను అటుంచితే, ధరల కట్టడికి అవకాశం ఉన్నప్పటికీ విధానపరంగా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని సర్వేలో పాల్గొన్న మెజారిటీ ఓటర్లు అభిప్రాయపడ్డారు. గడిచిన 43 ఏండ్లలో ఎన్నడూ చూడని స్థాయిలో ధరలు పెరిగినట్టు వాపోయారు. ఈ వివరాలను ఇంగ్లిష్ పత్రిక 'మింట్' ప్రచురించింది.

పదేండ్లలో వేటి ధర ఎంతలా పెరిగిందంటే??

ఇంధనం	2014	2024	పెరుగుదల
పెట్రోల్	రూ. 71	రూ. 107	50.7%
డీజిల్	రూ. 55	రూ. 95	72.72%
వంటగ్యాస్	రూ. 399	రూ. 855	114.28%
నిత్యావసరాలు (కిలోకు)	**2014**	**2024**	**పెరుగుదల**
బియ్యం	రూ. 27	రూ. 65	140%
పల్లినూనె	రూ. 83	రూ. 155	86%
గోధుమపిండి	రూ. 22	రూ. 65	195%
ఉప్పు	రూ. 10	రూ. 25	150%
చక్కెర	రూ. 24	రూ. 48	100%
పాలు (లీటర్)	రూ. 38	రూ. 65	71%
ఆలుగడ్డలు	రూ. 18	రూ. 35	94%
చాయపత్త	రూ. 194	రూ. 320	64%
చింతపండు	రూ. 40	రూ. 160	300%
పప్పుదినుసులు (కిలో)	**2014**	**2024**	**పెరుగుదల**
కందిపప్పు	రూ. 50	రూ. 160	220%
మినపప్పు	రూ. 32	రూ. 150	368%
శనగపప్పు	రూ. 24	రూ. 75	212%
ఇతర ఆహారం	**2014**	**2024**	**పెరుగుదల**
అరటిపండ్లు (డజను)	రూ. 33	రూ. 65	96%
కోడిగుడ్లు (డజను)	రూ. 38	రూ. 70	84%

ముగ్గురు సభ్యులున్న కుటుంబం భోజనం ఖర్చు

సంవత్సరం	వారానికి	రోజుకు	ప్లేటుకు	పెరుగుదల
2014	రూ. 1,008	రూ. 144	రూ. 48	–
2024	రూ. 2,000	రూ. 285	రూ. 95	98%



బీజేపీ ఎంపీపై భార్య పోటీ

లక్నో: యూపీలోని ఇటావా లోక్‌సభ స్థానంలో భార్యాభర్తల మధ్య పోటీ నెలకొంది. బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ రామ్ శంకర్ కతేరియా మరోసారి పోటీ చేస్తున్నారు. అయితే, అనూహ్యంగా బుధవారం ఇదే స్థానానికి రామ్ శంకర్ కతేరియా భార్య మ్రిదుల కతేరియా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ ఆమె ఇలానే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పటికీ చివరి నిమిషంలో ఉపసంహరించుకున్నారు. కాబట్టి, ఆమె ప్రతిసారి నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకుంటారని కతేరియా అన్నారు. అయితే, తాను నామినేషన్ వేసింది విత్‌డ్రా చేసుకోవడానికి కాదని, ఈసారి తాను పోటీ చేస్తానని మ్రిదుల ప్రకటించారు.

వాట్సాప్‌లో సుప్రీంకోర్టు సేవలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కేసుల ఫైలింగ్, లిస్టింగ్, ఇతర వివరాలను ఇకపై న్యాయవాదులకు వాట్సాప్‌లో పంపిస్తామని సీజేఐ చంద్రచూడ్ గురువారం వెల్లడించారు. ఈ కొత్త సౌకర్యం ద్వారా అడ్వొకేట్లు, కక్షిదారులు కేసుల ఫైలింగ్, కోర్టు ఆర్డర్లు, తీర్పులు వాట్సాప్‌లో పొందుతారన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులందరికీ కాజ్‌లిస్టులను వాట్సాప్ (8767687676) ద్వారా పంపిస్తామన్నారు.

బుర్కినాఫాసోలో 200 మందికిపైగా ఊచకోత

డాకర్: బుర్కినా ఫాసో దేశ ఆర్మీపై మానవ హక్కుల సంఘం తీవ్ర ఆరోపణలు చేసింది. మిలిటెంట్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై 223 మంది పౌరులను ఆర్మీ ఊచకోత కోసిందని హ్యూమన్ రైట్స్ వాచ్ వెల్లడించింది. బాధితుల్లో పిల్లలు, పసికందులు ఉన్నారంది. దేశ ఉత్తర ప్రాంత గ్రామాలైన నాండిన్, సోరోలపై ఫిబ్రవరిలో ఈ ఊచకోత జరిగిందని తెలిపింది.

మీ ఉద్యోగాలనూ కాంగ్రెస్ లాక్కుంటుంది

- ఇంటిలో ఇద్దరు ఉద్యోగం చేస్తుంటే, ఒక ఉద్యోగాన్ని 'వనరులపై మొదటి హక్కు' ఉన్నవారికి పంచేస్తుంది
- ఓటు బ్యాంక్ కోసం కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు
- ఇందిర ఆస్తి కోసం వారసత్వ పన్ను రద్దు చేసిందే రాజీవ్‌గాంధీ
- ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

బరేలీ (యూపీ), ఏప్రిల్ 25 : కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా కూటమి' పార్టీలపై ప్రధాని మోదీ విమర్శలతో విరుచుకుపడ్డారు. గురువారం బరేలీ ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ, 'మీ ఇంటిలో ఇద్దరికి ఉద్యోగాలుంటే..ఒక ఉద్యోగాన్ని కాంగ్రెస్ లాక్కొని, 'వనరులపై మొదటి హక్కు' ఉన్నవారికి అప్పగిస్తుంది' అంటూ సంచలన ఆరోపణలు చేశారు. యాదవ్, కుష్వాహా, మౌర్య, గుర్జర్, రాజ్‌భర్, తెలి, పాల్ వర్గాలతో సహా వెనుకబడిన తరగతులను ప్రస్తావిస్తూ, 'మీ రిజర్వేషన్ హక్కును కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు లాక్కోకుండా నేను అడ్డుకుంటా. ఇది మోదీ గ్యారంటీ. వెనుకబడిన, దళిత కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు ఉద్యోగం చేస్తే, ఒకరి ఉద్యోగాన్ని తీసివేసి.. దేశ వనరులపై మొదటి హక్కు ఉన్నవారికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఇస్తాయి' అంటూ ఓటర్లను హెచ్చరించారు. యూపీలోని షాజహాన్‌పూర్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, బుజ్జగింపు రాజకీయాలు ఇద్దరు యువరాజుల్ని ఒక్కదగ్గరికి చేసిందని రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి అన్నారు. మధ్యప్రదేశ్‌లోని మొరెనాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ, '1985లో రద్దు చేసిన వారసత్వపు పన్ను చట్టాన్ని మళ్లీ తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు చెప్పటం హాస్యాస్పదంగా ఉంది. ఈ చట్టాన్ని మళ్లీ తెస్తే అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతారు' అని అన్నారు. 'ముస్లిం వర్గాల ఓటు బ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను కాంగ్రెస్ లాక్కోవాలని చూస్తున్నది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించటం చట్ట విరుద్ధం. రాజ్యాంగ విరుద్ధం. ఓబీసీ హక్కులను లాక్కోవడానికి కాంగ్రెస్ తమ అభిమాన ఓటు బ్యాంక్‌ను బలోపేతం చేసేందుకు ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటున్నది. మతపరమైన బుజ్జగింపుతో అధికారాన్ని కైవసం చేసుకోవాలని అనుకుంటున్నది' అని అన్నారు.

మోదీ, రాహుల్ వ్యాఖ్యలపై ఈసీ నోటీసులు

బీజేపీ, కాంగ్రెస్‌లకు తాఖీదులు

న్యూఢిల్లీ: ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ ప్రధాని మోదీ, కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీపై వచ్చిన ఫిర్యాదులపై ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎట్టకేలకు స్పందించింది. బీజేపీ, కాంగ్రెస్ చీఫ్‌లకు గురువారం ఈసీ నుంచి నోటీసులు జారీ అయ్యాయి. అయితే ఈ నోటీసుల్లో ఎక్కడా ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీల పేర్లను ప్రస్తావించలేదు. వారికి వేరు వేరుగా నోటీసులు జారీచేస్తుందా? అన్నదానిపై ఈసీ స్పష్టత ఇవ్వలేదు. ఈ సందర్భంగా ఈసీ రాజకీయ పార్టీలకు కీలక సూచనలు జారీచేసింది. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్ల ప్రవర్తనకు, వారి వ్యాఖ్యలకు రాజకీయ పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది. రాజస్థాన్‌లో మోదీ చేసిన ప్రసంగంపై కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ కూడా ఈసీని ఆశ్రయించింది. ఏప్రిల్ 29 ఉదయం 11 గంటల్లోగా ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గేకు ఈసీ నోటీసులిచ్చింది.

ప్రైవేటు ఆస్తిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చు

- మహారాష్ట్ర కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ప్రైవేటు ఆస్తిలో ప్రభుత్వ జోక్యం చేసుకోవద్దని చెప్పడం సరికాదని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సమాజ వనరులు అంటే కేవలం ప్రభుత్వ ఆస్తులు మాత్రమేనని, ప్రైవేటు ఆస్తులను సమాజ వనరులుగా చూడొద్దని చెప్పడం ప్రమాదకరమని పేర్కొన్నది. మహారాష్ట్ర ప్రభుత్వం 1986లో మహారాష్ట్ర గృహ నిర్మాణ, ప్రాంత అభివృద్ధి చట్టం-1976కు చేసిన చట్ట సవరణ అంశాన్ని బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. 70 శాతం మంది యజమానులు అంగీకరిస్తే ప్రభుత్వం ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకొని పునరుద్ధరించవచ్చని ప్రభుత్వం ఈ చట్ట సవరణ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ముంబైలోని ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్(పీఓఏ) హైకోర్టును ఆశ్రయించగా 1991 డిసెంబరులో బాంబే హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో పీఓఏ సుప్రీంకోర్టుకు వెళ్లింది.

ఇలాంటి ఆలోచన ప్రమాదకరం: సుప్రీం

విచారణ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ప్రైవేటు ఆస్తి సంపూర్ణంగా ప్రైవేటుదే అని చెప్పేది పూర్తిగా పెట్టుబడిదారీ భావన అవుతుంది. అలాగే ఏ ఆస్తి కూడా వ్యక్తులకు మాత్రమే పరిమితమైనదని కాదని, ఆస్తులన్నీ సమాజానివని చెప్పేది పూర్తిగా సామ్యవాద దృక్పథం. మన దేశానిది పూర్తిగా సామ్యవాద పద్ధతి కాదు. ప్రైవేటు ఆస్తి అనేది ఉంటుంది. అయితే, సమాజ వనరులు అంటే కేవలం ప్రభుత్వ వనరులే అని, వ్యక్తులకు సంబంధించిన ప్రైవేటు ఆస్తులు సమాజ వనరులు కావని చెప్పడం కూడా సరికాదు. ఇలాంటి ఆలోచన ప్రమాదకరం' అని వ్యాఖ్యానించారు. ప్రైవేటు ఆస్తిపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ దుమారం నెలకొన్న నేపథ్యంలో సుప్రీం వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది.



'అలాగైతే భారత్‌లో వాట్సాప్ ఉండదు'

న్యూఢిల్లీ: గోప్యతను వదిలేయాల్సి వస్తే వాట్సాప్ భారత్ నుంచి బయటకు వెళ్లిపోతుందని 'మెటా' సంస్థ ఢిల్లీ హైకోర్టుకు వెల్లడించింది. ఐటీ రూల్స్ – 2021లోని 4(2) నిబంధనను సవాల్ చేస్తూ వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఏదైనా పోస్ట్ లేదా సమాచారం మొదట ఎవరి వద్ద నుంచి వచ్చిందనేది సోషల్ మీడియా సంస్థలు గుర్తించాలని ఈ నిబంధన చెప్తున్నది. అయితే, ఇలా చేయాలంటే కోట్లాది మెసేజ్‌లను ఏండ్ల తరబడి స్టోర్ చేయాల్సి ఉంటుందని వాట్సాప్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్(ఎక్కడా మెసేజ్ స్టోర్ కాకుండా నేరుగా పంపించిన వారి నుంచి అందుకునే వారికి వెళ్లడం) విధానానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఎండ్ టూ ఎండ్ ఎన్‌క్రిప్షన్ వల్ల గోప్యత ఉంటుందనే నమ్మకంతోనే వినియోగదారులు వాట్సాప్‌ను వినియోగిస్తున్నారని, దీనికి భంగం కలిగే పరిస్థితే వస్తే తమపై వినియోగదారుల నమ్మకం దెబ్బతింటుందని వివరించారు.

యూపీఎస్సీ-2025 ఉద్యోగ క్యాలెండర్ విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కేంద్రంలోని ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించే పరీక్షల క్యాలెండర్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) విడుదల చేసింది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు నిర్వహించే పరీక్షల తేదీలను చార్ట్‌లో పొందుపరిచింది. ఆ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 11 వరకు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించి 25న పరీక్ష నిర్వహిస్తారు. అదే ఏడాది ఆగస్టు 22 నుంచి ఐదు రోజుల పాటు యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. అలాగే సీబీఐ (డీఎస్పీ), ఇంజనీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ), సీఐఎస్ఎఫ్, ఎన్‌డీఏ, ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్, సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, సీడీఎస్, కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ తదితర ఉద్యోగ నియామక షెడ్యూల్‌ను ఆ చార్ట్‌లో వివరించింది.

ఐఐటీయన్లకూ కొలువుల వర్రీ

- క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో 40% మందికి నో జాబ్స్
- ఉద్యోగాలు వచ్చినా.. ప్యాకేజ్ మాత్రం తక్కువే
- ఆర్థిక మందగమనమే కారణమంటున్న నిపుణులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ఐఐటీల్లో చదివిన వారందరికీ ఉద్యోగాలు పక్కా, లక్షల్లో, కొందరికి కోట్లలో ప్యాకేజీలు ఖాయం అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు పరిస్థితులు కఠినంగా మారుతున్నాయి. ఐఐటీల్లో చదివినవారిలో దాదాపు 40 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఉద్యోగాలు లభించడం లేదని, ఉద్యోగాలు వచ్చినవారిలోనూ చాలామందికి రూ.10 లక్షల లోపే వార్షిక వేతనం ఉంటుందని కొన్ని నివేదికలు చెప్తున్నాయి. ఉద్యోగాల కల్పన సేవలు అందించే ఆఫీస్ ఆఫ్ కెరీర్ సర్వీసెస్(ఓసీఎస్)లో 1,814 మంది ఐఐటీ-ఢిల్లీ విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకుంటే 1,083 మందికే లభించాయి. అంటే దాదాపు 40 శాతం మందికి ఉద్యోగాలు దొరకలేదు. గత ఐదేండ్లలో 22 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దొరకలేదని ఓ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైంది. ఇక ఐఐటీ-కాన్పూర్ విషయానికి వస్తే.. 2022లో 90 శాతం మందికి, 2023లో 91 శాతం మందికి ఉద్యోగాలు లభిస్తే ఈ ఏడాది మాత్రం 69 శాతం మందికే ఉద్యోగాలు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఐఐటీ-బాంబేలో గత ఏడాది 1,485 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దొరకగా 32.8 శాతం మందికి నిరాశే ఎదురైంది. ఇంతకుముందు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు వచ్చి 6 - 8 మందిని ఎంపిక చేసుకునే కంపెనీలు ఇప్పుడు గరిష్ఠంగా ఒకరిద్దరిని మించి ఎంపిక చేయడం లేదు. దీంతో ఐఐటీల్లోని ప్లేస్‌మెంట్ కార్యాలయాల అధికారులు క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు ఎక్కువ కంపెనీలు హాజరయ్యేలా చూసేందుకు ప్రయత్నిస్తున్నారు.

రూ.10 లక్షల లోపే వార్షిక వేతనం

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఉద్యోగాల భర్తీ తగ్గిపోవడం ఒక సమస్య అయితే.. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు లభిస్తున్న వేతనాలు కూడా అంతగా ఆశాజనకంగా లేవు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లలో ఎంపికైన చాలామందికి రూ.10 లక్షల లోపు వార్షిక వేతనాన్ని మాత్రమే ఇచ్చేందుకు కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో ఓ కంపెనీ ట్రెయినీ ఇంజినీర్ ఉద్యోగాలకు రూ.3.6 లక్షలు, ట్రెయినీ డిజైన్ ఇంజినీర్ ఉద్యోగాలకు రూ.6 లక్షల వార్షిక వేతనం మాత్రమే ఆఫర్ చేసింది. వివిధ ఐఐటీల్లో చదువుతున్న చాలా మంది విద్యార్థులు రూ.6 – 7 లక్షల వార్షిక వేతన ప్యాకేజీలకు ఉద్యోగాలు పొంది.. తర్వాత అది సరిపోక మళ్లీ కొత్త ఉద్యోగాలను వెతుక్కుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ప్రభావం వల్లనే ఐఐటీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, వేతనాలు తగ్గుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.



హార్లిక్స్‌పై 'హెల్త్ డ్రింక్' లేబుల్ తొలగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: ప్రసిద్ధి గాంచిన హార్లిక్స్.. కంపెనీ తన లేబుల్‌పై కీలక మార్పులు చేసింది. 'హార్లిక్స్'ను 'హెల్త్ డ్రింక్'గా పేర్కొన్న 'హిందుస్తాన్ యూనిలీవర్' (హెచ్‌యూఎల్), దాన్ని తొలగించి..'ఫంక్షనల్ న్యూట్రీషినల్ డ్రింక్స్'గా మార్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఇటీవల జారీచేసిన ఉత్తర్వుల మేరకు హెచ్‌యూఎల్ ఈ మార్పును చేపట్టినట్టు తెలుస్తున్నది. బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నాయన్న ఆరోపణలు రావటంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ దీనిపై స్పందిస్తూ, ఈ అంశంపై విచారణ జరపాలని 'ఎఫ్ఎస్ఎస్ఏఐ'ని ఆదేశించింది. దీంతో కంపెనీలు తమ ఆహార ఉత్పత్తుల లేబుల్‌పై మార్పులు చేసినట్టు తెలుస్తున్నది.



'స్త్రీ ధనంపై భర్తకు హక్కు ఉండదు'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పెళ్లి సందర్భంగా వధువుకు పుట్టింటి వారు బహుమతిగా ఇచ్చే స్త్రీ ధనంపై సుప్రీం కోర్టు కీలకమైన తీర్పును వెలువరించింది. స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి నియంత్రణ ఉండదని, అయితే కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దాన్ని వాడుకోవచ్చునని, అయితే తర్వాత దానిని, లేదా దానికి సరిపడా మొత్తాన్ని భార్యకు తిరిగి ఇవ్వాల్సిన నైతిక బాధ్యత భర్తపైనే ఉందని స్పష్టం చేసింది. అది ఉమ్మడి ఆస్తి ఎంతమాత్రం కాదని, దానిపై ఎలాంటి ఆధిపత్యం కానీ, యాజమాన్య హక్కులు కానీ భర్తకు సంక్రమించవని పేర్కొంది. ఈ కేసులో భర్త వాడుకున్న 25 లక్షల విలువైన బంగారాన్ని తిరిగి ఆమెకు ఇవ్వాల్సిందేనని జస్టిస్‌లు సంజయ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఒక కేసులో తీర్పు చెప్పింది.

'కాళేశ్వరం'పై విచారణ షురూ

- కమిషన్ ఎదుట ప్రాజెక్టుపై నీటిపారుదలశాఖ ప్రజెంటేషన్
- ఇరిగేషన్ సెక్రటరీ నేతృత్వంలో నోడల్ బృందం ఏర్పాటు
- అవసరమైతే కేసీఆర్ వివరణ కోరతామన్న జస్టిస్ ఘోష్
- ఫిర్యాదుల స్వీకరణకు బీఆర్కే భవన్‌లో ప్రత్యేక బ్యాక్సులు



హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణ గురువారం ప్రారంభమైంది. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ రాష్ట్ర నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై సుదీర్ఘంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన ప్రారంభించనున్నట్టు చెప్పారు. ప్రాజెక్టులోని నిర్మాణ లోపాలు తదితర అంశాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కలకత్తాకు చెందిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. విచారణ కోసం బీఆర్కే భవన్‌లో ఇప్పటికే ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కమిషన్‌కు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా నేతృత్వంలో నోడల్ అధికారుల బృందాన్ని నియమించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. విచారణకు అంగీకరించిన కమిషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జస్టిస్ ఘోష్‌తో సమావేశమై కాళేశ్వరం అంశాలను వివరించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. జస్టిస్ ఘోష్‌కు ఏపీ సీజేగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లోక్‌పాల్‌గా అపార అనుభవం ఉన్నదని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నివేదికనివ్వాలని కమిషన్‌కు కోరినట్టు చెప్పారు. కమిషన్ అడిగిన వివరాలను అందిస్తామని తెలిపారు. విచారణకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. మేడిగడ్డ ఆనకట్టపై ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ప్రకారం మరమ్మతులు,అంశాలపై చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఉత్తమ్ వివరించారు.

అవసరమైతే కేసీఆర్‌ను పిలుస్తాం

జస్టిస్ ఘోష్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై రెండు మూడు రోజుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. తాను స్వతహాగా ఇంజినీర్‌ను కాదని తెలిపారు. విచారణలో నిపుణుల అభిప్రాయాలను, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్ రిపోర్టులను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్ర ఇంజినీర్లతో, ఎన్డీఎస్ఏ అథారిటీతో సమావేశం అవుతామని చెప్పారు. బరాజ్‌లతో సంబంధం ఉన్న అందరినీ కలుస్తామని, కావాల్సిన సహాయక సహకారాలను తీసుకుంటామని వెల్లడించారు. నిర్మాణ సంస్థలతోపాటు అవసరమైతే రాజకీయ నేతలకు నోటీసులు ఇస్తామని తెలిపారు. అవసరమైతే మాజీ సీఎం కేసీఆర్‌ను పిలిచి వివరాలు సేకరిస్తామని తెలిపారు. లీగల్ అంశాల ఆధారంగానే విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఫిర్యాదుతోపాటు అఫిడవిట్ ఉండాలి

జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తెలిపారు. ఇందుకోసం బీఆర్కే భవన్ 8వ అంతస్థులో ప్రత్యేక బ్యాక్సులను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. ఫిర్యాదు చేయాలనుకునేవారు ఫిర్యాదు/వినతిపత్రాలను ఆధారాలతోసహా నోటరీ ద్వారా ప్రమాణపూర్వక అఫిడవిట్ రూపంలో సీల్డ్ కవర్‌లో ఉంచి పెట్టెల్లో వేయాలని కోరారు. పోస్ట్ ద్వారా అయినా పంపవచ్చని చెప్పారు. మే 31 వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. నోటరీ అఫిడవిట్ లేని, సాక్ష్యాధారాలు లేని పత్రాలను తిరస్కరిస్తామని స్పష్టంచేశారు.

మే 27న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- వరంగల్-నల్లగొండ-ఖమ్మం స్థానానికి షెడ్యూల్ విడుదల
- మే 2 నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఆది నుంచీ బీఆర్‌ఎస్‌కు కంచుకోట

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్	
నోటిఫికేషన్, నామినేషన్లు	మే 2
నామినేషన్ల చివరి తేదీ	మే 9
నామినేషన్ల పరిశీలన	మే 10
ఉపసంహరణ	మే 13
పోలింగ్ తేదీ	మే 27
పోలింగ్ సమయం	ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు
ఓట్ల లెక్కింపు	జూన్ 5

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): వరంగల్-నల్లగొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికను మే 27న నిర్వహిస్తారు. నామినేషన్లను మే 2 నుంచి 9 వరకు స్వీకరిస్తారు. జూన్ 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నియోజకవర్గం నుంచి శాసనమండలిలో ప్రాతినిధ్యం వహించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానానికి ఎన్నికయ్యే వారు 2027 మార్చి 29 వరకు ఆ పదవిలో కొనసాగుతారు. నియోజకవర్గం పరిధిలోని మొత్తం 12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 600 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గం మొదటి నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్నది. గతంలో రెండుసార్లు బీఆర్‌ఎస్ తరఫున కపిలవాయి దిలీప్‌కుమార్, ఆ తరువాత రెండుసార్లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఈసారి కూడా బీఆర్‌ఎస్ అభ్యర్థికే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. త్వరలోనే బీఆర్‌ఎస్ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం.



మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో వరంగల్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి తదితరులు

నాడు ఓటుకు నోటు.. నేడు ఓటుకు ఒట్టు

- రేవంత్ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారు : హరీశ్‌రావు

తొర్రూరు, ఏప్రిల్ 25: నాడు తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలని ఓటుకు నోటుతో, నేడు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని వాడుకుంటూ ఓటుకు ఒట్టుతో రేవంత్‌రెడ్డి మోసం చేసేందుకు మరోసారి సిద్ధమయ్యారని హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చారని ధ్వజమెత్తారు. నాలుగున్నర నెలలైనా అమలు చేయకపోవటంతో ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని దేవుళ్ల మీద ఒట్లు వేస్తూ మళ్లీ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాలకుర్తి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, బస్వరాజ్ సారయ్య, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజీనామా లేఖతో నేనొస్తున్నా

మొదటిపేజీ తరువాయి...

గమనించాలని అన్నారు. 'మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలు చేసి మూడు జిల్లాలకు మూడు మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది కేసీఆరే. రూ.100 కోట్లతో మెదక్‌కు రైలు సౌకర్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే. మెదక్‌లో నాలుగు లేన్ల రోడ్డు, హల్దీ వాగులోకి నీళ్లు అందించిందీ బీఆర్‌ఎస్ సర్కారే' అని వివరించారు. 1952లో బీహెచ్ఈఎల్ ఏర్పాటైతే, ఇందిరాగాంధీ మెదక్ నుంచి ఎంపీగా గెలిచిన 1980లో ఏర్పాటు చేశారని రేవంత్ చెప్పడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. స్క్రిప్ట్ రాసేవానికి లేకున్నా, చదివేవారికి బుద్ధి ఉండాలని చురక అంటించారు. 'నీ ఇజ్జత్ పోయినా ఫర్వాలేదు. సీఎం కుర్చీ ఇజ్జత్ తీస్తున్నవ్' సీఎం రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

దేవుళ్లపై ప్రమాణాలు

సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళితే అక్కడ దేవుళ్లపై ప్రమాణాలు చేస్తున్నారని, రేవంత్ ఎన్ని ప్రమాణాలు చేసినా ప్రజలు నమ్మబోరని హరీశ్ అన్నారు. 'నా ఎత్తు మీద ఉన్న ధ్యాస రైతుల ధాన్యం కొనుగోలు చేయటంలో చూపెట్టు. భువనగిరిలో ఎస్సీ మహిళలపై అరాచకాలు జరుగుతున్నా, 280 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా, ఆటో కార్మికుల ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోలె' అని విమర్శించారు. అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు గాల్లో తేలుతున్నారని, ఎంపీ ఎన్నికల్లో బుద్ధి చెబితే భూమ్మీదికి వస్తారని మండిపడ్డారు.

బీజేపీ మాటలు నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్టే

బీజేపీ మాటలు నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్టేనని హరీశ్‌రావు అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క మెడికల్, నర్సింగ్ కళాశాల కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. దుబ్బాకలో ఎడ్లు, నాగలి ఇస్తామని మోసం చేసిన రఘునందన్‌రావుకు ప్రజలు బుద్ధి చెప్పారని, ఎంపీ ఎన్నికల్లో సైతం బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు తక్కువ కాలంలోనే నీళ్లు ఏవో, పాలు ఏవో తెలిశాయని, టీవీ 9 చర్చలో కాంగ్రెస్ మోసాలను కేసీఆర్ కండ్లకు కట్టినట్టు వివరించారని గుర్తు చేశారు. కేసీఆర్ బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభిస్తున్నదని, పార్లమెంటు ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవటం ఖాయమని తెలిపారు. ఉన్న జిల్లాలను ఎత్తివేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్ర చేస్తున్నదని, ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. ఎంపీగా పోటీ చేసే అభ్యర్థుల్లో ఒకరు బ్లాక్‌మెయిలర్ అని, ఒకరు 6వ తరగతి అని, మన మాజీ కలెక్టర్ అయితేనే పార్లమెంట్‌లో మన హక్కుల కోసం పోరాటం చేస్తారని చెప్పారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌గా విశేష సేవలు అందించిన వెంకట్రామిరెడ్డి ప్రజాసేవ చేసేందుకు వస్తున్నారని, రూ.100 కోట్ల ట్రస్టు ద్వారా ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందని, ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ర్యాలీలో ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింతాప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, చంద్రాగౌడ్, బట్టి జగపతి పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో తెలంగాణ సత్తా

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలంగాణ సత్తా చాటింది. రాష్ట్రానికి చెందిన 15 మంది విద్యార్థులు 300కు 300 మార్కులు సాధించారు. దేశవ్యాప్తంగా 56 మంది విద్యార్థులకు 100 పర్సంటైల్‌ను సొంత చేసుకోగా, వీరిలో 15 మంది (26%) టాపర్లు తెలంగాణకు చెందినవారే ఉన్నారు. 100 పర్సంటైల్ పొందిన వారిలో అత్యధికులు ఐదు రాష్ట్రాల నుంచే ఉన్నారు. మన రాష్ట్రం తర్వాత ఏపీ, మహారాష్ట్ర నుంచి ఏడుగురుచొప్పున 100 పర్సంటైల్ సొంతం చేసుకొన్నారు. రాష్ట్రానికి చెందిన హుండేకర్ విధిత్, ముత్తవరపు అనూప్, వెంకటసాయితేజ మదినేని, రెడ్డి అనిల్, రోహన్‌సాయి పబ్బా, శ్రీ యశాష్ మోహన్, కల్లూరి, కేసం చెన్నబసవారెడ్డి, మురికినాటి సాయిదివ్యతేజారెడ్డి, రిషి శేఖర్ శుక్లా, తవ్వ దినేశ్‌రెడ్డి, గంగా శ్రేయాష్, పొలిశెట్టి రితిశ్ బాలాజీ, తమటం జయదేవ్‌రెడ్డి, మావూరు జస్విత్, డీ శ్రీనివాస్‌రెడ్డి 300లకు 300 మార్కులు సాధించారు. క్యాటగిరీ ర్యాంకుల్లోనూ ఆలిండియా టాపర్లుగా నిలిచారు. ఆలిండియా ఎస్టీ టాపర్‌గా రాష్ట్రానికి చెందిన జగన్నాథం మెహిత్ సత్తాచాటారు.



ర్యాంకులు పొందిన విద్యార్థులతో శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ

'శ్రీ చైతన్య' విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియాలో 1, 3, 6,9 ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా క్యాటగిరీలో 10 లోపు 4 ర్యాంకులు, ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 100 లోపు 25 ర్యాంకులు, 200 లోపు 46 ర్యాంకులు సాధించినట్టు పేర్కొన్నారు. ఆలిండియాలో కేసీ బసవరెడ్డి 1వ ర్యాంకు, తోటంశెట్టి నిఖిలేశ్ 3వ ర్యాంకు, హిమాన్షు తాలర్ 6వ ర్యాంకు, రెడ్డి అనిల్ 9వ ర్యాంకులతో సత్తా చాటినట్టు వివరించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 272 మంది విద్యార్థులు వంద పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. ర్యాంకులు పొందిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు.



విద్యార్థులతో విజయసంకేతం చూపుతున్న 'నారాయణ' ఎండీలు పీ సింధూర, పీ శరణి

జేఈఈలో 'నారాయణ' హవా

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు 10 లోపు 6 అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల ఎండీలు పీ సింధూరనారాయణ, పీ శరణినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో జీ నీల్‌కృష్ణ 1వ ర్యాంకు, హెచ్ విదిత్ 5వ ర్యాంకు, ఎం అనూప్ 6వ ర్యాంకు, ఎం సాయితేజ 7వ ర్యాంకు, సీహెచ్ సతీశ్‌కుమార్ 8వ ర్యాంకు, ఆర్యన్ ప్రకాష్ 10వ ర్యాంకు, పీ రోహన్‌సాయి 12వ ర్యాంకు కైవసం చేసుకొన్నారని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీల్లో 100 లోపు 28, 1000 లోపు 171 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఆలిండియా అన్ని క్యాటగిరీల్లో 10లోపు 25, 100 లోపు 112, 1000 లోపు 735 ర్యాంకులతో ప్రతిభ చూపారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, సిబ్బందిని అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో 89% ఉత్తీర్ణత

హైదరాబాద్, ఏప్రిల్25 (నమస్తే తెలంగాణ): మైనార్టీ గురుకులాల్లో ఇంటర్ చదువుతున్న 89 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మైనార్టీ గురుకులాల కార్యదర్శి ఆయేషా మస్రత్ ఖానం తెలిపారు. ఈ ఏడాది మొత్తం 17,543 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయగా, 14,352 మంది విద్యార్థులు పాసయ్యారని వెల్లడించారు. ఇంటర్ సెకండియర్ విద్యార్థులు 89శాతం, ఫస్టియర్ విద్యార్థులు 76 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ సత్తా

ఆలిండియా 3, 8వ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ పూర్వ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో మొదటి 100లోపు ర్యాంకుల్లో 17 ర్యాంకులు సాధించి సత్తా చాటారని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తోటంశెట్టి నికిలేశ్ ఆలిండియా 3వ ర్యాంకు, అరిపికట్ల తేజస్వి 8వ ర్యాంకు, పీ విద్య ప్రవీణ్ 14వ ర్యాంకు, సతివాడ జ్యోతిరాధిత్య 17వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు. మొదటి 100 లోపు ర్యాంకుల్లో వివిధ క్యాటగిరీలలో 3, 8, 14, 17, 20, 21, 23, 28, 31, 35, 41, 48, 55, 56, 69, 84, 99 ర్యాంకులు కైవసం చేసుకొన్నట్టు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక సిబ్బందికి అభినందనలు తెలిపారు.



అంబులెన్స్ రాక.. ఆటోలో దవాఖానకు గర్భిణి

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం పూనగూడకు చెందిన పెందోర్ విజ్జుబాయికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆశా కార్యకర్త అంజన్నబాయి 108, 102 (ఎమర్జెన్సీ, అమ్మ ఒడి) అంబులెన్స్ డ్రైవర్లకు ఫోన్ చేయగా అందుబాటులో లేమని చెప్పారు. దీంతో ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్‌తోపాటు ఆదివాసీ సంఘాల నేతలు పెందోర్ తెలంగ్‌రావ్, కుడ్మెత దుర్గారావు, పెందోర్ చందు, దేవురావు, గ్రామస్థులు కలిసి ప్రైవేట్ ఆటోలో గర్భిణీని ఝరి దవాఖానకు తరలించారు. -నార్నూర్



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్ విద్యార్థుల విజయఢంకా

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో విజయఢంకా మోగించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనిటాట్స్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. ఫలితాల్లో ఎం హర్షిత్ 252వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, ఏ వర్జన్ రావు 444, పీ మనోహర్ 466, జీ శ్రీహాస్ 503, బీ భరద్వాజ్ నాయక్ 781, పీ చందన 1213, సత్యాఅమూల్యా 1301, సుభోదౌదరి 1367, కే శ్రీనిధి 1562, ఎండీ షఫిక్ 1603, మిత్ర 1612, సీహెచ్ అనూహ్య 1632, ఏ శివవరుణ్ 1719, ఎన్ ప్రణయ్ 1721, పీ రాహుల్ 1751, ఎం ప్రణీత్ రెడ్డి 1912, జే ఉమామైత్ర 1953, ఎల్ అరుణ్ కుమార్ 2353, సీహెచ్ సిద్దార్థ 2444, పీ రఘువీరారెడ్డి 2510, కే విశాల్ రెడ్డి 2557, కే రోహన్ ప్రీత్ 2643, జే హర్షవర్ధన్ 2908, జీ లహరి 2965వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేశారని తెలిపారు.

ఎస్సార్ విద్యాసంస్థల ప్రభంజనం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ప్రభంజనం సృష్టించారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి తెలిపారు. ఓపెన్ క్యాటగిరీలో దొంతుల మనీశ్ 126 ర్యాంకు, ఆలిండియా రిజర్వేషన్ క్యాటగిరీలో జీ నవీన్ 5వ ర్యాంకు, ఏ నందిని 12వ ర్యాంకు, వై సాత్విక్‌రెడ్డి 42వ ర్యాంకు, జీ కాలు 55వ ర్యాంకు సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్ఠను జాతీయస్థాయిలో నిలబెట్టారని పేర్కొన్నారు. అదేవిధంగా, దాసరి కార్తిక్ 131, జే శ్రీధన్‌రెడ్డి 144, కే ప్రశాంత్‌రెడ్డి 148, తుమ్మ తేజస్వీ 149, కాసారాం అఖిల్‌యాదవ్ 154, పీ నిహాల్ శ్రీవాత్సవ్ 186, కే శ్రీరాంరెడ్డి 192, తుమాటి అమృతవర్షిణి 201, కే రమణారెడ్డి 211, టీ శ్రేష్ఠ 225, పీ రిత్విక్ 314ర్యాంకుతో పాటు ఓపెన్ అన్ని క్యాటగిరీలలోకలిపి ఆలిండియాలో వరుసగా 357, 385, 430, 431, 433, 497, 530, 614, 550, 599, 625, 662, 730, 782, 783, 788, 800, 861, 870, 872, 944 ర్యాంకులు కైవసం చేసుకొన్నట్టు వివరించారు. ఇప్పటివరకు 3,256 మందికిపైగా విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్టు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల గడువు ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 893 మంది అభ్యర్థులు 1488 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి 114 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఆ తరువాత చేవేళ్లలో 64 మంది, పెద్దపల్లిలో 63, భువనగిరిలో 61 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. అతి తక్కువగా ఆదిలాబాద్‌లో 23 మంది, నాగర్ కర్నూల్‌లో 34 మంది నామినేషన్ వేశారు. శుక్రవారం అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించనున్నారు. 29న నామినేషన్ ఉపసంహరణ గడువు ముగియనున్నది. అదే రోజు బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను, వారి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తారు.

నకిలీ విత్తనాల కట్టడి అవసరం

ఎఫ్ఏవో డైరెక్టర్ జనరల్ డొంగ్యూ

హైదరాబాద్, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఆహార సంస్థ(ఎఫ్ఏవో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ క్యూ డొంగ్యూ సూచించారు. బుధవారం ఇటలీలో అంతర్జాతీయ విత్తన పరీక్ష ప్రమాణాల సంస్థ (ఇస్టా) అధ్యక్షుడు డాక్టర్ కేశవులు, డొంగ్యూతో భేటీ అయ్యా రు. విత్తన రంగం సమస్యలు, పరిష్కారాలపై డొంగ్యూ సూచనలు చేసినట్టు కేశవులు తెలిపారు. ప్రభుత్వరంగంలో విత్తనోత్పత్తి పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టెట్‌పై ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం!

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఉద్యోగార్థుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)పై ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రభావం పడనున్నదా? పరీక్షను వాయిదా వేయాల్సిందేనా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల షెడ్యూల్ గురువారం విడుదలైంది. మే 27న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నది. అయితే మే 20 నుంచి జూన్ 3 వరకు టెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో నిర్వహిస్తామని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. పోలింగ్ రోజు ఆయా జిల్లాల్లో సాధారణ సెలవుగా ప్రకటిస్తారు. టెట్ పరీక్షకు హాజరయ్యేవారంతా పట్టభద్రులేకానుండటంతో వీరంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలోనే టెట్ పరీక్షల నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. ఇప్పటివరకు ఏ తేదీన ఏ పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తారో వెల్లడించలేదు. ఎన్నికల షెడ్యూల్ దృష్ట్యా పేపర్ల వారీగా పరీక్షలు నిర్వహించే తేదీలతో కూడిన షెడ్యూల్‌ను విడుదల చేయాలని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వ్యతిరేకంగా రైతుల ధర్నా

ఓ అన్నదాత ఆత్మహత్యాయత్నం.. దవాఖానలో చికిత్స

దామెర, ఏప్రిల్ 25: విజయవాడ-నాగ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గురువారం వరంగల్-భూపాలపట్నం జాతీయ రహదారిపై రైతులు ధర్నాకు దిగారు. హనుమకొండ జిల్లాలోని మొగుళ్లపల్లి, గట్లకానిపర్తి, రంగాపురం, సీతారాంపురం, దుర్గంపేట, వెల్లంపల్లి, పులుకూర్తి ఊరుగొండ గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు ఊరుగొండ-పసరగొండ క్రాస్ వద్దకు చేరుకుని కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దామెర, ఆత్మకూరు పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించేందుకు యత్నించగా పోలీసులు, రైతులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే పరకాల మండలం వెల్లంలపల్లికి చెందిన లక్కం వేణు (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు రైతు వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను లాక్కొన్నారు. స్పృహతప్పి పడిపోయిన రైతు వేణును చికిత్స కోసం వరంగల్ జిల్లా ఆరెపల్లిలోని అపోలో ఎన్ఎస్ఆర్ దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు బూర్గుల రాంచందర్‌రావు, బొల్లు రాజిరెడ్డి, బొల్లు సమ్మిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో తమకు జీవనాధారమైన వ్యవసాయ భూములను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను జరుగనివ్వమని, ఒకవేళ బలవంతంగా హైవే నిర్మాణం చేపడితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు తేల్చి చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నదాతలు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రైతు సంఘాల నాయకులు పెంచాల సూర్యం, రవీందర్‌రెడ్డి, మంద సంధ్య, రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న రైతు వేణు

షుగర్ బాధితులకు ఓఆర్ఎస్ఎల్ వద్దు

ఓఆర్ఎస్ పౌడర్ వాడాలని నిపుణుల సూచన

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): షుగర్ బాధితులు ఓఆర్ఎస్ఎల్ వాడొద్దని, ఇది ప్రాణాంతకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీరసం, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు చాలా మంది ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం తెలిపిన ఓఆర్ఎస్‌కు బదులుగా ఓఆర్ఎస్ఎల్ డ్రింక్స్‌ను తీసుకుంటున్నారని, ఇది ప్రమాదకరమని డాక్టర్ శివరంజిని సంతోష్ తెలిపారు. షుగర్ బాధితులు ఇలాంటి డ్రింక్స్ తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడడంతో పాటు ప్రాణాంతకమయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఓఆర్ఎస్ఎల్ డ్రింక్స్‌లో చక్కెర స్థాయి అధికంగా ఉండడంతో కణాల్లో నుంచి నీరు రక్తనాళాల్లోకి చేరి, మూత్రం రూపంలో బయటకు వెళ్లిపోతుందని వివరించారు. దీంతో శరీరం మరింత డీహైడ్రేషన్‌కు గురవుతుందని తెలిపారు. ఇది షుగర్ బాధితులకు ప్రమాదకరమని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన ఓఆర్ఎస్ పౌడర్‌ను మాత్రమే వినియోగించాలని సూచించారు.

'శ్రీశైలం' రిజర్వేషన్‌కు 10% రాయితీ

- హైదరాబాద్ నుంచి గంటకో ఏసీ రాజధాని బస్సు
- టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లేందుకు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారికి తిరుగుప్రయాణంపై 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ గురువారం ట్వీట్(ఎక్స్) చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లే అన్ని సర్వీసుల్లోనూ ఈ రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. గంటకో ఏసీ బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. జేబీఎస్ నుంచి రూ.524, బీహెచ్ఈఎల్ నుంచి రూ.564 టికెట్ ధరగా నిర్ణయించారని తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం http://tsrtconline.in వెబ్‌సైట్‌ని సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి



విజయవాడ-హైదరాబాద్ హైవేపై ఆగి ఉన్న లారీని ఢీ కొన్న కారు

కోదాడ రూరల్, ఏప్రిల్ 25 : సూర్యాపేట జిల్లా కోదాడ శివారులో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన శ్రీకాంత్ హైదరాబాద్‌లోని మణికొండ ఫ్రెండ్స్ కాలనీలో ఉంటూ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. గురువారం చిన్న కూతురు లావణ్య పుట్టిన రోజు ఉండటంతో తన కుటుంబంతోపాటు అత్తగారి కుటుంబ సభ్యులతో కలిసి పుట్టు వెంట్రుకలు తీయించేందుకు బుధవారం రాత్రి విజయవాడ దగ్గర గల గుణదల మేరీమాత చర్చికి కారులో బయల్దేరారు. గురువారం తెల్లవారుజామున సుమారు 4.45 గంటల సమయంలో కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం శివారుకు చేరుకోగానే 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు వేగంగా వెళ్లి ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ (32), ఆయన పెద్ద కూతురు లాస్య (4)తోపాటు ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం-ఎల్ గ్రామానికి చెందిన మామ నల్లమల్ల రాంచందర్‌రావు (50), అత్త మాణిక్యమ్మ (45), బావమరిది కృష్ణంరాజు (26), కృష్ణంరాజు భార్య స్వర్ణకుమారి (23) అక్కడికక్కడే మరణించారు. శ్రీకాంత్ భార్య నాగమణి, చిన్న కూతురు లావణ్య, కృష్ణంరాజు కుమారులు కౌశిక్, కార్తీక్ గాయపడటంతో 108 అంబులెన్స్‌లో కోదాడ ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు ఖమ్మం తీసుకెళ్లారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే ప్రమాద స్థలాన్ని పరిశీలించి, దవాఖానకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. శ్రీకాంత్ బంధువు నందిగామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రాముడినీ బ్యాలెట్ బాక్స్ పైకి తెచ్చారు: రేణుకాచౌదరి

ఖమ్మం, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ.. మతాన్ని పెంచిపోషించిన బీజేపీ.. చివరికి శ్రీరాముడిని కూడా బ్యాలెట్‌బాక్స్ మీదికి తెచ్చిందని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి విమర్శించారు. ఓట్ల కోసం ఇంతలా దిగజారిన బీజేపీని ఆ శ్రీరాముడు కూడా క్షమించడన్నారు. ఖమ్మంలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ అనంతరం మీడియా పాయింట్ వద్ద గురువారం ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ మహిళల మంగళసూత్రాలపై చులకన వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదని చెప్పారు. 'సారే జహాసె అచ్చా' అంటూ దేశం గర్వించదగిన పాటను రచించినది కూడా ముస్లిమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

వివేక్.. నీ బట్టలూడదీసి కొడతా

- చెన్నూర్ ఎమ్మెల్యేకు బీజేపీ అభ్యర్థి గొమాసె హెచ్చరిక

పెద్దపల్లి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం ముప్పై ఏండ్లుగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్నది. వారిది స్థానికేతరుల కుటుంబం. మీడియా సంస్థలను అడ్డం పెట్టుకొని అవాకులు, చెవాకులు పేలుతున్నది. ఇలాంటి విధానాలను మానుకోలేకపోతే వివేక్ వెంకటస్వామి బట్టలూడదీసి కొడతా' అంటూ పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గొమాసె శ్రీనివాస్ తీవ్రంగా హెచ్చరించారు. గురువారం ఆయన పెద్దపల్లిలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అనంతరం సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి మాట్లాడుతూ తనపై అవాకులు చెవాకులు పేలితే ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. అనంతరం హరీశ్‌బాబు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానంటూ.. ఎక్కడికెళ్తే అక్కడి దేవుళ్లపై ఒట్టేస్తున్నారని, అలా కాకుండా తన కూతురుపై ఒట్టుపెట్టి చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ ఓటుకు నోటు కేసులో జూలైలో జైలుకు వెళ్లే అవకాశం ఉందని, అందుకే అభద్రతా భావంతో ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నారని విమర్శించారు. బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, నాయకుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌పై సీపీకి జర్నలిస్టుల ఫిర్యాదు

సుబేదారి, ఏప్రిల్ 25: నమస్తే తెలంగాణ దినపత్రిక సబ్ ఎడిటర్ కెంచ అశోక్‌పై దాడికి పాల్పడిన వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కే శ్రీధర్‌పై చర్యలు తీసుకోవాలని సంస్థ వరంగల్ ప్రతినిధులు పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝాను కోరారు. బుధవారం మడికొండ యూనిట్ ఆఫీస్‌కు వెళ్తున్న సబ్ ఎడిటర్ అశోక్‌పై మడికొండ చౌరస్తాలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దాడికి పాల్పడిన విషయం విదితమే. ఈ మేరకు గురువారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో అశోక్‌తో కలిసి 'నమస్తే తెలంగాణ' వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ అశోక్‌కుమార్, బ్యూరో ఇన్‌చార్జి గోపాల్, సీనియర్ సబ్ ఎడిటర్లు కిరణ్, సోమనర్సయ్య, క్రైం రిపోర్టర్ రాజ్‌కుమార్ సీపీని కలిసి ఫిర్యాదు లేఖ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అకారణంగా తన బైక్‌ను నెట్టివేయడంతో కిందపడగా చేతికి గాయమైందని, ఎక్కువ మాట్లాడితే ఎఫ్ఐఆర్ చేస్తానని బెదిరించారని బాధితుడు సీపీకి వివరించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటానని సీపీ హామీ ఇచ్చారు.